

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తాడేపల్లిగూడెం

fb.com/vaartha Digital

Published from Tadepalligudem, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Srikakulam

16-7-2026 గురువారం సంపుటి: 32 సంచిక: 166 పేజీలు: 8+4 వెల: 6.50



కాపునేత ముద్రగడకు కన్నీటి వీడ్కోలు 2లో

సెమికాన్ 2.0కు కేంద్రం గ్రీన్ సిగ్నల్ 5లో


## కృష్ణాడెల్టాకు 'పట్టిసీమ' సిరులు

### 2015 నుంచి 450 టిఎంసిల నీరు తరలింపు

### వంశధార నుంచి పెన్నా వరకు రివర్ లింకేజి లక్ష్యం

### ప్రతి ఎకరాకు సాగునీరు ప్రభుత్వ లక్ష్యం

### ఎన్టీఆర్ జిల్లా పవిత్ర సంగమం వద్ద సిఎం జలహారతి

### కెఎల్ రావు జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి నివాళులు



బుధవారం గోదావరి, కృష్ణానదుల పవిత్ర సంగమం వద్ద జలహారతి పడుతున్న సిఎం చంద్రబాబు

**విజయవాడ. జూలై 15, ప్రభాతవార్త ప్రతినిధి:** పట్టిసీమ ప్రాజెక్టు వల్లే కృష్ణా డెల్టాలో రైతులు సిరులు పండించారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. 2015 నుంచి ఇప్పటి వరకూ పట్టి సీమ ప్రాజెక్టు నుంచి 450 టిఎంసిల గోదావరి వరద జలాలను తరలించినట్టు వెల్లడించారు. రూ.1300 కోట్లతో నిర్మించిన పట్టి సీమ డెల్టాతో పాటు రాష్ట్రంలో విలువైన సంపద సృష్టికి కారణమైందని అన్నారు. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీం పట్నం వద్ద కృష్ణాగోదావరి నదుల పవిత్ర సంగమం వద్ద గోదావరి జలాలకు ముఖ్యమంత్రి జల హారతి ఇచ్చారు. సంప్రదాయ పంచె కట్టులో వచ్చిన ముఖ్యమంత్రి కృష్ణా గోదావరి నదుల సంగమ ప్రాంతంలో ప్రత్యేక పూజలు నిర్వహించి జలాలకు పుష్పమాల, వస్త్రాలు సమర్పించారు. సంప్రదాయక క్రతువులు నిర్వహించారు. అనంతరం ప్రముఖ ఇంజనీరు కెఎల్ రావు 124వ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం బహిరంగ సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. "సాగునీటి రంగానికి సేవలు అందించిన కెఎల్ రావు గారి 124 జయంతిని పురస్కరించుకుని >>2

## ఫార్మా సిటీలో భారీ అగ్ని ప్రమాదం

### తృటిలో తప్పిన పెను విషాదం

### 11 మంది ఉద్యోగులు సురక్షితం

**అనకాపల్లి(పరవాడ), జూలై 15, ప్రభాతవార్త:** అనకాపల్లి జిల్లా పరవాడ ఫార్మాసిటీలోని శ్రీ సాయి చందన ఎపిఐ లిమిటెడ్ పరిశ్రమలో మంగళవారం అర్థరాత్రి భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ప్రొడక్షన్ బ్లాక్-2లోని రియాక్టర్ వద్ద మిథనాల్ కారణంగా ఒక్కసారిగా మంటలు చెలరేగినా, సిబ్బంది అప్రమత్తతతో పాటు అగ్నిమాపక శాఖ సకాలంలో స్పందించడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడం ఊరటనిచ్చింది. పరిశ్రమలోని ప్రొడక్షన్ బ్లాక్-2 మొదటి అంతస్తులో ఉన్న రియాక్టర్ వద్ద అకస్మాత్తుగా పొగలు రావడంతో షిఫ్ట్ ఇన్‌చార్జ్‌తో పాటు విధుల్లో ఉన్న సిబ్బంది వెంటనే అప్రమత్తమై ఉద్యోగులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. అనంతరం రియాక్టర్‌లో ఉన్న మిథనాల్ కారణంగా మంటలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది ఫైర్ టెండర్లు, ఫోమ్ సహాయంతో మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. తెల్లవారుజామున 2 గంటలకే మంటలు అదుపులోకి రాగా, ఉదయం 3.30గంటలకు పూర్తిగా ఆర్పివేశారు. ప్రమాద సమయంలో ఒక ప్రొడక్షన్ ఇన్‌చార్జ్, ముగ్గురు కెమిస్టులు, ఏడుగురు హెల్పర్లు సహా మొత్తం 11 మంది ఉద్యోగులు విధుల్లో ఉన్నారు. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాకపోవడం, ప్రాణనష్టం జరగకపోవడంతో జిల్లాయంత్రాంగం, పరిశ్రమ యాజమాన్యం ఊపిరి పీల్చుకున్నాయి. ఘటనాస్థలాన్ని తహసీల్దార్ రత్నం, సీఐ ఎల్. భాస్కరరావు తదితర అధికారులు పరిశీలించి ప్రమాదానికి గల కారణాలపై వివరాలు సేకరించారు. పరిశ్రమలో ఉద్యోగులకు ముందస్తుగా భద్రతా శిక్షణ ఇవ్వడం, అత్యవసర పరిస్థితుల్లో అనుసరించాల్సిన విధానాలపై అవగాహన కల్పించడం వల్లే ఈ ప్రమాదం పెద్ద విషాదంగా మారలేదని అధికారులు పేర్కొన్నారు.

## దాల్మియాతో మరింత వృద్ధి

### చిన్నకొమెర్లలో దాల్మియా సిమెంట్ 2వ ప్లాంటుకు శంకుస్థాపన చేసిన మంత్రి లోకేష్

### రూ. 3100 కోట్ల పెట్టుబడులు

### 80 శాతం పైగా పునరుత్పాదక విద్యుత్ వినియోగం



బుధవారం చిన్నకొమెర్లలో దాల్మియా భారత్ సిమెంట్ పరిశ్రమ 2వ ప్లాంట్ విస్తరణ పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి నారా లోకేష్. చిత్రంలో మంత్రి సవిత తదితరులు

**జమ్మలమడుగు, జూలై 15, ప్రభాతవార్త:** కడప జిల్లా మైలవరం మండలం చిన్నకొమెర్లలో దాల్మియా భారత్ సిమెంట్ పరిశ్రమ 2వ ప్లాంట్ విస్తరణ పనులకు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ సుస్థిర పారిశ్రామికీకరణ ద్వారా ప్రపంచ స్థాయి, భవిష్యత్ అవసరాలకు అనుగుణమైన ఆర్థిక వ్యవస్థను నిర్మించాలన్న రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యానికి దాల్మియా భారత్ బలమైన భాగస్వామిగా నిలుస్తోందన్నారు. ఆంధ్రప్రదేశ్‌పై సంస్థ మరోసారి విశ్వాసం ఉంచి భారీ పెట్టుబడి పెట్టడం సంతోషకరమని చెప్పారు. ఈ భాగస్వామ్యంతో ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు స్థానిక సమాజాలు బలోపేతం కావడం, రాష్ట్ర పారిశ్రామిక రంగం మరింత అభివృద్ధి చెందడం, పర్యావరణహిత సాంకేతికత ఆధారిత వృద్ధిలో ఆంధ్రప్రదేశ్ ప్రపంచానికి ఆదర్శంగా నిలవడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టి నాయకత్వంలో రాష్ట్రం దేశంలోనే అత్యంత పెట్టుబడులకు అనుకూలమైన, ప్రగతిశీల రాష్ట్రంగా ఎదిగిందని చెప్పారు. పారదర్శక పాలన, స్థిరమైన విధానాలు, ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు, వ్యాపార నిర్వహణకు అనుకూల వాతావరణం రాష్ట్రంలో మరో భారీ పెట్టుబడికి తమను ప్రోత్సహించాయని తెలిపారు. ఈ కొత్త తయారీ కేంద్రం తక్కువ కార్బన్ ఉద్గారాలతో కూడిన భవిష్యత్ సిమెంట్ తయారీపై తమ దీర్ఘకాలిక దృష్టికి ప్రతీకగా నిలుస్తుందని పునీత్ దాల్మియా పేర్కొన్నారు. మంత్రి నారా లోకేష్ ముందుగా దాల్మియా సిమెంట్ భారత్ లిమిటెడ్ అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్‌లో రోబో ల్యాబ్, సెంట్రల్ కంట్రోల్ రూంను మంత్రి సందర్శించారు. వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఫొటో ఎగ్జిబిషన్, ఏవీని వీక్షించారు. కార్మికులను పలకరించి వారితో >>2

## నాలుగు రోజులు వర్ష సూచన

**విజయవాడ, జూలై 15, ప్రభాతవార్త ప్రతినిధి:** ఎపిలో నాలుగురోజులపాటు వర్షాలు పడే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ వెల్లడించింది. రాబోయే మూడు రోజులు రాష్ట్రంలోని అనేక ప్రాంతాలలో తేలికపాటి నుండి మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. రాష్ట్రంలోని పలు ప్రాంతాలలో బలమైన ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. వాయువ్య బంగాళాఖాతం మరియు దానిని ఆనుకుని ఉన్న ఉత్తర ఒడిశా, పశ్చిమ బెంగాల్ తీరాలలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం వల్ల వర్షాలు పడతాయని వాతావరణ శాఖ వెల్లడించింది. ఈ అల్పపీడనం రాబోయే రెండు రోజుల్లో మరింత బలపడి ఉత్తర ఒడిశా, పశ్చిమ బెంగాల్ మీదుగా కదిలే అవకాశం ఉందని చెప్పింది. రుతుపవన ద్రోణి కూడా ఆగ్నేయ దిశగా విస్తరించి ఉండడం వల్ల వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. రానున్న మూడు రోజులు ఉత్తర కోస్తా ఆంధ్ర ప్రదేశ్ మరియు యానం ప్రాంతాల్లో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు, లేదా జల్లులు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. దక్షిణ కోస్తా ఆంధ్రప్రదేశ్ రాయలసీమ ప్రాంతాల్లోకూడా వర్షాలు పడే అవకాశాలు >>2



బుధవారం డిశార్చికి ముందు పవన్‌కు వైద్యసలహాలు ఇస్తున్న డాక్టర్

## ముంబయి ఆస్పత్రినుంచి డి.సిఎం పవన్ డిశ్చార్జ

### హైదరాబాద్ నివాసానికి చేరుకున్న పవన్

**విజయవాడ.జులై 15.ప్రభాతవార్తప్రతినిధి:** ఎపి ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ముంబైలోని కోకిలాబెన్ ధీరూభాయ్ అంబానీ ఆసుపత్రి నుంచి బుధవారం డిశ్చార్జ్ అయ్యారు. ఆయన భుజానికి నిర్వహించిన శస్త్రచికిత్స విజయవంతం కావడంతో వైద్యులు ఆయనను డిశ్చార్జ్ చేశారు. గత కొంతకాలంగా రెండు భుజాలకు సంబంధించిన రొటేటర్ కఫ్ సమస్యలతో బాధపడుతున్న పవన్ కల్యాణ్, చికిత్స నిమిత్తం ఈ నెల 10న ఆసుపత్రిలో చేరారు. ఆయన కుడి భుజానికి వైద్యులు సుమారు మూడున్నర గంటల పాటు శస్త్రచికిత్స నిర్వహించారు. సర్జరీ అనంతరం గత నాలుగు రోజులుగా వైద్యుల పర్యవేక్షణలో ఉన్న ఆయన, ప్రస్తుతం వేగంగా కోలుకుంటున్నారు. పవన్ కల్యాణ్ పూర్తిస్థాయిలో కోలుకోవడానికి మరికొన్ని రోజుల పాటు సంపూర్ణ విశ్రాంతి అవసరమని వైద్యులు సూచించారు. కాగా, పవన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సమయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వయంగా వెళ్లి ఆయనను పరామర్శించారు. పవన్ ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్న సిఎం, ఆయన త్వరగా కోలుకొని విధుల్లో చేరాలని ఆకాంక్షించారు. పవన్ కల్యాణ్ ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ >>2

## విద్యుత్ ఛార్జీల పెంపు లేదు

### రోజుకు 280 మి.యూనిట్ల కరెంటు వినియోగం

### వరుసగా రెండో యేడాది ట్రూడౌన్ అమలు: మంత్రి గొట్టిపాటి రవికుమార్



**విజయవాడ, జులై15, ప్రభాతవార్తప్రతినిధి:** దేశంలో ట్రూఅప్ విధానాన్ని అమలు చేసిన ప్రభుత్వాలు ఉన్నప్పటికీ, ట్రూడౌన్ అమలు చేసిన ఏకైక ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వమేనని రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. గత రెండేళ్లుగా విద్యుత్ ఛార్జీలు పెంచకుండా మూడో యేడాదిలోకి అడుగుపెట్టామని, ఐదేళ్ల పాటు విద్యుత్ ఛార్జీలు పెంచబోమన్న హామీకి కట్టుబడి ఉన్నామని చెప్పారు. రాష్ట్రంలో వాతావరణ హెచ్చుతగ్గుల కారణంగా రోజుకు సుమారు 280 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం నమోదవుతున్నప్పటికీ, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపడుతోందన్నారు. బలమైన గాలుల కారణంగా విద్యుత్ లైన్లకు తాత్కాలిక అంతరాయాలు ఏర్పడుతున్నా, విద్యుత్ శాఖ అధికారులు వెంటనే స్పందించి సరఫరాను పునరుద్ధరిస్తున్నారని తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో సమన్వయం చేసుకుంటూ సమస్యలను వేగంగా పరిష్కరిస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వల్ప కాలంలోనే గాడిలోపెట్టారని మంత్రి అన్నారు. ట్రాన్స్‌కోను బలోపేతం చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా ట్రాన్స్‌మిషన్ వ్యవస్థను పటిష్ఠం చేస్తున్నామని, కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్‌స్టేషన్ల నిర్మాణం వేగంగా సాగుతోందని వివరించారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యుత్ మౌలిక సదుపాయాలను విస్తరిస్తున్నామని తెలిపారు. వరుసగా రెండో యేడాది కూడా విద్యుత్ ఛార్జీలను తగ్గించనుంది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ. 940.07 కోట్ల మేర ఛార్జీల తగ్గింపును చేపట్టబోతోంది. విద్యుత్ పంపిణీ సంస్థలు (డిస్కామ్‌లు) రాష్ట్ర విద్యుత్ నియంత్రణ కమిషన్)కి వినతి >>2



బుధవారం కెఎల్ రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సిఎం చంద్రబాబు నాయుడు

## వచ్చే మూడేళ్లలో 36 సాగునీటి ప్రాజెక్టులు

### - సిఎం చంద్రబాబు నాయుడు

**విజయవాడ, జులై15, ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో వచ్చే 3 యేళ్లలో ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేసే 36 సాగునీటి ప్రాజెక్టుల వివరాలు సీఎం చంద్రబాబు నాయుడు వెల్లడించారు. కేంద్ర దివంగత మంత్రి, కెఎల్ రావు 124వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి చంద్రబాబు నివాళులర్పించారు. తరువాత ఆయన మాట్లాడుతూ కెఎల్‌రావు స్ఫూర్తితో రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేసేందుకు ప్రాజెక్టులు పూర్తి చేస్తామన్నారు. వీటిలో తుంగభద్ర కొత్త గేట్లు గత నెల ప్రారంభోత్సవం పూర్తి అయినట్లు వివరించారు. సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజ్ గేట్లు ఏర్పాటుకు ఈనెల 13న శంకుస్థాపన పూర్తి చేసామన్నారు. గుంటూరు ఛానల్ ఆధునీకరణ ఈనెల 31న శంకుస్థాపనజరుగుతుంది. పోలవరంఎడమ ప్రధాన కాలువ 14 ఆగస్టున పారంభోత్సవం, పెరూరు బ్రాంచ్ కెనాల్ ప్యాకేజీ 36ఏ ఆగస్టు4న శంకుస్థాపన.

## వారసత్వ సాగు భూమిపై కుటుంబ సభ్యులకే తొలిహక్కు

### సుప్రీం కోర్టు సంచలన తీర్పు



**విజయవాడ.జులై15, ప్రభాతవార్త ప్రతినిధి:** హిందూ వారసత్వ చట్టం ప్రకారం, కుటుంబ సభ్యులకు వచ్చిన ఉమ్మడి వ్యవసాయ భూమిని తోబుట్టువులు ఎవరైనా బయటి వారికి విక్రయించాలనుకుంటే, దానిని ఆపే హక్కు మిగిలిన కుటుంబ సభ్యులకు ఉంటుందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. కుటుంబ ఆస్తుల పంపకాలకు సంబంధించి ఒక కీలకమైన చట్టపరమైన వివాదానికి సుప్రీంకోర్టు తెరదించింది. హిందూ వారసత్వ చట్టం 1956 (సెక్షన్ 22) ప్రకారం, ఉమ్మడి ఆస్తిగా వచ్చిన వ్యవసాయ భూమిని విక్రయించేటప్పుడు మొదటి తరగతి వారసులకే ప్రాధాన్యత ఉంటుందని కోర్టు స్పష్టం చేసింది. వ్యవసాయ భూములకు ఈ నిబంధన వర్తించదంటూ దాఖలైన అప్పీల్‌ను న్యాయస్థానం పూర్తిగా కొట్టివేసింది. జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ నాంగ్మీకపం కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం మహిందర్ వర్సెస్ పూరన్ సింగ్ కేసులో ఈ తీర్పును వెలువరించింది. అంతకుముందు పంజాబ్ ,హర్యానా హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు సమర్థిస్తూ, ఈ వివాదానికి ముగింపు పలికింది. కర్నాల్ జిల్లాలోని కైమ్లా గ్రామానికి చెందిన నాన్హు అనే వ్యక్తి పిల్లల మధ్య ఈ భూవివాదం మొదలైంది. తండ్రి నుంచి వారసత్వంగా వచ్చిన వ్యవసాయ భూమిని ఏడుగురు తోబుట్టువులు కలిసి ఒక బయటి వ్యక్తికి అమ్మేయడానికి సిద్ధపడ్డారు. అయితే, మిగిలిన ఒకే ఒక్క వారసుడైన పూరన్ సింగ్ దీనిని తీవ్రంగా వ్యతిరేకించారు. చట్టం ప్రకారం ఆ భూమిని కొనుగోలు చేసే మొదటి హక్కు (ముందస్తు కొనుగోలుహక్కు) తనకే ఉంటుం >>2



## 7 గంటలు హోరాహోరీ

### ఇరాన్‌పై సెంట్‌కామ్ దాడులు

### పోరు మరింత ఉధృతం

### సిచ్యుయేషన్ రూమ్‌లో సీనియర్లతో ట్రంప్ భేటీ

**వాషింగ్టన్,జులై 15:** శాంతిచర్చలు విఫలమైన నేపథ్యంలో పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధకాండ వేగవంతం అవుతోంది. ఖమేనీ అంత్యక్రియల తర్వాత ఇరాన్ వైఖరిలో మార్పులు కనిపిస్తున్నాయి. శత్రువులపై కాలు దువ్వుతున్నట్లుగా కనిపిస్తోంది. శాంతి ఒప్పందం పేరుతో చర్చలు జరుపుతున్నా దాడులకు మాత్రం ఏ మాత్రం వెనకాడడం లేదు. ఇరు పక్షాలు కూడా పరస్పర దాడులకు దిగుతున్నాయి. దీంతో మధ్యప్రాచ్యం మరోసారి అట్టుడుకుతోంది. గత రాత్రి ఇరాన్‌లోని ప్రధాన లక్ష్యాలపై అమెరికా ఏడు గంటల పాటు భీకర దాడులు చేసింది. ఇప్పుడు మరోసారి అత్యంత భీకర స్థాయిలో దాడులు చేసేందుకు అమెరికా సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వైట్‌హౌస్‌లోని అత్యంత భద్రత కలిగిన సిచ్యుయేషన్ రూమ్‌లో అత్యున్నత స్థాయి సమావేశం నిర్వహించారు. ఇరాన్‌కు భారీ నష్టం కలిగించి, హార్ముజ్ జలసంధిని తిరిగి తెరవడంతో పాటు అణు కార్యక్రమాన్ని నిలిపి >>2



బుధవారం దాల్మియా సిమెంట్ పరిశ్రమ 2వ ప్లాంట్ విస్తరణ పనులకు భూమిపూజ చేస్తున్న మంత్రి లోకేష్

# దాల్మియాతో మరింత వృద్ధి

>> కలిసి సెల్ఫీ దిగారు. పునీత్ దాల్మియాతో కలిసి దాల్మియా సిమెంట్ భారత్ లిమిటెడ్ లైన్-2 విస్తరణ పనులకు మంత్రి భూమిపూజ చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.

**రూ.3100 కోట్లు పెట్టుబడి పెట్టనున్న దాల్మియా భారత్ సిమెంట్**

దాల్మియా సిమెంట్ భారత్ లిమిటెడ్-2 విస్తరణను రూ.3100 కోట్ల వ్యయంతో చేపట్టనుంది. మైలవరం మండలంలోని చిన్నకొమెర్లలో ప్లాంటులో దాల్మియా సిమెంట్ ఏడాదికి 2.5 మిలియన్ టన్నుల క్లింకర్, 3.6 మిలియన్ టన్నుల సిమెంట్ ఉత్పత్తి చేస్తోంది. కొత్త ప్లాంట్ విస్తరణతో క్లింకర్ సామర్థ్యం 6.1 మిలియన్ టన్నులు, సిమెంట్ ఉత్పత్తి 9.6 మిలియన్ టన్నులకు చేరనుంది. ప్లాంట్ విస్తరణతో కొత్తగా వెయ్యి మందికి ఉద్యోగాల కల్పన జరగనుంది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమల శాఖామంత్రి టీజీ భరత్, బీసీ సంక్షేమశాఖామంత్రి ఎస్.సవిత, జమ్మలమడుగు నియోజకవర్గ ఎమ్మెల్యే సి.ఆదినారాయణరెడ్డి, ఎమ్మెల్యేలు రెడ్డప్పగారి మాధవిరెడ్డి, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, జమ్మలమడుగు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి సి.హెచ్.భూపేష్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి, దాల్మియా భారత్ లిమిటెడ్ గ్రోత్ అండ్ ఎక్స్ పాన్షన్ సీనియర్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ కేసీ బిర్లా, నేషనల్ మ్యానుఫ్యాక్చరింగ్ హెడ్ గణేష్ పరేఖ్, ప్రాజెక్టు హెడ్ అనుపమ్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

# అమెరికా న్యూజెర్సీలో రోడ్డు ప్రమాదం

## పల్నాడు జిల్లా వినుకొండ మండల విద్యార్థిని మృతి



మక్కెన ప్రసన్న (ఫైల్)

**వినుకొండ (పల్నాడు జిల్లా), జులై 15, ప్రభాతవార్త:** ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లిన వినుకొండ మండలం ఉమ్మడివరం గ్రామానికి చెందిన యువతి మక్కెన ప్రసన్న(27) న్యూజెర్సీలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెంది. సాధారణ రైతు కుటుంబానికి చెందిన మక్కెన వెంకటేశ్వర్లు, గోవిందమ్మ దంపతులకు ముగ్గురు సంతానం.వారిలో పెద్ద కుమార్తె ప్రసన్న 2022లో ఉన్నత విద్య కోసం అమెరికా వెళ్లింది. అక్కడ ఎంఎస్ పూర్తి చేసి ఉద్యోగ ప్రయత్నాలు చేస్తోంది.మంగళవారం ప్రసన్న తన ముగ్గురు స్నేహితులతో కలిసి అద్దె కారులో ఒక కార్యక్రమానికి వెళ్లి తిరిగి వస్తుండగా కారు అదుపు తప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ఘటనలో ప్రసన్న అక్కడికక్కడే మృతి చెందగా,ఆమె స్నేహితులకు గాయాలయ్యాయి.

పెద్ద కుమార్తె మరణ వార్త విన్న వెంకటేశ్వర్లు కుటుంబం కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది.ఈ వార్తతో ఉమ్మడివరం గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.ఈ విషయం తెలుసుకున్న ఎపి ప్రభుత్వ చీఫ్ విప్,వినుకొండ ఎమ్మెల్యే జీవి.ఆంజనేయులు మృతురాలి తండ్రికి ఫోన్ చేసి వివరాలు తెలుసుకున్నారు. మృతదేహాన్ని వీలైనంత త్వరగా స్వగ్రామానికి తీసుకు వచ్చేందుకు సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.కుటుంబ సభ్యులు కూడా తమ కుమార్తె మృతదేహాన్ని త్వరగా భారత్‌కు తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# ఇంజినీరింగ్ ప్రవేశాలకు అడ్మిషన్ల షెడ్యూల్ విడుదల

**విజయవాడ.జూలై15,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపి ఎప్‌సెట్ ఫలితాలు వెల్లడి కావడంతో తొలి విడత ప్రవేశాలకు కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను విడుదల చేశారు. జులై 20 నుంచి 29 వరకు మొత్తం పది రోజుల పాటు రిజిస్ట్రేషన్, ఫీజు చెల్లింపు ప్రక్రియ కొనసాగనుంది.తొలి విడతలో జులై 20 29 వరకు రిజిస్ట్రేషన్, ఫీజు చెల్లింపుఅప్‌లోడ్ చేసిన సర్టిఫికెట్ల వెరిఫికేషన్ జులై 22 నుంచి 31 వరకు, వెబ్ ఆప్షన్ల నమోదుకు అవకాశం జులై 25 నుంచి 31 వరకు, వెబ్ ఆప్షన్లు మార్చుకునేందుకు వెసులుబాటు ఆగస్టు 1న, ఆగస్టు 6న తొలి విడత సీట్ల కేటాయింపు ప్రక్రియ పూర్తి, ఆగస్టు 7 నుంచి 13 వరకు కాలేజీలో సెల్ఫ్ జాయినింగ్, రిపోర్టింగ్ చేయాలి ఆగస్టు 10 నుంచి ఇంజినీరింగ్ తరగతులు ప్రారంభం అవుతాయి.

## స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్‌లకు

# రెండేళ్ల కాలవ్యవధి

## న్యాయశాఖామంత్రికి విజ్ఞప్తి

**విజయవాడ, జులై 15, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని వివిధ న్యాయస్థానాల్లో స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ (సెకండ్‌క్లాస్) నియామకాలను రెండేళ్ల కాలవ్యవధితో చేపట్టాలని పలువురు స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్‌లు రాష్ట్రన్యాయశాఖా మంత్రి ఎన్‌యండి.ఫరూఖ్‌ను కోరారు. బుధవారం వెలగపూడిలోని సచివాలయంలో మంత్రిని కలిసిన మెజిస్ట్రేట్‌లు ప్రస్తుతం ఒక ఏడాది వ్యవధితో జరుగుతున్న నియామకాలను రెండేళ్ళ వ్యవధికి పొడిగించాలని కోరారు. కేసుల నిర్వహణలో జాప్యాన్ని నివారించేందుకు తమ పదవీకాలాన్ని పెంచాలని విజ్ఞప్తి చేసారు. వీరి వినతికి స్పందించిన మంత్రి మాట్లాడుతూ మెజిస్ట్రేట్‌ల నియమిత కాలాన్ని రెండేళ్ళకు పెంచేలా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చొరవతో అసెంబ్లీలో బిల్లు నెంబర్ 18/2025ని తీర్మానించి రాష్ట్రపతి ఆమోదం కోసం రిజర్వ్‌చేసినట్లు వివరించారు. త్వరలో ఈబిల్లు అమలయ్యేలా తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

**న్యాయవాదుల సమస్యలు పరిష్కరించాలి :**

న్యాయవాదులు, వారి కుటుంబసభ్యులకు ప్రభుత్వం ఉచితంగా ఆరోగ్యభీమా వసతి కల్పించాలని, అర్హులైన జూనియర్ న్యాయవాదులకు వారు నమోదు చేసుకున్న తేదీ నుండి ఐదుసంవత్సరాల కాలానికి రూ.10వేలు ఆర్థికసాయం అందించాలని, న్యాయవాదులపై దాడులు నివారించేందుకు న్యాయవాదులకు ప్రత్యేక రక్షణ చట్టం తేవాలని, న్యాయవాదులకు నివేశనస్థలాలు కేటాయించాలని, మంత్రి ఫరూక్‌ను న్యాయవాదులసంఘం ఐఎల్‌ఏ ప్రతినిధులు కోరారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.

# కృష్ణాడెల్టాకు 'పట్టిసీమ' సిరులు

>>ఇంజనీరుగా స్ఫూర్తిని ప్రతీ గ్రామానికీ తీసుకెళ్లేలా ఆయన ప్రభుత్వం కార్యక్రమాలు నిర్వహిస్తుంది. పట్టి సీమ నుంచి గోదావరి జలాలు కృష్ణమ్మ చెంతకు చేరి కృష్ణా డెల్టాను సస్యశ్యామలం చేస్తున్నాయి. యేడాదిలో పట్టి సీమ పూర్తి చేసి కృష్ణాడెల్టాను కాపాడిన ఘనత తెలుగుదేశం పార్టీది. 80 టిఎంసిలతో కృష్ణా డెల్టాలోని 13 లక్షల ఎకరాలను స్థిరీకరించాం. నాకు ఎక్కడ పేరు వస్తుందో అని నాడు పట్టి సీమ నిర్మిస్తుంటే కొందరు విమర్శించారు. పట్టి సీమ, ఒట్టిసీమ అన్నారు. విమర్శలు పట్టించుకుని ప్రాజెక్టు పూర్తి చేయకుండా వదిలేస్తే కృష్ణా డెల్టా ఏమయ్యేదో. విమర్శలు పట్టించుకోకుండా రూ.1300 కోట్లు ఖర్చు చేసి పట్టి సీమ పూర్తి చేశాం. గోదావరి నుంచి కృష్ణా నదికి 450 టిఎంసిల వరద జలాలను తీసుకువచ్చాం. పట్టి సీమకు చేసిన ఖర్చుతో కృష్ణా డెల్టా మొత్తం స్థిరీకరణ జరిగింది. ఎకరాకు రూ.1200 ఖర్చు అవుతోంది. వనరులు వృధా కాకుండా రైతులకు మేలు చేయాలన్న లక్ష్యంతోనే పనిచేస్తున్నాం. వచ్చే వరద జలాలను సముద్రానికి వదిలేసి ఇతర ప్రాంతాలనుంచి నీటిని తెచ్చుకోవటం తెలివైన పని అనిపించుకోదు. పట్టి సీమ నీటితో కృష్ణా డెల్టాలో రైతులు బంగారం పండిస్తున్నారు. పోలవరం కుడి కాలువ నుంచి నీటి తరలింపు కారణంగానే శ్రీశైలంలో కృష్ణా నీటిని పొదుపు చేసి రాయలసీమకు నీరందిస్తున్నాం. రాష్ట్రంలో ప్రతీ ఎకరాకి సాగునీరు అందించాలన్నదే కూటమి ప్రజా ప్రభుత్వ లక్ష్యం" అని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. 2014- 19 మధ్య రూ.68 వేల కోట్లు సాగునీటి రంగానికి ఖర్చు చేశామన్నారు.

**ప్రాజెక్టులపై గత పాలకుల నిరక్ష్యం..**

2024 నుంచి రెండేళ్లలో రూ.24 వేల కోట్లు ఖర్చు పెట్టాం. గత పాలకులు అన్నమయ్య డ్యామ్ కొట్టుకు పోయినా పట్టించుకోలేదు. గుండ్లకమ్మ, పులిచింతల గేట్లు కొట్టుకు పోయినా మాట్లాడలేదు. ప్రాజెక్టుల మరమ్మతులకు పైసా ఇవ్వలేదు, గ్రీజు కూడా పూయలేదు. తుంగభద్ర డ్యామ్‌కు కొత్త గేట్లను ఏర్పాటు చేయించాం. నిన్న ధవళేశ్వరం బ్యారేజికి కూడా రూ.152 కోట్లుతో కొత్త గేట్లు ఏర్పాటు చేసే పనులు ప్రారంభించాం. 2014-19లో పోలవరం ప్రాజెక్టులో 72 శాతం పనులు పూర్తి చేశాం. గడచిన రెండేళ్లలో ప్రాజెక్టును 89 శాతం మేర పూర్తి చేశాం. కానీ 2019-24 మధ్య కనీసం 2 శాతం కూడా పనులు చేయలేదు. పూర్తి నిరక్ష్యంతో డయాఫ్రామ్ వాల్ కూడా కొట్టుకు పోయేలా చేశారు. అతి ముఖ్యమైన ప్రాజెక్టుల పట్ల నిరక్ష్యం చేయటం దేశ ద్రోహం, రాష్ట్ర ద్రోహం. ప్రాజెక్టులను గాలికి వదిలేసిన గత పాలకులు రాష్ట్ర రైతులకు ద్రోహం చేశారు. ఇప్పుడు అమరావతిని కూడా అద్భుతమైన నగరంగా నిర్మిస్తుంటే కొందరు అడ్డుపడుతున్నారు. ప్రతిపక్షంలోని కొందరు రైతుల్ని రెచ్చగొట్టి సీడ్ యాక్సెస్ రోడ్డు నిర్మాణాన్ని అడ్డుకునే ప్రయత్నం చేశారు. తుంగభద్ర ప్రాజెక్టుకు కొత్త గేట్లు ఏర్పాటు చేసి ప్రారంభించాం. కాటన్ బ్యారేజికి కూడా కొత్త గేట్ల పనులు ప్రారంభించాం. వచ్చేయేడాదికి ఈ పనులు పూర్తి అవుతాయి. గుంటూరు ఛానల్ ఆధునీకరణ పనులకు కూడా ఈ నెలలోనే శంకుస్థాపన చేసి రెండేళ్లలో పూర్తి చేస్తాం. పోలవరం ఎడమ కాలువ పూర్తి అయ్యింది. ఆగస్టు 14 తేదీన గోదావరి జలాలకు అనకాపల్లి వద్ద స్వాగతం పలుకుతాం. వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశ ను 2026 సెప్టెంబరు 1 తేదీన జాతికి అంకితం చేస్తాం. ఈ ప్రాజెక్టులో రూ.4 వేల కోట్ల పనులు పెండింగ్ లో ఉన్నా గత పాలకులు ప్రాజెక్టు ప్రారంభించామని నాటకాలు ఆడారు. సొరంగంలో టన్నెల్ బోరింగ్ యంత్రం ఇరుక్కు పోయి ఉన్నా జాతికి అంకితం అన్నారు. గత పాలకులు చేసిన మోసాన్ని కూడా ప్రజలకు చెబుతాం. రాష్ట్రంలో కురిసే ప్రతీ వర్షపు చుక్కనూ భూగర్భ జలంగా మార్చుకోవాల్సి ఉంది. జలధార కింద ఈ పనులు పెద్ద ఎత్తున చేపట్టాం. రాష్ట్ర భవిష్యత్తుకు విరోధంగా పనిచేసే వారి పట్ల మనం అంతా అప్రమత్తంగా ఉండాలి"అని ముఖ్యమంత్రి అన్నారు.

**సాగునీటి రంగంలో కేఎల్ రావుది ఎనలేని కృషి.**

శ్రీశైలం, నాగార్జున సాగర్, హీరాకుడ్, కోసీ లాంటి ప్రధానమైన డ్యామ్ ల నిర్మాణంలో కెఎల్ రావు కీలక పాత్ర పోషించారు. ఐక్యరాజ్య సమితి తరపున అంతర్జాతీయ జల నిపుణులుగా ఈజిప్ట్, సూడాన్ లాంటి దేశాల్లోనూ సేవలందించారు. విజయవాడలో జన్మించి ఎంపీగా ఎన్నికై ముగ్గురు ప్రధానుల వద్ద కేంద్ర మంత్రిగా పనిచేశారు. నీటిపారుదల రంగం, జల విద్యుత్ ఉత్పత్తి లాంటి అంశాలపై పనిచేసి దేశానికి సేవలందించారు. శివ రామకృష్ణయ్య, కేఎల్ రావుల తర్వాత ఆంధ్రప్రదేశ్ సాగునీటి రంగంపై ఆలోచించిన వ్యక్తి ఎన్టీఆర్. సాగునీటి రంగాన్ని తీర్చిదిద్దటంలో వీరంతా నాకు ఎంతో స్ఫూర్తి. జలధార కార్యక్రమంతో భూగర్భ జలాలు పెంచేందుకు కృషి చేస్తున్నాం. రాయలసీమ ప్రాంతం ఎడారిగా మారిపోకుండా చర్యలు చేపట్టాం. అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, అనగాని సత్యప్రసాద్, సత్యకుమార్ యాదవ్, స్థానిక శాసనసభ్యుడు వసంత కృష్ణ ప్రసాద్ సహా ప్రజా ప్రతినిధులు హాజరయ్యారు.

## అమరావతిలోని అసైన్డ్ భూముల విషయంలో చంద్రబాబు, నారాయణకు

# హైకోర్టులో ఊరట

**విజయవాడ. జులై 15,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపి రాజధానిలోని అసైన్డ్ భూముల విషయంలో సీఎం చంద్రబాబు, మంత్రి నారాయణకు హైకోర్టులో ఊరట లభించింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇరువురిపై సీఐడీ నమోదు చేసిన కేసును హైకోర్టు కొట్టివేసింది. అసైన్డ్ భూముల్లో అవకతవకలు జరిగాయంటూ 2021 ఫిబ్రవరి 24న వైసీపీనేత ఆళ్ల రామకృష్ణారెడ్డి సీఐడీకి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు ఆధారంగా ఎపి అసైన్డ్ భూముల బదిలీ నిరోధక చట్టం, ఐపీసీ సెక్షన్ల కింద చంద్రబాబు, నారాయణపై గతంలో సీఐడీ ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసింది. ఆళ్ల రామకృష్ణారెడ్డి వేసిన పిటిషన్‌కు ఎలాంటి ఆధారాలు లేవంటూ సీఐడీ నమోదుచేసిన కేసును హైకోర్టు డిస్మిస్ చేసింది. ఈ తీర్పుతో చంద్రబాబు, నారాయణ ఊరట పొందారు.

## కృష్ణలంక సిఐ వ్యవహారంపై సుప్రీంకోర్టులో విచారణ

**విజయవాడ.జూలై15.ప్రభాతవార్తప్రతినిధి:** కృష్ణలంక సిఐ వ్యవహారంపై సుప్రీంకోర్టులో విచారణ జరుగుతోంది. హైకోర్టు ఉత్తర్వులపై స్టే కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం పిటిషన్ దాఖలు చేసింది. సస్పెండేఢ్ సీఐ నాగరాజుకు జస్టిస్ విక్రమ్‌నాథ్ ధర్మాసనం నోటీసులు జారీచేసింది. ధర్మాసనం తదుపరి విచారణ ఈనెల 23కి వాయిదా వేసింది. నాగరాజు సీన్ రీకన్‌స్ట్రక్షన్ కోసమే జైలు నుంచి తీసుకురావాలని, జైలు నుంచి తీసుకొచ్చి మళ్లీ జైలులోకి పంపేవరకు వీడియో చిత్రీకరించాలని ఆదేశించింది. హైకోర్టు ఆదేశాలపై స్టే ఇవ్వాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం పిటిషన్ దాఖలు చేసింది. తన వాదనలు కూడా పరిగణనలోకి తీసుకోవాలని సీఐ నాగరాజు కేవియట్ దాఖలు చేశారు.

# వర్ష సూచన

>> ఉన్నాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. రైతులు, ప్రయాణికులు, సాధారణ ప్రజలు వర్షాల నేపథ్యంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. వర్షాలు, గాలుల కారణంగా గంటకు 40 కిలోమీటర్ల నుంచి 50 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీస్తాయని పేర్కొంది. వ్యవసాయం, రవాణా వ్యవస్థలపై కొంత ప్రభావం పడవచ్చన్నారు. ప్రస్తుతం అల్పపీడనం వల్ల కొంత ఉపశమనం లభించవచ్చని ఆశిస్తున్నారు. ఈ వర్షాలు వ్యవసాయ రంగానికి మేలు చేస్తాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

### వారం - వర్జ్యం

16-07-2026, గురువారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
ఆషాఢమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, శుక్లపక్షం, పునర్వసు కార్తె
విదియ ఉ.8.55
ఆశ్లేష రా.7.57
వర్జ్యం : ఉ.9.38-ఉ.11.06
దు.ఉ.10.02-ఉ.10.54, 2) మ.3.15-సా.4.07
శుభసమయం : ఉ.7.00-8.00
రాహుకాలం - ఉ.10.30-12.00

### వార్తాఫలం

**మేషం:** చాకచక్యంగా వ్యవహరించి పనులు పూర్తి చేసుకుంటారు. ఆస్తి వివాదాలు తీరుతాయి. కొత్త కాంట్రాక్టులు లాభిస్తాయి.

**వృషభం:** స్త్రీలవలన చిక్కు సమస్యలు ఏర్పడతాయి. రాజకీయ వరవడి పెరుగుతుంది. కీళ్లబాధలు కలుగుతాయి.

**మిథునం:** దూరప్రాంత ప్రయాణాలలో వస్తు భద్రత వల్ల విశేష జాగ్రత్తలు పాటించండి. పోటీపరీక్షలలో పాల్గొంటారు.

**కర్కాటకం:** ఉద్యోగులకు పదోన్నతులు పొందుతారు. సంతాన విషయమై ప్రత్యేకమైన శ్రద్ధను కనబరుస్తారు.

**సింహం:** కాలానుగుణంగా పరిస్థితులను మార్చుకోగలుగుతారు. అనుకూలాంశాలు ఉంటాయి. స్పెక్యులేషన్ లాభించదు.

**కన్య :** చిన్ననాటి మిత్రుల నుండి కీలక సమాచారం అందుకుంటారు. భూ వివాదాలు పరిష్కారమై లబ్ధి పొందుతారు.

**తుల:** కుటుంబంలో శుభకార్యాల ప్రస్తావన ఉంటుంది. ఇతరుల విషయంలో జోక్యంవద్దు. క్రయవిక్రయాలలో లాభాలు పొందుతారు.

**వృశ్చికం:** పలుకుబడి కలిగిన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి. ఆ పరిచయా లను మీకు అనుకూలంగా మార్చుకుంటారు.

**ధనుస్సు:** నైపుణ్యంతో ప్రతిభతో మెదడుకు పదునుపెట్టి వ్యాపారంలో రావలసిన నష్టముల నుండి తప్పుకోగలుగుతారు.

**మకరం:** ఉత్తర ప్రత్యుత్తరములకు, ప్రకటనలకు, పత్రికలవారితో సంబంధ బాంధవ్యాలు పెంచుకొనుటకు అనుకూలం.

**కుంభం:** రావలసిన బాకీలు కొంత ఆలస్యంగా అందుతాయి. ఇతరులకు మీరు ఇచ్చే సలహాలు వారికి ఎంతో ఉపకరిస్తాయి.

**మీనం:** గృహోపకరణాలకు, సౌందర్య సాధన సామాగ్రికి అధికంగా ఖర్చుచేస్తారు. మనస్సు మారుమూలలోని ఆశ నెరవేరేటట్లు తోస్తుంది.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# 7 గంటలు హోరాహోరీ

>> వేయాలనే అమెరికా డిమాండ్‌ను అంగీకరించేలా ఒత్తిడి తీసుకురావడమే ప్రధాన లక్ష్యంగా చర్చలు జరిగినట్లు అంతర్జాతీయ మీడియా పేర్కొంది. సిచ్యుయేషన్ రూమ్ సమావేశానికి ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, విదేశాంగ మంత్రి మార్కో రుబియో, రక్షణ మంత్రి పీట్ హెగ్‌సెత్, జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ ఛైర్మన్ జనరల్ డాన్ కేన్, సిఐఎ డైరెక్టర్ జాన్ ర్యాట్‌క్లిఫ్, వైట్‌హౌస్ ప్రత్యేక ప్రతినిధి స్టీవ్ విట్‌కాఫ్ సహా పలువురు కీలక అధికారులు హాజరైనట్లు సమాచారం. ఈ సమావేశంలో ఇరాన్‌లోని వ్యూహాత్మక లక్ష్యాలపై తీవ్ర స్థాయి దాడులకు కార్యాచరణ రూపొందించినట్లు తెలుస్తోంది. దీంతో రాబోయే రోజుల్లో యుద్ధం మరింత విస్తరించే అవకాశాలు ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. యుఎస్ మీడియా ఆక్సియోస్ ప్రస్తుతం అమెరికా లక్ష్యం హార్ముజ్ జలసంధి గుండా ప్రయాణించే నౌకలపై దాడులు చేసే ఇరాన్ సామర్థ్యాన్ని తీవ్రంగా బలహీనపరిచేలా కీలక లక్ష్యాలపై భారీ దాడులు నిర్వహించడం టార్గెట్‌గా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. కాల్పుల విరమణ ఒప్పందం విఫలమైన తర్వాత ఇరాన్ మళ్లీ దాడులు ప్రారంభించింది. జోర్డాన్, కువైట్, బహ్రెయిన్‌లోని అమెరికా సైనిక స్థావరాలపై ఇరాన్ తాజా క్షిపణి దాడులు జరిపింది. దీనికి ప్రతిస్పందనగా అమెరికా మంగళవారం మధ్యాహ్నంనుంచి ఇరాన్ నౌకాశ్రయాలపై నౌకాదళ దిగ్బంధం అమలుప్రారంభించింది. ఈ పరిణామంతో పశ్చిమాసియాలో పరిస్థితులు మరింత దిగజారిపోయాయి. ఇక సమావేశానికి ముందు మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ మాట్లాడుతూ ఇరాన్‌పై వరుస దాడులు కొనసాగుతాయని హెచ్చరించారు. ఈ రాత్రి తీవ్రంగా దాడి చేస్తాం రేపు ఇంకా తీవ్రంగా దాడి చేస్తాం ఆ తర్వాతి రోజు కూడా అదే కొనసాగుతుంది. వచ్చే వారం పరిస్థితి ఇరాన్‌కు మరింత కఠినంగా మారుతుంది అని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఇరాన్ విద్యుత్ కేంద్రాలు, వంతెనలు వంటి కీలక మౌలిక సదుపాయాలపై అమెరికా దాడులు కేంద్రీకృతమవుతాయని తెలిపారు. ఇరాన్ చర్చల బల్లపైకి వచ్చే వరకు ఈ దాడులు కొనసాగుతాయని స్పష్టం చేశారు. అమెరికా ప్రతినిధులు ఇప్పటికే ఇరాన్ అధికారులతో సంప్రదింపులు జరిపారని, ఒప్పందం చేసుకోండి లేకపోతే మీదగ్గర ఏమీ మిగలదని హెచ్చరించి నట్లు ట్రంప్ వెల్లడించారు.

ప్రపంచ చమురు, సహజ వాయు రవాణాలో కీలకమైన హార్ముజ్ జలసంధిపై ఆధిపత్యం కోసం ఇరాన్ అమెరికా మధ్య పోటీ మరింత తీవ్రరూపం దాల్చడంతో పశ్చిమాసియా మరోసారి పూర్తి స్థాయి యుద్ధం దిశగా వెళ్తుందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. అమెరికా ఈ యేడాది ఏప్రిల్‌లో హార్ముజ్‌జలసంధిపై మొదటిసారి దిగ్బంధం అమలు చేసి అనంతరం తాత్కాలిక అణు చర్చల ఒప్పందం తర్వాత జూన్‌లో ఎత్తివేసింది. అయితే చర్చలు నిలిచిపోవడం, జలసంధి ప్రాంతంలో మళ్లీ ఘర్షణలు పెరగడంతో తాజా దిగ్బంధాన్ని మరోసారి అమల్లోకి తీసుకొచ్చింది.

## కాపు నేత ముద్రగడకు

# కన్నీటి వీడ్కోలు

## పెరట్లోనే అంత్యక్రియలు

### ముద్రగడ పాడె మోసిన మాజీ సిఎం జగన్

### పార్టీలకు అతీతంగా నేతల నివాళులు

### అధికార లాంఛనాలను తిరస్కరించిన కుటుంబ సభ్యులు

### కడసారి చూపునకు నోచుకోని కుమార్తె క్రాంతి



బుధవారం కిర్లంపూడిలో ముద్రగడ పాడె మోస్తున్న మాజీ సిఎం వైఎస్ జగన్

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జూలై15,ప్రభాతవార్త :** కాపు ఉద్యమ నేత, మాజీ మంత్రి, వైఎస్సార్సీ పిఎసి సభ్యుడు ముద్రగడ పద్మనాభం భౌతికకాయానికి గురువారం ఆయన స్వగ్రామమైన కాకినాడ జిల్లా కిర్లంపూడిలో అంత్యక్రియలు ముగిశాయి. సుదీర్ఘ ప్రజాప్రస్థానానికి ముగింపు పలుకుతూ ముద్రగడ అనంత లోకాలకు తరలిపోవడంతో కిర్లంపూడి జనసముద్రమైంది. అభిమానులు, కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులు భారీ ఎత్తున తరలివచ్చారు. ముద్రగడ పద్మనాభం చివరి కోరిక మేరకు, ఆయన కుటుంబ సభ్యులు ప్రభుత్వ అధికారిక లాంఛనాలను సున్నితంగా తిరస్కరించారు. కిర్లంపూడిలోని ఆయన స్వగృహ ఆవరణలోనే (పెరట్లో) హిందూసాంప్రదాయ పద్ధతిలో అత్యంత నిరాడంబరంగా అంత్యక్రియలు నిర్వహించారు. తనకు ఎంతో ఇష్టంగాభావించే ఇంటిఆవరణలోని మామిడి చెట్టు వద్ద పాతిపెట్టారు.

**కన్నీటి పర్యంతమైన కుటుంబం.. ఓదార్చిన జగన్..**

మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి కిర్లంపూడి విచ్చేసి ముద్రగడ భౌతికకాయానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం తీవ్ర విషాదంలో ఉన్న ముద్రగడ కుమారుడు గిరిబాబు, కుటుంబ సభ్యులను వైఎస్ జగన్ దగ్గరకు తీసుకుని ఓదార్చారు. "మేమంతా ఉన్నాం.. మీకు ఎల్లప్పుడూ అండగా ఉంటాం" అని ధైర్యం చెప్పారు. కన్నీరుమున్నీరుగా శోకసంద్రంలో వున్న ముద్రగడ కుటుంబంని చూసినవారంతా చలించిపోయారు. ముద్రగడతో ఉన్న సుదీర్ఘ అనుబంధాన్ని గుర్తుచేసు కుంటూ వైఎస్ జగన్మోహన్ రెడ్డి స్వయంగా ముద్రగడ పాడె మోశారు. శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ, పార్టీ ముఖ్యనేతలతో కలిసి ఆయన భౌతికకాయాన్ని మోస్తూ అంతిమ యాత్రలో పాల్గొన్నారు.జగన్, బొత్సలు తమ బంధానికి ప్రతీకగా పాడె మోసారు.అంత్యక్రియల ప్రక్రియ పూర్తయ్యే వరకూ వైఎస్ జగన్ కిర్లంపూడిలోనే ఉండి, కుటుంబ సభ్యులకు భరోసానిచ్చారు.పార్టీలకు అతీతంగా పలువురు రాజకీయ నేతలు నివాళులర్పించారు. రాజకీయాలు పక్కన పెట్టి పలువురు రాజకీయ నాయకులు, సామాజిక రంగ ప్రముఖులు, కాపునేతలు కిర్లంపూడి చేరుకుని ముద్రగడకు నివాళులర్పించారు.

**కడసారి చూపుకు నోచుకోని కుమార్తె చలించిన హృదయం**

మాజీ మంత్రి ముద్రగడ అనారోగ్య సమస్యతో మృతి చెందడంతో ఆయన అంత్యక్రియలను బుధవారం కిర్లంపూడిలో గల ఆయన స్వగృహంలో నిర్వహించారు. తండ్రి ముద్రగడను కడసారి చూసేందుకు కుమార్తె క్రాంతి కిర్లంపూడి ముద్రగడ స్వగృహానికి విచ్చేశారు. ఆమెను లోనికి అనుమతించకుండా కార్యకర్తలు నిరోధించారు. ఆమె గుండెలు పిండేలా రోదించి తన తండ్రి కడసారి చూపు చూసేందుకు అనుమతించాలని వేడుకున్నప్పటికీ ఒప్పుకోలేదు. కుటుంబ సభ్యులు కూడా ఆమెను లోనికి అనుమతించేందుకు అంగీకారం లేకపోవడంతోనే ఆమెను లోనికి అనుమతించలేదని పలువురు కార్యకర్తలు పేర్కొంటున్నారు. దీంతో మీడియా లోనే తండ్రిని చూస్తూ కన్నీరుమున్నీరుగా విలపించారు. అలాగే అధికార లాంచనాలు వద్దంటూ కొందరు పోలీసులతో వాగ్వివాదంకి దిగారు.

# ఆస్పత్రినుంచి డి.సిఎం పవన్ డిశ్చార్జ్

>> అయిన వార్త తెలియడంతో జనసేన శ్రేణులు, కూటమి నేతలు మరియు అభిమానులు సామాజిక మాధ్యమాల వేదికగా హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ముంబయిలోని ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యి హైదరాబాద్‌లోని నివాసానికి చేరుకున్నారు. ఇటీవల ముంబయిలోని కోకిలాబెన్ ధీరూభాయ్ అంబానీ ఆస్పత్రిలో పవన్ భుజానికి ఆపరేషన్ చేశారు. ఆస్పత్రిలో 4 రోజుల చికిత్స తర్వాత పవన్‌ను వైద్యులు డిశ్చార్జ్ చేశారు. ఎపి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తన వ్యక్తిగత వైద్య ఖర్చుల విషయంలో తన నిబద్ధతను మరోసారి చాటుకున్నారు. భుజం సర్జరీకి సంబంధించిన పూర్తి ఖర్చును ఆయన తన సొంత నిధుల నుంచే భరించారు. ఆపరేషన్‌తో పాటు ప్రయాణ ఖర్చులను కూడా ఆయనే వ్యక్తిగతంగా చూసుకున్నారు.ఇక మంత్రివర్గ సభ్యులకు అనారోగ్య సమస్యలు తలెత్తినప్పుడు ప్రభుత్వ నిధుల నుంచి వైద్య ఖర్చులను రీయింబర్స్‌మెంట్ పొందే సౌకర్యం ఉంటుంది. అయినప్పటికీ, పవన్ కల్యాణ్ ఈ సౌకర్యాన్ని వినియోగించుకోలేదు. ప్రజాధనాన్ని వ్యక్తిగత అవసరాలకు వాడకూడదన్న తన సొంత సూత్రానికి కట్టుబడి ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. గతంలో ఆయన ముక్కుకు శస్త్రచికిత్స చేయించుకున్నప్పుడు కూడా పూర్తి ఖర్చును తన సొంత నిధులతోనే భరించారు. ఇప్పుడు భుజం ఆపరేషన్ విషయంలోనూ అదే విధానాన్ని అనుసరించారు. ఉప ముఖ్యమంత్రి హోదాలో ఉన్నప్పటికీ, ప్రభుత్వ ఖజానాపై భారం మోపకుండా తన వ్యక్తిగత వైద్య ఖర్చులను తానే భరించడం ద్వారా పవన్ కల్యాణ్ తన మాటలకే కట్టుబడి ఉంటారని నిరూపించుకుంటున్నారు.

# విద్యుత్ ఛార్జీల పెంపు లేదు

>> పత్రాలు దాఖలు చేశాయి. అన్ని విధాలుగా పరిశీలించి ఈ తగ్గింపు కింద వినియోగదారుల బిల్లులను ఎంత తగ్గించాలనే దానిపై కమిషన్ నిర్ణయం తీసుకుంటుంది. 2024-25లో డిస్కమ్‌లు రూ.924 కోట్ల మేర ఛార్జీల తగ్గింపును చేపట్టాయి. ఎన్నికల సమయంలో విద్యుత్ వినియోగదారులపై అదనపు ఛార్జీలు విధించబోమని ప్రభుత్వం హామీ ఇచ్చింది. దానికి అనుగుణంగా అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో విద్యుత్ వినియోగదారులపై అదనపు ఛార్జీలు విధించకుండా ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకుంది. ఐదేళ్లలో ట్రూఅప్, ఇంధన సర్‌ఛార్జ్, విద్యుత్ టారిఫ్ పేరిట వినియోగదారులపై వైఎస్సార్సీపీ ప్రభుత్వం రూ. 32,166 కోట్ల భారాన్ని మోపింది. రాష్ట్రానికి పెద్దఎత్తున వస్తున్న పరిశ్రమల అవసరాలకు తగ్గట్టుగా విద్యుత్ సబ్ స్టేషన్ల నిర్మాణాన్ని వేగవంతం చేశామన్నారు. ప్రస్తుతం విద్యుత్ శాఖకు సంబంధించి రూ.6 వేల కోట్లు విలువైన వివిధ ప్రాజెక్టు పనులు వేర్వేరు దశల్లో పురోగతిలో ఉన్నాయని తెలిపారు. నిర్ణీత కాలపరిమితిలోగా అవసరం మేరకు అన్ని ప్రాంతాల్లో సబ్ స్టేషన్‌ల నిర్మాణం పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ఎక్కడైనా స్థానికంగా ఇబ్బందులు ఉంటే, అక్కడి స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ సమస్యలు పరిష్కరిస్తున్నట్లు మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు.

# కుటుంబ సభ్యులకే తొలిహక్కు

>> దని ఆయన కోర్టును ఆశ్రయించారు. దిగువ కోర్టు మొదట దీనిని తిరస్కరించినప్పటికీ, హైకోర్టు తాజాగా సుప్రీంకోర్టు పూరన్ సింగ్ వాదనను పూర్తిగా సమర్థించాయి.ఈ కేసులో పూరన్ సింగ్ తరఫున హాజరైన ప్రముఖ న్యాయవాది క్రాంతి కుమార్ చిరుమామిళ్ళ రాజ్యాంగం ప్రకారం వ్యవసాయ భూమి వారసత్వంపై చట్టాలు చేసే పూర్తి అధికారం పార్లమెంటుకు ఉందని,హర్యానా రాష్ట్రంలో దీనికి విరుద్ధమైన చట్టం ఏదీ లేనందున కేంద్ర చట్టమే ఇక్కడ చెల్లుతుందని ఆయన వాదించారు. దీనికి మద్దతుగా 2005లో చట్టం నుండి సెక్షన్ 4(2)ని కూడా పార్లమెంటు తొలగించిన విషయాన్ని ఆయన కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.ఈ తీర్పుతో దేశవ్యాప్తంగా ఎన్నో ఏళ్లుగా ఉన్న గందరగోళానికి తెరపడింది. ఇకపై హిందూ కుటుంబాలలో సంయుక్తంగా ఉన్న వ్యవసాయ భూమిని ఎవరైనా విక్రయించాలనుకుంటే, ముందుగా తమ తోబుట్టువులకే ఆ వాటాను కొనే అవకాశం ఇవ్వాలి. కోర్టులో కేసు నడుస్తుండగా తొందరపడి బయటి వారికి భూమిని అమ్మేసి చట్టం నుండి తప్పించుకోవాలని చూస్తే కుదరదని ఈ తీర్పు హెచ్చరిస్తోంది.

# ప్రాంతీయ ఆర్థిక వృద్ధికి వ్యూహాత్మక పట్టణ ప్రణాళిక అవసరం

## • సమ్మిళిత పట్టణాభివృద్ధిపై యుఎన్ హ్యాబిటాట్‌తో ప్రభుత్వ ఒప్పందం: ముఖ్యమంత్రి చంద్రబాబు



**విజయవాడ, జులై 15 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రాంతీయ ఆర్థిక వృద్ధి కోసం వ్యూహాత్మక పట్టణ ప్రణాళిక, వాతావరణ మార్పులను తట్టుకునేలా సుస్థిర పర్యావరణ వ్యవస్థల నిర్మాణం, డిజిటల్ గవర్నెన్సు, మున్సిపల్ ఫైనాన్స్ తో పాటు సుస్థిరాభివృది అవసరమని ఏపీ సీఎం చంద్రబాబు స్పష్టం చేసారు. రాష్ట్రంలో సమ్మిళిత పట్టణాభివృద్ధిని ప్రోత్సహించేలా ఏపీ ప్రభుత్వం ఐక్యరాజ్య సమితికి చెందిన యూఎన్ హ్యాబిటాట్ మధ్య కీలకమైన అవగాహనా ఒప్పందం కుదిరింది. ముఖ్యమంత్రి చంద్రబాబు, యూఎన్ హ్యాబిటాట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనక్లాడియా రోస్బాక్ ల సమక్షంలో ఈ వ్యూహాత్మక ఒప్పందాన్ని ఏపీ పురపాలక శాఖ యూఎన్ హ్యాబిటాట్ సంస్థలు కుదుర్చుకున్నాయి. ఆమె సింగపూర్ నుంచి వర్చువల్ గా ఈ ఎంఓయూ కార్యక్రమానికి హాజరయ్యారు. సర్జ్ ఏపీ, రైజ్ ఏపీ, అప్ లిఫ్ట్ ఏపీ విధానాల్లో భాగంగా అమరావతిలో పట్టణ వ్యవహారాలపై ఓ సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ ఏర్పాటు చేయడంతో పాటు పేదరిక నిర్మూలన, పట్టణ పేదల జీవనోపాధిని మెరుగుపరచటం లాంటి అంశాలను చేపట్టేలా ఈ ఒప్పందం చేసుకున్నారు. ప్రాంతీయ ఆర్థిక వృద్ధి కోసం వ్యూహాత్మక పట్టణ ప్రణాళిక, వాతావరణ మార్పులను తట్టుకునేలా సుస్థిర పర్యావరణ వ్యవస్థల నిర్మాణం, డిజిటల్ గవర్నెన్సు, మున్సిపల్ ఫైనాన్స్ తో పాటు సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై ఏపీ ప్రభుత్వం యూఎన్ హ్యాబిటాట్ తో కలిసి పనిచేయనుంది. దీంతో పాటు 2028లో మెక్సికోలో జరుగనున్న 14వ వరల్డ్ అర్బన్ ఫోరమ్ సదస్సులో ఏపీ విజయాలను ప్రపంచవేదికపై ప్రదర్శించాలని నిర్ణయించారు.

**అమరావతిలో గ్లోబల్ బెస్ట్ ప్రాక్టీసెస్:** ఈ ఒప్పందం సందర్భంగా అమరావతి రాజధాని నిర్మాణంలో ప్రపంచంలోని అత్యుత్తమ విధానాలను అమలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. గ్రీన్ ఫీల్డ్ నగరంగా అమరావతిని నిర్మిస్తున్నామని స్పష్టం చేశారు. సర్జ్ ఏపీ, రైజ్ ఏపీ, అప్ లిఫ్ట్ ఏపీ సహా పట్టణ పేదరిక నిర్మూలనపై యూఎన్ హ్యాబిటాట్ తో కుదుర్చుకున్న ఒప్పందం చారిత్రాత్మకం అవుతుందని సీఎం అన్నారు. జీరో పావర్టీ పై ఓ రోడ్ మ్యాప్ నిర్దేశించుకుని ఏపీ ప్రభుత్వం పనిచేస్తోందని సీఎం అన్నారు. పేదల జీవన ప్రమాణాలు పెంచేందుకు పీ4 కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని యూఎన్ హ్యాబిటాట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కు సీఎం వివరించారు. అర్బన్ ప్లానింగ్ సహా ఆర్థికాభివృద్ధిపై మంత్లీ ఎకనామిక్ రిపోర్టుల ద్వారా ఎప్పటికప్పుడు సమీక్ష చేసుకుంటున్నట్టు తెలిపారు. బయోడైవర్సిటీని సంరక్షించేలా గ్రీన్ ఎనర్జీ విద్యుత్ ఉత్పత్తి కోసం పెద్ద ఎత్తున చర్యలు చేపట్టామన్నారు. అర్బన్ ప్లానింగ్, లివబిలిటి, డిజిటల్ గవర్నెన్సులో ఏపీ అగ్రస్థానంలో ఉందని సీఎం వివరించారు. డేటా ఆధారిత నిర్ణయాలు తీసుకుంటున్నామన్నారు.

బెస్ట్ ప్రాక్టీసెస్ బ్రాండ్ అంబాసిడర్ గా తాను వ్యవహరిస్తానని సీఎం అన్నారు. మరోవైపు రాజధాని అమరావతి నిర్మాణం సీఎం చంద్రబాబు విజన్ కు ప్రతిరూపంగా ఉందని, ఏపీ యూఎన్ హ్యాబిటాట్ మధ్య కుదిరిన ఒప్పందం చారిత్రాత్మకమని ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనక్లాడియా రోస్బాక్ వ్యాఖ్యానించారు. వ్యర్థాల నిర్వహణ, వాయు కాలుష్య నియంత్రణ, బహిరంగ ప్రదేశాల అభివృద్ధి తదితర అంశాలపై ఏపీతో కలిసి పనిచేస్తామని అన్నారు. 2036 నాటికి పునరుత్పాదక ఇంధన రంగంలోనూ సమూల మార్పులు వచ్చేలా ఒప్పందం సహకరిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ, ఆ శాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్ కుమార్ ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.



## బాలాజీ ఆరోగ్యవరప్రసాదినికి రూ.2 కోట్లు విరాళం

తిరుమల, జులై 15 ప్రభాతవార్త ప్రతినిధి: టిటిడి ట్రస్ట్‌లలో ఒకటైన బాలాజీ ఆరోగ్య వరప్రసాదిని పథకానికి విరాళాలు అందుతున్నాయి. బుధవారం హైదరాబాద్‌కు చెందిన బయోఫోర్ ఇండియా ఫార్మాస్యూటికల్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ సిఇఒ జగదీష్, సిఎస్ఒ మాణిక్ రెడ్డి పుల్లగూర్ల బాలాజీ ఆరోగ్య వరప్రసాదిని పథకానికి ఒక్కొక్కరు కోటి రూపాయలు విరాళంగా అందించారు. తిరుమలలో టిటిడి చైర్మన్ క్యాంపు కార్యాలయంలో చైర్మన్ బిఆర్ నాయుడుకు విరాళం డిడిలను అందజేశారు. ఈ కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యురాలు ఏ.రంగశ్రీ పాల్గొన్నారు.

# జగన్‌కు విజన్ లేదు

## • మంత్రి నారాయణ • దొంతాళి డంపింగ్ యార్డు పరిశీలన



**నెల్లూరు(వైద్యం), జులై 15 ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్‌ను చెత్తరహిత రాష్ట్రంగా తీర్చి దిద్దేందుకు ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేప ట్టిందని, గత ప్రభుత్వం వదిలివెళ్లిన లెగసీ వ్యర్థాల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతున్నామని మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ అన్నారు. నెల్లూరు రూరల్ మండలంలోని దొంతాళి డంపింగ్ యార్డును బుధవారం పరిశీలించిన ఆయన, అక్కడ నిర్మాణంలో ఉన్న ఘన వ్యర్థాల ప్రాసెసింగ్ ప్లాంట్ పనులను పర్యవేక్షించారు. పనులు శరవేగంగా సాగుతుండటంపై సంతృప్తి వ్యక్తం చేస్తూ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వం ఘన వ్యర్థాల నిర్వహణను పూర్తిగా నిర్లక్ష్యం చేసి ప్రజలపై చెత్త పన్ను భారం మోపడంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా 153 లక్షల టన్నుల లెగసీ చెత్తను వదిలి వెళ్లిందని విమర్శించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెండేళ్లలో 130 లక్షల టన్నుల చెత్తను తొలగించిందని, మరో 23 లక్షల టన్నుల వ్యర్థాల ప్రాసెసింగ్ కొనసాగుతోందని తెలిపారు. జూలై నెలాఖరుకల్లా రాష్ట్రంలో పేరుకుపోయిన లెగసీ చెత్తను పూర్తిగా తొలగిస్తామని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 107 ఘన వ్యర్థాల ప్రాసెసింగ్ ప్లాంట్ల నిర్మాణం జరుగుతోందని, పూర్తయిన ప్రాసెసింగ్ ప్లాంట్లను 18న ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. దొంతాళి డంపింగ్ యార్డులో లెగసీ వ్యర్థాలను ఈ నెలాఖరుకల్లా పూర్తిగా ప్రాసెస్ చేసి తొలగిస్తామని మంత్రి చెప్పారు. జిందాల్ కంపెనీ ఆధ్వర్యంలో వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నామని, రెండేళ్లలో నిర్మాణాన్ని పూర్తిచేసి అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. ఆ ప్లాంట్ ప్రారంభమైన తర్వాత 100కిలోమీటర్ల పరిధిలోని మున్సిపాలిటీల నుంచి వచ్చే చెత్తను రోజువారీగా శుద్ధి చేసి విద్యుత్ ఉత్పత్తికి వినియోగిస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ సీఈ వేణుగోపాల్, పబ్లిక్ హెల్త్ ఎస్ఈ మహేష్, అదనపు కమిషనర్ హిమబిందు, ఎస్ఈ జానీ, జిందాల్ కంపెనీ జనరల్ మేనేజర్ రామకృష్ణ, జిగ్మా కంపెనీ ప్రతినిధులు, టీడీపీ నేత దొడ్డపనేని రాజానాయుడు పాల్గొన్నారు.

# ఆయుష్ వైద్యానికి హబ్‌గా ఆంధ్రప్రదేశ్

## • ఆయుర్వేద, యునాని, నేచురోపతి కళాశాలలు, ఇంటిగ్రేటెడ్ ఆసుపత్రులతో ప్రాచీన వైద్యానికి పునర్ వైభవం • రూ.414 కోట్లతో 1500 ఆయుష్ డిస్పెన్సరీల ఆధునీకరణ పనులు • ఔషధ మొక్కల పెంపకానికి ప్రోత్సాహం • వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి



**విజయవాడ, జులై 15 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆయుష్ వైద్యానికి ఆంధ్రప్రదేశ్ హబ్‌గా మారుస్తున్నామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో అత్యంత నిరాదరణకు గురైన ప్రాచీన ఆయుష్ వైద్యానికి పునరుజ్జీవం తెచ్చేందుకు రూ. 414 కోట్లతో అభివృద్ధి చర్యల్ని చేపట్టామని చెప్పారు. విజయవాడలోని తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో బుధవారం "ఔషధ మొక్కల స్థిరమైన సాగు, ఆర్థిక వృద్ధి, మార్కెటింగ్ మౌలిక సదుపాయాలు" అంశంపై జరిగిన రాష్ట్ర సదస్సుకు ముఖ్య అతిథిగా మంత్రి సత్యకుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ ఆయుష్ (ఆయుర్వేదం, యోగా, యునాని, సిద్ధ, నేచురోపతి, హోమియోపతి) విభాగం పరిధిలో భారీ అంచనా వ్యయంతో వైద్య మౌలిక సదుపాయాల అభివృద్ధి ప్రాజెక్టులను వేగవంతం చేస్తున్నామని వెల్లడించారు. కేవలం రోగం వచ్చిన తర్వాత చికిత్స అందించే ఖిరియాక్టివ్-క్యూరేటివ్‌ఖి విధానం నుంచి, రోగాలను ముందుగానే గుర్తించి నివారించే ప్రెడిక్టివ్- ప్రివెంటివ్-వెల్‌నెస్ సెంట్రిక్ ఆరోగ్య విధానం వైపు ప్రభుత్వం అడుగులు వేస్తోందని తెలిపారు. ఈ క్రమంలో ప్రాచీన ఆయుష్ వైద్య సేవల విస్తరణలో భాగంగా రూ. 280 కోట్లతో నాలుగు కొత్త ఆయుష్ మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ధర్మవరం, పిఠాపురంలలో ఆయుర్వేద వైద్య కళాశాలలు, ప్రొద్దుటూరులో యునాని కళాశాలలు రాబోతున్నాయని చెప్పారు. ఒక్కో కళాశాలకు రూ. 70 కోట్లు వ్యయం చేస్తామని చెప్పారు. ఇప్పటికే విశాఖపట్నంలో నేచురోపతి మెడికల్ కళాశాల నిర్మాణ పనులు (మొత్తం రూ. 280 కోట్లు) పూర్తికావొచ్చాయని తెలిపారు. అదేవిధంగా తిరుపతి, గిద్దలూరు, నందిగామ, తెనాలి, టెక్కలి, రంపచోడవరంలలో ఇంటిగ్రేటెడ్ ఆయుష్ ఆస్పత్రుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ ఇంటిగ్రేటెడ్ ఆసుపత్రులకు ఒక్కో దానికి రూ. 90 కోట్లు వెచ్చిస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.414 కోట్లతో తలపెట్టిన 1,500కు పైగా ఆయుష్ డిస్పెన్సరీల ఆధునికీకరణ పనులు చివరి దశకు చేరుకున్నాయన్నారు. త్వరలో కేంద్ర ఆయుష్ శాఖ మంత్రి రాష్ట్ర పర్యటనకు రానున్నారని, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ సమక్షంలో అభివృద్ధి పనులు ప్రారంభిస్తామన్నారు. మరోవైపు ప్రభుత్వ ఆరోగ్య సంస్కరణల ఫలితంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఓపీ సేవలు సుమారు 20 శాతం పెరిగాయన్నారు. గుంటూరు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో 255 ఓపెన్ హార్ట్ శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహించడం ప్రభుత్వ వైద్య సామర్థ్యానికి నిదర్శనమన్నారు. ప్రభుత్వ కృషి కారణంగా ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఎంబిబియస్ సీట్లు భారీగా పెరుగుతున్నాయని చెప్పారు.

## పోలవరం- బనకచర్ల ప్రాజెక్టుపై తెలంగాణ ప్రభుత్వ పిటిషన్ అంశంలో కీలక పరిణామం

### ప్రతివాదులకు సుప్రీంకోర్టు రిజిస్ట్రీ సమన్లు


**విజయవాడ, జులై 15 ప్రభాతవార్త ప్రతినిధి:** పోలవరం- బనకచర్ల ప్రాజెక్టుపై తెలంగాణ ప్రభుత్వ పిటిషన్ అంశంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. సుప్రీంకోర్టులో తెలంగాణ దాఖలు చేసిన ఒరిజినల్ సూట్‌పై ప్రతివాదులకు సమన్లు జారీ చేసింది. తెలంగాణ పిటిషన్‌పై విచారణ జరిపిన మరుసటి రోజే సుప్రీంకోర్టు రిజిస్ట్రీ సమన్లు పంపింది. 28 రోజుల్లో రిజిస్ట్రార్ ముందు హాజరుకావాలని ప్రతివాదులకు సమన్లు పంపింది. ప్రతివాదుల్లో ఏపీ ప్రభుత్వం, జలశక్తి, ఆర్థిక, అటవీ పర్యావరణ మంత్రిత్వశాఖలు, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, పోలవరం ప్రాజెక్టు అథారిటీ సీఈవో, జాతీయ జలసంఘం, గోదావరి, కృష్ణా నదీ యాజమాన్య బోర్డుల ఛైర్మన్లు మొత్తం 13 మంది ఉన్నారు. తెలంగాణ పిటిషన్‌పై తదుపరి ప్రక్రియను ఛాంబర్ జడ్జి చేపట్టనున్నారు. ఛాంబర్ జడ్జి ప్రక్రియ తర్వాతే ధర్మాసనం ముందుకు పిటిషన్ విచారణకు రానుంది.

## ఎపిహెచ్‌ఇఎఫ్‌ఆర్‌ఎం కమిటీ సభ్యులను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు

**విజయవాడ, జులై 15 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఫీజు రెగ్యులేటరీ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎపిహెచ్‌ఇఎఫ్‌ఆర్‌ఎంసి) సభ్యులను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆంధ్రప్రదేశ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఫీజు రెగ్యులేషన్ అండ్ మానిటరింగ్ చట్టం2019 ప్రకారం ఈ నియామకాలను చేపట్టింది. కమిటీ సభ్యుల పదవీకాలం మూడు సంవత్సరాలు లేదా 70యేళ్ల వయస్సు వచ్చే వరకు ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొంది. వీటిలో ఏది ముందుగా వస్తే అది వర్తిస్తుందని స్పష్టం చేసింది. చార్టర్డ్ అకౌంటెంట్/పబ్లిక్ ఫైనాన్స్ నిపుణుడిగా తిరుమలశెట్టి వెంకట రంగ సత్య భానుమూర్తిని కమిటీ సభ్యుడిగా ప్రభుత్వం నియమించింది. అలాగే హయ్యర్ ఎడ్యుకేషన్ అడ్మినిస్ట్రేషన్ విభాగం సభ్యులుగా డా. మన్యాల రామలింగ రాజు, పూజారి హరి ప్రకాష్‌లను నియమించింది. ప్రైవేట్ ఉన్నత విద్యా సంస్థల ప్రతినిధిగా వీవీఐటీ యూనివర్సిటీ చాన్స్‌లర్ డా.వాసిరెడ్డి విద్యాసాగర్‌ను ప్రభుత్వం నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

## వాసుదేవరెడ్డి, రాజ్ కసిరెడ్డి, కారుమూరి సునీల్‌పై సిట్ వారెంటు

**విజయవాడ, జులై 15 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ మద్యం రవాణా టెండర్ల కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. నిందితులపై పిటి వారెంట్లకు ఎసిబి కోర్టు అనుమతి ఇస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసులో ప్రధాన నిందితులు వాసుదేవరెడ్డి, రాజ్ కసిరెడ్డి, కారుమూరి సునీల్‌పై సిట్ పీటీ వారెంట్లు జారీ చేసింది. ఈ నెల 20న ఎసిబి కోర్టులో హాజరుపరచాలని నిర్ణయించింది. ప్రస్తుతం ముగ్గురు నిందితులు రిమాండ్‌లో ఉన్నారు. వీరిని ఇటీవల ఇడి అధికారులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చగా వారిని రిమాండ్‌కు విధించింది. తాజాగా ఎసిబి కోర్టు అనుమతి ఇవ్వడంతో వీరిని త్వరలోనే ఏసీబీ కోర్టులో హాజరుపర్చనున్నారు.



## విశాఖ బీచ్‌లో తప్పిన ప్రమాదం

### సముద్రంలో మునిగిపోతున్న నల్గొండ జిల్లా పర్యాటకుల్ని రక్షించిన మెరైన్ పోలీసులు

**విశాఖపట్నం, జులై 15 ప్రభాతవార్త:** విశాఖ బీచ్‌లో బుధవారం పెను ప్రమాదం తప్పింది. సముద్రంలో ఈతకు దిగిన పర్యాటకుల్ని అలలు లాక్కుపోతుండడంతో మెరైన్ పోలీసులు రక్షించగలిగారు. ఉదయం 10.30 గంటల సమయంలో తెలంగాణలోని నల్గొండ జిల్లా ముషాంపల్లి గ్రామానికి చెందిన ఐదుగురు పర్యాటకులు ఆర్కే బీచ్ వద్ద సముద్రంలో ఈతకు దిగారు. అదే సమయంలో బలమైన అలలు వచ్చి ఇద్దర్ని సముద్రంలోకి లాగేసింది. పర్యాటకులు కేకలు వేయడంతో స్పందించిన మెరైన్ పోలీసులు అప్రమత్తమై వారి ప్రాణాల్ని రక్షించగలిగారు. ప్రాథమిక చికిత్స అనంతరం, పర్యాటకుల్ని కౌన్సెలింగ్ చేశారు. ప్రస్తుతం అందరూ సురక్షితంగానే ఉన్నారని అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.

# రామగిరి బంగారు గనుల్లో త్వరలో మైనింగ్

## • మైనింగ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ప్రకటన • ఎమ్మెల్యే పరిటాల సునీత, శ్రీరామ్‌తో కలిసి మైనింగ్ ప్రాంతం పరిశీలన



మైనింగ్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మైనింగ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యే పరిటాల సునీత, శ్రీరామ్

**అనంతపురం, జులై 15 ప్రభాతవార్త బ్యూరో:** శ్రీసత్యసాయి జిల్లాలోని రామగిరి బంగారు గనుల్లో మైనింగ్ త్వరలోనే చేపట్టనున న్టు్ల మైనింగ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం టిడిపి ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్, శ్రీసత్యసాయి జిల్లా టిడిపి అధ్యక్షుడు, మడకశిర శాసనసభ్యులు ఎంఎస్.రాజు, అనంతపురం జిల్లా అధ్యక్షుడు పూల నాగరాజులతో కలిసి శ్రీసత్యసాయి జిల్లా రామగిరి మండలంలో మూతపడ్డ భరత్ గోల్డ్ మైన్ యూనిట్‌ను ఆయన పరిశీలించారు. అనంతరం మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ రాష్ట్రంలో అపార ఖనిజ సంపద ఉన్నప్పటికీ గత పాలకులు మైనింగ్ వ్యవస్థను నిర్వీర్యం చేశారని, కొన్ని చోట్ల దోపిడీకు పాల్పడ్డారన్నారు. ఉన్న మైనింగ్‌లను సరిగా నిర్వహించకపోవడం, ఖనిజాన్ని దోపిడీ చేయడం వంటివి చేశారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక మైనింగ్ గ్రోత్ 36శాతం పెరిగిందన్నారు. ఈ ప్రాంతంలో సుమారు 416 ఎకరాల్లో 108 హెక్టార్లలో మైన్ ఉందన్నారు. జొన్నగిరిలో టన్నుకు ఒక గ్రాము బంగారం వస్తే రామగిరిలో టన్నుకు 4గ్రాముల బంగారం లభిస్తుందన్నారు. ఇది క్రమంగా 6.5 గ్రాములకు కూడా చేరుతుందన్నారు. బ్రిటీష్ కాలం నుంచి 2002వరకు ఇక్కడ మైనింగ్ జరిగింది. భారత్ మైన్స్ వారు 2001లో ఆపేశారన్నారు. ఇటీవల 2023లో మిషనరీతో పాటు ఇక్కడున్న ఖనిజాన్ని తీసుకెళ్లినట్టు ఆరోపణలు ఉన్నాయన్నారు. ఇక్కడ మొత్తం 4లక్షల 60వేల టన్నుల ఖనిజం ఉండాలని అందులో లక్ష టన్నుల వరకు చోరీ అయినట్టు తెలుస్తోందన్నారు. దీనిపై కచ్చితంగా ఎంక్వైరీ జరుగుతుందని, అది ఎవరు చేసినా చర్యలు మాత్రం తప్పవని హెచ్చరించారు. రాష్ట్రంలో ఖనిజాన్వేషణ వేగంగా జరుగుతోందన్నారు. గోల్డ్, మ్యాగ్నటీస్, ఐరన్ ఓర్ వంటి ఖనిజాన్ని వెలికి తీసేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నట్టు చెప్పారు. దీని వలన రాయల్టీతో పాటు ప్రభుత్వానికి ఆదాయం వస్తుందని, పెద్ద సంఖ్యలో ఉపాధి అవకాశాలు ఉంటాయని, ఆయా ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయన్నారు. ఓబుళాపురం ప్రాంతంలో కూడా ఖనిజాన్ని ఎత్తుకెళ్లారన్నారు. ఈ ప్రాంతంలో కూడా త్వరలో మైనింగ్ ప్రారంభిస్తామని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. అలాగే గతంలో అక్కడ పనిచేసిన కార్మికులు, స్థానికులతో మంత్రి, ఎమ్మెల్యే సునీత మాట్లాడారు. బంగారు గనుల్లో పనిచేసిన వారితో అర్జీలు స్వీకరించారు. ఆ తర్వాత పంచాయతీరాజ్ శాఖ అతిథి గృహంలో మీడియాతో మాట్లాడారు.

**మా ప్రాంత కల ఇది:** ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ ఈ ప్రాంతంలో బంగారం మైనింగ్ చేస్తున్న సమయంలో ఎంతో మందికి ఉపాధి ఉండేదన్నారు. పరిటాల రవీంద్ర కార్మిక సంఘం నాయకునిగా కూడా పని చేశారని గుర్తు చేసుకున్నారు. అప్పట్లో మైనింగ్ మూసివేసినప్పటి నుంచి వారికి ఉపాధి కరవైందన్నారు. ఇక్కడ మైనింగ్ తిరిగి ప్రారంభిస్తే వందలాది కుటుంబాలకు మేలు జరుగుతుందని.. ఎంతో మంది ఉపాధి లభిస్తుందన్నారు. మా ప్రాంత ప్రజల కల త్వరలోనే సాకారం అవుతుందని ఎమ్మెల్యే సునీత అన్నారు.

# జగన్ క్షమాపణ చెప్పాలి.. ఆ మాటలు వెనక్కి తీసుకోవాలి

## • మంత్రి అప్పలరాజు కొడుకుకి ఒక న్యాయం? సామాన్యుడికి ఒక న్యాయమా? • ఆక్వా రైతులకు జగన్ చేసింది ఏమీ లేదు: మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఫైర్



**విజయనగరం, జులై 15 ప్రభాతవార్త:** మాజీ ముఖ్యమంత్రి, వైకాపా అధినేత జగన్ రెడ్డి భీమవరంలో ముఖ్యమంత్రి చంద్రబాబుపై మాట్లాడిన మాటలకు క్షమాపణ చెప్పి మాటలు వెనక్కి తీసుకోవాలని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంత్రి క్యాంప్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో పలు విషయాలను మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వెల్లడించారు. ముఖ్యమంత్రి చంద్రబాబుని ఉద్దేశించి దుర్భాషలాడడం సిగ్గుచేటని మంత్రి విమర్శించారు. ప్రజా జీవితంలో ఉన్న ప్రజాప్రతినిధి విధానపరంగా విమర్శలు చేయాలి కానీ నోటికి ఏది వస్తే అది మాట్లాడకూడదని హితవు పలికారు. జగన్‌రెడ్డి మాట్లాడిన మాటలను ఖండిస్తున్నామన్నారు. విలువలతో కూడిన మాటలతో రాజకీయాలు నడిపించాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఏ ఒక్కరిని కించపరుస్తూ మాట్లాడినా ఊరుకోరని, వ్యక్తిగతంగా దూషణలు చేయవద్దని చెబుతారన్నారు. కానీ వైకాపా అధినేత, నాయకులు అడ్డదిడ్డంగా మాట్లాడతారన్నారు. మత్స్యకారుల విషయంలో కూడా ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని, ప్రభుత్వం గల్లంతైన బోటు విషయంలో తక్షణ చర్యలు చేపట్టడంతో పాటు అధికారులను అప్రమత్తం చేయడం జరిగిందని పేర్కొన్నారు. ప్రభుత్వం చిన్న అనే వ్యక్తిని కాపాడటంతో పాటు విస్తృతమైన గాలింపు చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. మత్స్యకారులకు జగన్ ప్రభుత్వం గతంలో పది లక్షలు ఇస్తామని హామీ ఇచ్చి ఎగనామం పెట్టిందన్నారు. అధికారం కోల్పోయాక ప్రస్తుతం మత్స్యకారుల వద్దకు వచ్చి కొత్త బోటు, కోటి రూపాయలు అంటూ నాటకమాడుతున్నారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉదారతతో తక్షణమే పది లక్షల రూపాయలు అందజేసి గల్లంతయిన మత్స్యకారుల కుటుంబాలను ఆదుకోవడం జరిగిందన్నారు. ప్రాణానికి విలువ కట్టడం కాదని, కష్టంలో ఉన్న కుటుంబాన్ని ఆర్థిక సహాయం అందించి ఆదుకోవడం అన్నారు. వైకాపా ప్రభుత్వంలో ప్రమాదాల్లో చనిపోయిన ఏ ఒక్క మత్స్యకార కుటుంబానికి కూడా పరిహారం చెల్లించలేదని గుర్తు చేశారు. ప్రస్తుతం జగన్ రెడ్డి చేస్తున్న ఆరోపణలతో ఆక్వా రైతులు ఆందోళన చెందుతున్నారని, కల్లబొల్లి మాటలు నమ్మవద్దని రైతులకు హితవు పలికారు. ఆక్వా రైతులకు రూపాయన్నరకే కరెంటు అందజేస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చకుండా కొందరికి మాత్రమే ఇచ్చిన ఘనుడు జగన్ రెడ్డి అన్నారు. కానీ కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ఆక్వా రైతులందరికీ కూడా రెండున్నరకే యూనిట్ విద్యుత్ సరఫరా అందించడం జరుగుతుందన్నారు. జగన్ రెడ్డికి నచ్చిన ఎలాంటి విషయాన్నైనా సమర్థిస్తారని, దానికి తార్కాణమే తెలంగాణలో నేరం చేసిన వ్యక్తిని ఎన్‌కౌంటర్ చేస్తే... అసెంబ్లీ సాక్షిగా అభినందించిన జగన్, విజయవాడ అనేక నేరాలు చేసిన యువకుడిని, అలాగే రోడ్డు ప్రమాదం చేసి ఒకరి మృతికి కారణమైన మాజీ మంత్రి అప్పలరాజు కుమారుడిని సమర్థించడాన్నీ నేడు దేశ ప్రజలందరూ గమనిస్తున్నారన్నారు. సొంత వారిని, తనకు కావలసిన వారిని జగన్ రెడ్డి కేసుల నుంచి కాపాడటం కోసం చట్టాన్ని ఉపయోగిస్తారని, సొంతవారికి ఒక చట్టం.. బయటి వారికి ఒక చట్టం అని... అది జగన్ నైజం అన్నారు. జగన్ ఇదే వరవడితో ఉంటే ఈసారి 11 సీట్లు కాదు... కదా! డిపాజిట్లు కూడా రావు అని మంత్రి కొండపల్లి ఎద్దేవా చేశారు. పరిపాలన చేసే ఏ నాయకులైనా ప్రజలకు మంచిచేసే విధంగా ఉండటంతో పాటు భవిష్యత్తును చూపించాలన్నారు. ప్రజల్లో ధైర్యం నింపే బాధ్యత అధికారంలో ఉన్న పార్టీతోపాటు ప్రతిపక్ష పార్టీకి కూడా ఉంటుందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గుర్తు చేశారు.


AU SMALL FINANCE BANK

నమోదిత కార్యాలయం: 19-A, ధూలేశ్వర్ గార్డెన్, జైపూర్, రాజస్థాన్, ఇండియా- 302001
www.au.bank.in

**బంగారం పై రుణం "ఎక్కడ ఉందో అలాగే" అనే ప్రాతిపదికన వేలం నోటీసు**

AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ ("బ్యాంక్") నుండి పొందిన బంగారు సౌకర్యాలపై రుణానికి సంబంధించి వారి బకాయి మొత్తాలను చెల్లించమని క్రింద పేర్కొన్న రుణగ్రహీతలకు నోటీసులు జారీ చేయబడ్డాయి. రుణగ్రహీత/లు వారి బకాయిలను తిరిగి చెల్లించడంలో విఫలమైనందున, దిగువ పేర్కొన్న శాఖలలో 17 Aug 2026 ఉదయం 11:00 నుండి మధ్యాహ్నం 3:00 (సమయం) మధ్య పేర్కొన్న పద్ధతి ప్రకారం తాకట్టు పెట్టిన బంగారు వస్తువులు/ వస్తువుల వేలం నిర్వహించాల్సి ఉంటుంది. మరణించిన రుణగ్రహీతల విషయంలో, అన్ని షరతులు చట్టపరమైన వారసులకు వర్తిస్తాయి. పైన పేర్కొన్న వేలం విఫలమైతే, ముందస్తు సమాచారం లేకుండా మరొక వేలం నిర్వహించే హక్కు బ్యాంకుకు ఉందని దయచేసి గమనించండి.

**ప్రత్యక్ష వేలం శాఖ వివరాలు**

KANIGIRI -L26660000018021 TIRUPATI RC ROAD -L25660001693953 L26660000287793 L25660001625293|Repalle -L26660000757219 L26660000689856 L26660000605206 L26660000734873 L26660000661869 L25660001577452| Nandyala -L25660001781617 L25660001634565 L25660001635694 L26660000519138 VINUKONDA -L26660000609549| Narasaraopet L25660001956919 L25660001679390 L25660001957187 L25660001760957 L26660000592208| Gannavaram -L26660000522192 L26660000521384| Tuni - L25660002015924 L25660001632419 L25660001686386 L25660001747173 | Eluru - L26660000534939 L26660000674575 L25660001674819 L26660000680563 L26660000502580 L25660001837874 Nandigama -L26660000592308 L26660000453901 NTR Circle Vijayawada -L26660000492166 L26660000622144 L26660000600286 L26660000619990 L25660001701740 L26660000571468 L26660000585742 L26660000369939|BADVEL -L26660000663306 L25660001613615 L26660000723534 GUNTAKAL -L25660001298166 L25660001300225 L25660001474305 L25660001298416 L26660000680483 Nandikotkur - L25660001744418 MADANAPALLI CTM ROAD -L26660000664264 L25660002114017 L25660001633887 L9001090152952177| MACHILIPATNAM -L26660000499294 L26660000577177 L26660000728395 L26660000596491|Kovur -L26660000657927 L26660000755533 L26660000647456 L26660000706286 L26660000598467 L26660000535917 L26660000590884 ADDANKI-L26660000512171 L25660001783724 L25660001577202| NAIDUPETA -L 26660000768928 L26660000497777| GUNTUR - L26660000700147|RAVULAPALEM -L25660001615642 L25660001661304 BHAVANIPURAM VIJAYAWADA-L25660001665926 Vizianagaram - L25660001574907 JANGAREDDIGUDEM -L25660001695139 L25660001731133 L26660000577297 L25660002289976 L25660001719396 Amalapuram L25660001707379 TIRUVURU -L25660001726723|Chirala -L26660000309894 L25660001593321 Kavali -L25660002265952 CHITTOOR CB ROAD -L26660000691082 L25660001686196 L25660001686226 Ponnur -L26660000548023 L26660000456866 Palamaner L26660000537564 GIDDALUR L26660000726478|NELLORE BV NAGAR -L25660001788115 | Kadapa L25660001877057 L25660001613565 MURALI NAGAR-VISAKHAPATNAM- L25660001591105 Yemmiganur -L25660001584768 L25660001607737 L25660001787256 KAKINADA -L26660000593976 Akividu -L26660000751760| Nuzvid - L26660000586950 Pileru -L25660001679190 L26660000644132|SUJATHA NAGAR ONGOLE -L26660000556457 L25660001574097 DEVARAPALLI - L26660000656029 TADPATRI-L25660001796989 Peddapuram -L25660001602416

గమనిక: 1. భౌతిక వేలం విఫలమైతే, https://gold.samil.in అనే వెబ్ లింక్ ద్వారా ఇ-వేలం నిర్వహించబడుతుంది.
2. ఒకవేళ ప్రతిపాదిత వేలం విఫలమైతే, ఈ నోటీసును తదుపరి వేలం కోసం ముందస్తు నోటీసుగా పరిగణించగలరు.
3. వేలం బిడ్ ఫారంలో పేర్కొన్న కొన్ని నిబంధనలు మరియు షరతులకు లోబడి ఉంటుంది, ఇది వేలం ప్రారంభానికి ముందు అందుబాటులో ఉంచబడుతుంది.

సం/-మేనేజర్,
AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్

వార్త


కలకాలం నిలిచిపోయే పనులు చేయడంలో ఖర్చు అయిన జీవితమే చాలా ఉపయోగకరమైన జీవితం.

- విలియం జేమ్స్

# చిత్త భ్రమలో కుటుంబాలు చిత్తు!


జీవితాలు క్షణ భంగురాలే. కానీ కొన్ని జీవితాలు తమకే తెలియని అసంకల్పిత చర్యల్లో అన్యాయంగా వేరొకరి క్రూరత్వానికి బలైపోవడం ఈ మధ్యనే చూస్తున్నాం. ఎన్నో కాపురాలు కూలిపోవడం ఒకనాటి మాట. తాజాగా భార్య భర్తల్లో ఎవరో ఒకరి క్రౌర్యానికో, తొందరపాటు ఆలోచనలకో, అనుమానాలకో కుటుంబాలు కుటుంబాలే బలైపోతున్నాయి. తన తర్వాత తమ బిడ్డలనెవరు సాకుతారన్న కారణంతో తానేకాక తన పిల్లల్ని కూడా చంపి ఆత్మహత్య చేసుకోవాలన్న ఆలోచన ఓ తల్లిదో తండ్రిదో అయినప్పుడు ఆ కుటుంబం భూస్థాపితమే. ఆయా కుటుంబాలలో ఒకరి పగకో, ప్రతీకారానికి కుటుంబం యావత్తూ బలైపోయిన సంఘటనలు, ఉదంతాలు వినిపిస్తున్నాయి. అదేదో కాల మహిమ అని సరిపెట్టుకోలేం. సమాజం ఎటువైపు వెళ్తోందో అర్థం కాని పరిస్థితి, అర్థం చేసుకోలేని పరిస్థితి ఎదురౌతోంది. ఇలాంటి సంఘటనల్లో భాగస్వాములైన వారి మానసిక పరిస్థితి ఎలాంటిదో కూడా గమనించాల్సి ఉంది. తల్లి కానీ, తండ్రి కానీ పిల్లలను హతమార్చి తానూ ఆత్మహత్య చేసుకున్న సంఘటనలు తరుచుగా వార్తల్లో చూస్తున్నాము. ప్రతి సంఘటన చర్చనీయాంశమే కానీ ఆ తర్వాత పాతబడిపోతుంది. మరో సంఘటన వెలుగు చూస్తుంది. ఎప్పటి సంఘటన అప్పటి తర్వాత పాతదైపోతున్నా అందుకు సంబంధించిన కారణాలు సజీవంగానే ఉంటాయి. అటువంటి మరో సంఘటనకు పురికొల్పే అంశాలను ఎప్పటికప్పుడు విశ్లేషించుకోవాల్సి ఉందే. వీలైతే ఇలాంటి సంఘటనల ప్రభావం మరి కొందరిపై పడకుండా చూసుకోవాలి. అది మన బాధ్యతే. అవన్నీ ఆర్థిక సంబంధాలుగా కానీ వ్యక్తిగత ఆలోచనలుగా కానీ కొట్టిపడేయలేం. భారతీయకుటుంబ వ్యవస్థకు ఎన్నో కట్టుబాట్లు ఉన్నాయి. వాటన్నిటినీ విడిచి విధ్వంసపు ఆలోచనలు వస్తున్నాయంటే కుటుంబ వ్యవస్థ సరిగ్గా నడవనట్లు అనిపిస్తుంది. కుటుంబ సభ్యుల మానసిక ఆరోగ్య అవగాహన కూడా ప్రధాన పాత్ర వహిస్తుంది. మొన్నామధ్య ఓ తండ్రి తాను లేకుంటే తన బిడ్డలను చూసే వారుండరు కనుక వారినిలా వదిలేయడం కన్నా తనతో తీసుకెళ్లడం మంచిదనే ఆలోచనతో వారిని ముందుగానే హత్య చేసి తాను చనిపోవాలని ప్లాన్ వేసుకుంటాడు. వారిలో ఏ ఒక్కరు బయటపడినా వారి పోషణ, వ్యక్తిగత జీవితం దుర్భరమౌతుంది. తన కడుపున పుట్టిన బిడ్డలే అయినా మరో ప్రాణం తీసే హక్కు వారికి లేదు. అదొక తీవ్రమైన నేరం. పిల్లల్ని కనిపెంచి విద్యాబుద్ధులు నేర్పిన తల్లిదండ్రులు, వారి ప్రాణాలను తీసే హక్కు తమదేనన్నట్లు ప్రవర్తించకూడదు. వీటన్నిటికే సామాజిక మాధ్యమాల్లో కనిపించే ఆర్భాటపు శైలి. డిప్రెషన్, ఇతరత్రా ఒత్తిడిలు, భావోద్వేగాలు వారిని ఆలోచించుకోనివ్వవు. అందుకే వాటిని ముందుగా గుర్తించుకుని మానసిక ఆరోగ్య సేవల కోసం డాక్టర్లను సంప్రదించాలి. తాజాగా జరిగిన ఒక దుర్ఘటనలో నెల్లూరుజిల్లా తోటపల్లి గూడురుకుచెందిన హరికృష్ణ అనే వ్యక్తి మంగళవారం సింగరాయకొండ రైల్వే స్టేషన్‌లో తన భార్య ఇద్దరు పిల్లల్ని ఎదురొ స్తున్న ట్రైన్‌కు బలిఇచ్చాడు. తన బావ హత్యకేసులోనింది తుడుగా ఉన్న హరికృష్ణ తనకు ఆత్మహత్యే శరణ్యమని భావించాడు. దాంతో ఏ పాపం తెలియని భార్యాబిడ్డల్ని సైతం రైలు కిందకు తోసి వారిచావుకు కారకుడయ్యాడు. తానూతనువు చాలించాడు. ఆర్థిక ఇబ్బందులోఉన్నవారు, వైవాహిక జీవితంలో విఫలమయిన వారు, జీవిత భాగస్వాములపై సందేహాలున్న వారు ఇలాంటి దుష్కర్మలకు ఒడిగడుతుంటారు. మరో ఉదంతంలో తల్లిదండ్రులు పేచీ పడుతుంటే 'నా వల్లనే కదా మీ మధ్య గొడవ, అమ్మా నాన్నా నే చచ్చిపోతున్నా'నని వారి కళ్లెదుట ఆత్మహత్య చేసుకుంటున్న కొడుకును వాళ్లు ఆపలేకపోయారు. ఇలాంటి మరో విషాదం చోటు చేసుకోకుండా ప్రభుత్వాలు గ్రామస్థాయి నుంచి పట్టణాలలోని ప్రతిఒక్కరికి మానసిక ఆరోగ్య సేవలు అందించాల్సిన అవశ్యకత ఉంది. వ్యక్తులలో తీవ్ర నిరాశ, అకస్మాత్తుగా ఇతర బాంధవ్యాలను తెంచుకోవడం లాంటి చర్యలు చేసేవారిని పరకాయిస్తుండాలి. కుటుంబ సంబంధ బాంధవ్యాలు క్షీణిస్తున్న దశలో ఇలాంటి వాటిపై సాటి కుటుంబ సభ్యులే శ్రద్ధ చూపించాలి. అందరికీ విద్యలాగే అందరికీ మానసిక ఆరోగ్య సేవలు వంటి కార్యాచరణకుప్రభుత్వాలు నడుం కట్టాలి. ఇక బతికి లాభం లేదు. నాతోపాటే నా కుటుంబమూ చావుఅంచుల్ని చూడాలనే ఆలోచన ఏ ఒక్కరిలోనూ రానీయరాదు. కుటుంబ సభ్యుల్లో కానీ, స్నేహితుల్లో కానీ ఒంటరిజీవితాన్ని అనుభవిస్తున్న వారిలో అసాధారణ ప్రవర్తన వంటి సంకేతాలు కనిపిస్తేవాటిని తేలికగా తీసుకోకూడదు. అలాంటి వారిపట్ల సానుభూతి చూపడం, సంయమనంతో మాట్లాడడం బాధ్యతగా తీసుకోవాలి. కుటుంబపరంగా ఆసహనానికి లోనయ్యే వారు, సమాజం పట్ల బాధ్యతగా ప్రవర్తించలేనివారిని సైతం అక్కున చేర్చుకుని వారి సమస్యను పరిష్కరించే ఆలోచన ప్రతి ఒక్కరూ ప్రయత్నించాలి. విచిత్రమైన సామూహిక ఆత్మహత్యల్లో తొలిసారిగా మానసిక ఆరోగ్యం, మూఢనమ్మ కాలపై చర్చకు దారితీసిన ఢిల్లీ బురారీ కేసు2018లో నమోదైంది. ఒకే కుటుంబానికి చెందిన 11మంది అనుమానాస్పదపరిస్థితుల్లో సామూహిక ఆత్మహత్యకు పాల్పడ్డారు. 2021లో హైదరాబాద్‌లో ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు కుటుంబ సమస్యలు, మానసిక ఆరోగ్యకారణాలతో ఆత్మహత్యచేసుకున్నారు. తెలంగాణ, కర్ణాకలో ఇలాంటివి వెలుగు చూస్తున్నాయి. 2024లో దేశవ్యాప్తంగా 116కుటుంబపు సామూహిక ఆత్మహత్యల కేసులు నమోదయ్యాయి. ఆంధ్రప్రదేశ్‌లో 11కేసులు నమోదవగా దేశం మొత్తంమీద 270మంది ఇలాంటి ఆత్మహత్యలు చేసుకుని ప్రాణం తీసుకున్నారు. కుటుంబ కౌన్సిలింగ్, డిప్రెషన్‌లో ఉన్నవారికి ఉచిత కౌన్సిలింగ్‌లు చేపట్టాల్సిన బాధ్యత కేంద్రఆరోగ్యశాఖ చేపట్టాలి.

విధి అంటూ ఎవరూ సృష్టించలేదు. మనకు మనమే సృష్టించుకున్నాం. మన మాట, ఆలోచన, ప్రవర్తన వల్ల మన జీవితానికి మనమే బాధ్యులం.



డబ్ల్యు ఎమర్సన్

ఏ దేశం అభివృద్ధి చెందిందన్నా అద్దాల మేడలు, రంగు గోడలు అని కాదు అర్థం. పౌరుల నైతికాభివృద్ధి.



మహాత్మా గాంధీ

## ప్రజావాక్కు

### అత్యవసర సాగునీటి ప్రణాళికలు అవసరం

దక్షిణ భారత వ్యవసాయానికి నైరుతిరుతుపవనాలు జీవనాధారం. అయితే ఈ ఏడాది తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో నమోదవుతున్న వర్షాభావం రైతుల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఖరీఫ్ సాగు విస్తీర్ణం పెరిగినప్పటికీ, ఆశించినస్థాయిలో వర్షాలు లేకపోవడంతో పంటల ఎదుగుదలపై అనిశ్చితి నెలకొంది. ఇప్పటికే అనేక మండలాల్లో వర్షపాతం లోటు నమోదవగా, జలాశయాల్లోనూ నీటి నిల్వలు ఆశించిన స్థాయిలో లేకపోవడంపరిస్థితిని మరింత క్లిష్టంగా మారుస్తోంది. వాతావరణమార్పుల ప్రభావంతో వర్షాల స్వభావంలో వస్తున్న మార్పులు వ్యవసాయ రంగానికి కొత్తసవాళ్లను విసురుతున్నాయి. విత్తనాలు వేసిన రైతులు మళ్లీ విత్తాల్సిన పరిస్థితులు ఏర్పడితే పెట్టుబడి భారం పెరిగే ప్రమాదం ఉంది. వర్షాలపై ఆధారపడిన చిన్న, సన్నకారు రైతులే ఈ పరిస్థితికి ఎక్కువగా నష్టపోతారు. ఇది రైతుల ఆదాయంపైనే కాకుండా, ఆహార భద్రతపైనా ప్రభావం చూపే అవకాశం ఉంది. ఈ పరిస్థితిని ఎదుర్కోవడానికి రెండు తెలుగురాష్ట్రాల ప్రభుత్వాలు ముందస్తుచర్యలు చేపట్టాలి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### వ్యవసాయ బావులు తవ్వించాలి

గతంలో ప్రభుత్వం సన్న, చిన్న కారు రైతులకు. ఎస్సి, ఎస్టీ, రైతులకు పంట పొలాలకు సాగు నీరు అందించడంకోసం వ్యవసాయంకొరకు బావులు అవసరం ఉంది. వివిధ కార్పొరేషన్‌ల వార్షిక బడ్జెట్‌లో నుండి రైతు లకు బావులు త్రవించాలి. ఉపాధి హామీ పథకం కూలీల సహాయంతోతవ్వించాలి. దీంతో ఉపాధి హామీ కూలీలకు ఉపాధి కల్పించినట్లు అవుతుంది. రైతులకు పుష్కలంగా సాగు బడి కోసం నీరు అందుతుంది. చెరువులు, కెనాల్ కాలువలలో నీటి సామర్థ్యం పెరుగుతుంది. కనుక ప్రభుత్వం వ్యవసాయ బావులు తవ్వించాలి.

- ఈదునూరి వెంకటేశ్వర్లు, నెక్కొండ

### ప్రజా సమస్యలు పరిష్కరించాలి

ప్రభుత్వ ఆఫీసులలో నెలల తరబడి దరఖాస్తులు అయిన కళ్యాణలక్ష్మి ‌, రేషన్ కార్డు, తదితర దరఖాస్తులను ఎప్పటికప్పుడు వేగంగా పరిష్కరించాలి. వివిధ పనుల నిమిత్తం దరఖాస్తు చేసుకున్న ప్రజలకు సకాలంలో అందాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అధికారులు వీలై నంత తొందరగా పరిష్కరించాలి.

-మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

### ఏటిఎంలలో నగదు కొరత!

ఒకప్పుడు బ్యాంకు ఖాతాదారులు తమ బ్యాంకు శాఖలకు నేరుగా వెళ్లి నగదు తీసుకునే పరిస్థితి వుండేది. ప్రస్తుతం దేశమంతటా ఏటిఎంలు రావడంతో ఖాతాదారుడు బ్యాంకు శాఖలకు వెళ్లి నగదు తీసుకునే శ్రమ చాలా వరకూ తప్పింది. దేశవ్యాప్తంగా అన్ని బ్యాంకుల శాఖలు తమ ఖాతాదారులకు ఏటిఎం కార్డుల సదుపాయం అందుబాటులోకి తీసుకువచ్చింది. అయితే దేశవ్యాప్తంగా ఇప్పుడు కొన్ని నగరాల్లోని ఏటిఎంలలో బ్యాంకులు సరిపడా నగదునిల్వలు ఉంచడం లేదు. గత మూడు నాలుగు నెలలుగా ఈ సమస్య మరింత ఎక్కువగా వుంటుంది. చిన్న చిన్న నగరాల్లో ఈ సమస్య మరింత తీవ్రంగా వుండటంతో బ్యాంకు ఖాతాదారులు చాలా ఇబ్బంది పడుతున్నారు. ఈవిషయంలో భారత రిజర్వు బ్యాంకు అన్ని బ్యాంకుల శాఖలకు దిశానిర్దేశం చేసి ఏటిఎంలలో నగదు నింపే విధంగా చర్యలు తీసుకోవాలి.

- దాసం వెంకటరెడ్డి, బెంగుళూరు

### ఆరోగ్యంగా ఎదగాలి

ఐదు సంవత్సరాలలోపు పిల్లలకు ఇడ్లీ, రైస్‌సాంబర్ లేదా ఇతర బలమైన ఆహారంతో మెత్తగా కలిపి తినిపించడం చూస్తుంటాము. ఇకచాలు అన్నాకూడావినకుండా చందమామ, కాకమ్మ కథలు చెబుతూ బలవంతంగా ముద్దనోట్లో కుక్కుతుంటారు. ఇలా చేయడం వల్ల ఒక్కోసారి అజీర్తి, వాంతులు చేసుకొని ఏడుస్తుంటారు. దాంతో కన్నవాళ్లకు ఆందోలన కలగడం సహజం. ఇది ఏమాత్రం బిడ్డ ఆరోగ్యానికి మంచిది కాదని వైద్యనిపుణులు చెబుతుంటారు. చిరుతిళ్లు తినే పిల్లలకు ఆకలి మందగించడం వల్ల ఫుడ్ సరిగ్గా తినరు. కావున వీలైనంతవరకు జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉంచాలి. ఎదిగే పిల్లలకు వెరైటీగా రాగిజావ, ఉడికించిన కూరగాయలు, అన్నంలో కలిపి పెట్టాలి. అలాగే ఫ్రూట్ సలాడ్స్ అందించాలి.

- ఆర్.వెంకటేష్ చరన్, బెంగుళూరు

### పెరుగుతున్న లింగ వివక్ష

గ్రామీణ ప్రాంతాలలో సాంప్రదాయక పురుషాధిక్య ధోరణులు, బాల్యవివాహాలు, చదువు ఆపివేయడం వంటి సమస్యలు ఉన్నాయి. వ్యవసాయరంగంలో సమానంగా శ్రమిస్తున్నప్పటికీ మహిళా కూలీలకు తక్కువ వేతనాలు ఇస్తున్నారు. భూమిపై యాజమాన్య హక్కులు లేకపోవడం వల్ల మహిళలు ఆర్థిక స్వయంప్రతిపత్తి సాధించలేకపోతున్నారు. పట్టణ ప్రాంతాలలో కార్పొరేట్ సంస్థల ఉన్నత పదవులలో మహిళల భాగస్వామ్యం తక్కువగా ఉంది.

- కె.రామారావు, నల్గొండ జిల్లా

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# సర్వరక్షకుడు జగన్నాథుడే..



రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపదీ ముర్ము

శ్రీ జగన్నాథుడి ప్రార్థనలు, కీర్తనలు చిన్ననాటి నుంచి నా జ్ఞాపకాల్లో పదిలమై ఉన్నాయి. పాఠశాలలో, కళాశాలలో చదువుకొనేటప్పుడు మహాప్రభు జగన్నాథుని భజనలు పాడటం నాకు చాలా ఆనందాన్నిచ్చేది. మహా ప్రభుకి చాలా సన్నిహితంగా ఉన్నఅనుభూతి కలిగేది. నేనీ మధ్య భజనలు పాడటం లేదు కానీ, ప్రతి రోజూ ఆ మహా ప్రభుని స్మరిస్తాను. భజనలోని ఓ నాలుగు పదాలైనా పలకని రోజుండదు. నిజానికి మహా ప్రభు నాకు దగ్గరగా ఉన్నట్టు భావిస్తుంటాను. కష్ట సమయాల్లో ఆయన నాకు అండగా ఉన్నారు. ఈనాటికీ భక్త కవి మధుసూదనరావు రచించిన పాటను పాడుతూనే ఉంటాను. అంతటా ఉండే ఓ మహాప్రభూ...నువ్వు రాత్రింబగళ్లు నా తోడే ఉన్నావు... ఈ జ్ఞాపకంతో నిన్ను ఎల్లప్పుడూ పూజిస్తాను.. నా పూర్ణ హృదయంతో.. అని ఆ పాటకి అర్థం. లౌకిక విషయాలు అర్థం చేసుకొనే వయసు వచ్చేనాటికి మహాప్రభు జగన్నాథు ని గొప్పదనాన్ని అర్థం చేసుకోవడం ప్రారంభించాను. మహా ప్రభు జగన్నాథుని గురించి ఇంట్లో తరచూ మాట్లాడుకొనే వారు. మా గ్రామంలోనూ ఇలాంటి చర్చలే ఎక్కువగా జరుగుతుండేవి. నేను గ్రామ పాఠశాలలో చదువుతున్నప్పుడు భక్త సాల్బేగ్ రచించిన 'ఆహే నీల శైల'అనే ప్రార్థనను క్రమం తప్పకుండా పఠించేవారు. మహాప్రభు జగన్నాథుని గురించి మా టీచర్ అనేక విషయాలు చెబుతూ ఉండేవారు. పూరీలో పెద్ద ఆలయం ఉంది. అంతటి గొప్ప ఆలయం మరొకటి లేదు! ఆ ఆలయంలో తన చెల్లెలు సుభద్ర, సోదరుడు బలభద్రునితో కలసి మహాప్రభు పూజలందుకుంటారు. మహా ప్రభు జగన్నాథుడు నల్లని రంగులో, గుండ్రని కళ్లతో ఉంటారు. సుభద్ర పసుపు రంగులో, బలభద్రుడు వెన్నెల్లో వికసించిన పుష్పంలా శ్వేతవర్ణంలో ఉంటారు. ఒక్కసారి ఆ మూర్తులను చూస్తే..ఎప్పటికీ మరచిపోం అని చెప్పేవారు. జగన్నాథుడే మహాప్రభువనీ, ఆయన ప్రసాదమే మహాప్రసాదమని కూడా మా టీచర్ చెప్పేవారు. ఆయన ఆలయమే బడ దేవుళ్ల లేదా పెద్ద ఆలయం. ఆయన మార్గమే బడ దాండ. అంటే ఉత్కృష్ట మార్గం. ఆయన సముద్రమే మహోదధి లేదా గొప్ప మహాసముద్రం. మయూర్భంజ్ జిల్లాలోని మా ఊరు ఉపర్‌బేడా నుంచి పురుషోత్తమ క్షేత్రం పూరీ చాలాదూరంలో ఉంటుంది. మరి పూరీని సందర్శించే అవకాశం నాకెలా వస్తుంది? నేను పెద్దయ్యాక, భువనేశ్వర్‌కి వెళ్లాను. అక్కడ బాలికల ఉన్నత పాఠశాలయూనిట్-2లో చేరాను. అక్కడే వసతిగృహంలో ఉండే దాన్ని. అక్కడ ఉన్నప్పుడే పూరీ, భువనేశ్వర్, కోణార్క్ సందర్శించే అవకాశం నాకు లభించింది. మొదటిసారి మహాప్రభును దర్శించుకున్న జ్ఞాపకం ఇప్పటికీ నామదిలో స్పష్టంగాఉంది. ఎంత అద్భుతమైన ఆలయం! ఎంత తేజోవంతమైన దేవతా మూర్తులు! వాటిని మరచిపోగలమా? ఎవరైనా మహా ప్రభు జగన్నాథుని రథయాత్రను మరచి పోగలరా? శ్రీ క్షేత్రలో ఏడాదిలోని పన్నెండు నెలల్లో పదమూడు ఉత్సవాలు జరుగుతాయి. కానీ రథయాత్ర వైభవం మాత్రం అద్వితీయం. మహాప్రభు దర్శనంకోసం ఏడాది పొడవునా భక్తులు ఆలయాన్ని సందర్శిస్తారు. కానీ ఏడాదికోసారి మహాప్రభువే ఆలయాన్ని వదలి విశాల పథంలో గుండిచా ఆలయానికి చేరుకొని భక్తు లకు దర్శన మిస్తారు. మూడు అద్భుతమైన రథాలపై చక్రరాజ సుదర్శనునితో పాటు ముగ్గురు దేవతా మూర్తులు గుండిచా ఆలయానికి చేరుకుంటారు. అక్కడే ఏడురోజులు ఉండి, ఆ తర్వాత తిరుగుప్రయాణమవుతారు. అత్యంత వైభవోపేతమైన ఈ మహాప్రభు ఉత్సవానికి సాటి



లేదు. చిన్నతనం నుంచి మహాప్రభు జగన్నాథుని భక్తురాలిని. నేను అత్యంత భక్తిభావంతో కొలిచే దైవం ఆయన. నా జీవితంలో ఒడిదొడుకులను నిర్ణయించేది ఆయనే. నా సుఖ దుఃఖాలకు ఆయనే మూలం. నా జీవితంలో ఎన్నోకష్టాలను ఎదుర్కొన్నాను. ఆ సమస్యలన్నింటి నుంచి మహాప్రభు నన్ను బయటకు తీసుకొచ్చారు. ఎంతైనా నేను ఆయన బిడ్డనే కదా. భారత రాష్ట్రపతి పదవికి నన్ను అభ్యర్థిగా ప్రకటించినప్పుడు.. నేను భక్తిపూర్వకంగా మహా ప్రభుని తలచుకున్నాను. నన్ను ఇంత పెద్దస్థాయికి తీసుకెళుతున్నావు. నన్ను ముందుకు నడిపించు. ఎప్పుడూ నాతోనే ఉండు అని ప్రార్థించాను. ఆయన నా మొర ఆలకించారు. నా ప్రార్థనకు ఆయన ఎప్పుడూ స్పందిస్తారు. నేను రాష్ట్రపతి అభ్యర్థిగా పోటీ చేస్తున్న తరుణంలో.. రథయాత్ర ఉత్సవం జరిగింది. నేను అప్పుడు ఢిల్లీలోనే ఉండాల్సి వచ్చింది. పూరీ వెళ్లడం సాధ్యం కాలేదు. రథయాత్ర రోజు ఉదయమే నేను ఢిల్లీలోని హౌజ్‌ఖాస్‌లో ఉన్న శ్రీజగన్నాథుని ఆలయానికి వెళ్లాను. మహా ప్రభు దర్శనం చేసుకున్నాను. నా హృదయం ఆనందంతో ఉప్పొంగిపోయింది. ఆయన నాపై తన ఆశీస్సులను కురి పించారు. పూర్తి విశ్వాసంతో నేను నామినేషన్ దాఖలు చేశాను. అత్యంత ఉత్సాహంతో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నాను. 2022 జులై 25న రాష్ట్రపతిగా ప్రమాణ స్వీకారం చేయడానికి పార్లమెంట్ సెంట్రల్ హాలుకి వెళుతూ..దారిలో నేను మహాప్రభు జగన్నాథుని స్మరి స్తూనే ఉన్నాను. ఆయన ఆశీస్సులతో, కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. రాష్ట్రపతిగా నేను మొదటిసారి ప్రసంగించినప్పుడు ఆయన నాతోనే ఉన్నట్టు అనిపించింది. అయినప్పటికీ.. మహాప్రభు దర్శనం కోసం నా హృదయం పరితపించింది. రోజులు గడచిపోతున్నాయి కానీ పూరీ వెళ్లడం సాధ్యం కాలేదు. ఆయన అనుమతిస్తేనే తప్ప ఎవరికైనా ఆయన దర్శనం ఎలా లభిస్తుందని నాకు అని పించింది. మహాప్రభూ! నేనేదైనా తప్పు చేసి ఉంటే నన్ను క్షమించండి. దయచేసి నన్ను పూరీకి పిలిచి.. మీ దర్శన భాగ్యం ఇవ్వండి అనిమౌనంగా ప్రార్థించాను. భావాలకు లేదా భావోద్వేగాలకు కూడా ఆయనే మహాప్రభు. నా ఆలోచనలను ఆయన ఎలా అర్థం చేసుకోకుండా ఉంటారు? అనతి కాలంలోనే పూరీ పర్యటనకు షెడ్యూల్ ఖరారైంది. ఆ రోజు 2022 నవంబరు 10. పూరీకి చేరుకున్న తర్వాత వాహన శ్రేణి శ్రీ మందిర్ దిశగా ముందుకు వెళుతోంది. పూరీలోని బడదాండ వద్దకు చేరుకోగానే అనిర్వచనీయమైన అనుభూతి నన్ను ముంచెత్తింది. బడదాండ శ్రీజగన్నాథునిది. ఇక్కడ ప్రొటోకాల్ పాటించాల్సిన అవసరం ఉందా? అన్ని పుణ్య క్షేత్రాల్లోనూ క్షేత్ర రాజంగా పూరీ ప్రసిద్ధి చెందింది. దేవుళ్లకే దేవుడు మహాప్రభు. ఎలాంటి ఆలోచనలు లేకుండా నా కారుని ఆపించాను. నా కారు ఆగగానే వెనుక వస్తున్న కార్లనీ కూడా ఆగిపోయాయి. ఏం జరుగుతుందో మిగిలిన వారికి అర్థమయ్యేలోపే.. చెప్పులు లేకుండా బడ దాండపై నడవడం మొదలుపెట్టా ను. అక్కడికి శ్రీ మందిర్ రెండు కిలోమీటర్ల దూరంలో ఉంది. ఆలయ శిఖరం మీద ఉన్న నీలచక్రం, పతిత పావన ధ్వజం మీదే నా దృష్టిని సారించి ముందుకు సాగాను. ముందుకు నడుస్తూనే.. రోడ్డుకిరు వైపులా ఉన్న బాలలు, మహిళలు, యువత, పెద్దలకు నమస్కరిస్తూనే ఉన్నాను. కానీ నా దృష్టి మాత్రం మహాప్రభు మీదే ఉంది. ఆలయ సింహద్వారానికి చేరుకొనే సరికి.. నేను స్థిమితంగా ఉండలేకపోయాను. అప్పటికే నన్ను నేను మరచిపోయాను. బడ దాండ మీద దుమ్ములోనే సాష్టాంగ నమస్కారం చేసి ఆ మహాప్రభుకి నా ప్రణామాలు అర్పించాను. ఆ తర్వాత నేను గుడిలోకి వెళ్లాను. గర్భగుడికి చేరుకొని నలుగురు దేవతామూర్తులను దర్శనం చేసుకుని, దైవికానందంతో ఉప్పొంగిపోయాను. ఈ విశ్వానికి రక్షకుడు మహాప్రభువే. అందరూ వదిలేసిన వారికి కూడా ఆయనే రక్షకుడు. లోకం లోని జనుల కష్టాలను తీర్చేందుకు ఆయన ఎల్లప్పుడూ సిద్ధంగానే ఉంటారు. అందుకే ఆయన విశాలమైన గుండ్రటి నేత్రాలు ఎప్పుడూ రెప్ప వాల్చవు. ఆయనకి పెద్దాచిన్నా తారతమ్యం లేదు. ఆయన దృష్టిలో అందరూ సమానులే. సమానత్వమే ఆయన మంత్రం. ఆయన దీవెనలతోనే.. సమాజంలోని ప్రతి వర్గానికి సేవ చేసేందుకు నన్ను నేను అంకితం చేసుకున్నాను. గుండ్రని కన్నులతో ఉన్న మహాప్రభు జగన్నాథుని చూస్తూ.. ఓ మహాబాహూ! ప్రజలకు సేవ చేయాలనే నా అంకితభావం కొనసాగేలా ఆశీర్వదించు. ఓ కృపానిధీ! నా దేశాన్ని, ఈ ప్రపంచాన్ని రక్షించు అని చేతులు జోడించి ప్రార్థించాను. ఇలా చెబుతూ భక్తిభావంలో లీనమైపోయాను. ●

# అవగాహనే కల్తీకి అసలైన అడ్డుకట్ట

డాక్టర్. వై. సంజీవ కుమార్

నేటి సమాజంలో కల్తీ అనేది కేవలం ఆహార పదార్థాలకే పరిమితం కాలేదు. మనం తినే ఆహారం నుంచి, తాగే నీరు వరకు, వాడే మందుల నుంచి, రోజువారీ వినియోగ వస్తువుల వరకు అనేక రంగాల్లో నాణ్యతలేని ఉత్పత్తులు విస్తరిస్తున్నాయి. ఫలితంగా ప్రజల ఆరోగ్యం, ఆర్థిక పరిస్థితి, పర్యావరణం తీవ్రంగా దెబ్బతింటున్నాయి. నేటి సామాన్యుడు పెరుగుతున్న ధరలతో ఇప్పటికే కష్టాల కడలిలో కొట్టుమిట్టాడుతున్నాడు. సంపాదన తక్కువ, ఖర్చులు ఎక్కువ. అలాంటి పరిస్థితుల్లో 'తక్కువ ధరకు వస్తే చాలు' అనే ఆలోచనతో వస్తువులను కొనుగోలు చేస్తున్నాడు. కానీతక్కువ ధర కోసం తీసుకున్న ఆ నిర్ణయమే కొన్నిసార్లు జీవితాంతం బాధను మిగులుస్తోంది. ఆహారంలో నాణ్యత లేకపోవడం వల్ల చిన్నపిల్లల నుంచి వృద్ధుల వరకు అనేక రకాల అనారోగ్యసమస్యలు ఎదురవుతున్నాయి. కల్తీపాలు, నూనెలు, మసాలా దినుసులు, తీపి పదార్థాలు, పండ్లు, కూరగాయలు, తేనె వంటి అనేక ఆహారపదార్థాల్లో కల్తీ పెరుగుతోంది. ఇవి శరీరంలో నెమ్మదిగా విషంలా పనిచేసి క్యాన్సర్ వంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు దారితీస్తున్నాయి. ఆసుపత్రుల చుట్టూ తిరుగుతూ తాను సంపాదించిన డబ్బును వైద్య ఖర్చులకే వెచ్చించాల్సి వస్తోంది. చివరికి తక్కువ ధరకు కొన్నవస్తువు వల్ల ఎక్కువ నష్టాన్ని చవి చూస్తున్నాడు. ప్రజల ఆర్థిక బలహీనతను కొందరు వ్యాపారులు అవకాశంగా మలుచుకుంటున్నారు. నాణ్యత లేని ముడిపదార్థాలతో వస్తువులు తయారు చేసి, ఆకర్షణీయమైన ప్యాకింగ్‌తో మార్కెట్లో విక్రయిస్తూ అధిక లాభాలు పొందుతున్నారు. కొందరు నకిలీ బ్రాండ్ పేర్లతో ప్రజలను మోసం చేస్తున్నారు. నిజాయితీగా వ్యాపారంచేసే వారు నష్టపోతుండగా, అక్రమంగా సంపాదించే వారికి అవకాశాలు పెరుగుతున్నాయి. కల్తీని పూర్తిగా అరికట్టడం కష్టమే కావచ్చు. కానీ కఠినమైన చట్టాల అమలు, నిరంతర తనిఖీలు, నాణ్యత ప్రమాణాలను ఖచ్చితంగా పాటించే విధానం, నేరస్థులకు వేగవంతమైన శిక్షలు ఉంటే పరిస్థితిలో గణనీయ



మైన మార్పుతీసుకురావచ్చు. అలాగే వినియోగదారుల్లో అవగాహన పెరగడం కూడా అత్యంత అవసరం. ప్రజలు కూడా కొన్ని జాగ్రత్తలు పాటించాలి. కొనుగోలు చేసే వస్తువుల తయారీ తేదీ, గడువు తేదీ, నాణ్యత గుర్తులు, తయారీదారు వివరాలు పరిశీలించాలి. అనుమా నాస్పదమైన వస్తువులను కొనకుండా ఉండాలి. బిల్లు తప్ప నిసరిగా తీసుకోవాలి. కల్తీ లేదా నాణ్యతలేని వస్తువులు కనిపిస్తే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలి. వినియోగదారుల హక్కులపై అవగాహన పెంపొందించుకోవాలి. ప్రభుత్వ శాఖలు, ఆహార భద్రత అధికారులు, వినియోగదారుల సంఘాలు, మీడియా, స్వచ్ఛంద సంస్థలు కలిసి ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. కల్తీ ఉత్పత్తులను కొంతవరకైనా అరికట్టాలంటే ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరం. అందుకోసం ప్రభుత్వం ఒక ప్రత్యేక మొబైల్ యాప్‌ను అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి. ఎవరైనా ఆహార పదార్థాలు, మందులు లేదా ఇతర వస్తువుల నాణ్యతపై అనుమానం వ్యక్తం చేస్తే, వెంటనే ఆ యాప్‌ద్వారా ఫిర్యాదు చేసే అవకాశం ఉండాలి. ఆ యాప్‌లో వస్తువు ఫొటోలు, వీడియోలు, కొనుగోలు చేసిన బిల్లు, దుకాణం పేరు, చిరునామా, కొనుగోలు చేసిన తేదీ, లొకేషన్ వంటి వివరాలను నమోదు చేసే సౌకర్యం కల్పించాలి. ఫిర్యాదు నమోదైన వెంటనే అది సంబంధిత ఆహార భద్రత, వినియోగదారుల పరిరక్షణ లేదా ఇతర తనిఖీ అధికారులకు చేరేలా వ్యవస్థ రూపొందించాలి. ప్రతి ఫిర్యాదుకు ఒక ప్రత్యేక ట్రాకింగ్ నంబర్ ఇచ్చి, దాని పురోగతిని ఫిర్యాదు చేసిన వ్యక్తి యాప్‌లోనే తెలుసుకునే అవకాశం కల్పించాలి. ఫిర్యాదు నిజమని తేలితే సంబంధిత వ్యాపార సంస్థపై వెంటనే తనిఖీలు నిర్వహించి, అవసరమైతే వస్తువులను స్వాధీనం చేసుకోవడం, భారీ జరిమానాలు విధించడం, లైసెన్స్ రద్దు చేయడం వంటి కఠిన చర్యలు తీసుకోవాలి. అదే విధంగా, ఒకే దుకాణం లేదా తయారీ సంస్థపై పదేపదే ఫిర్యాదులు వస్తే వాటిని ప్రత్యేకంగా గుర్తించి కఠిన పర్యవేక్షణలో ఉంచాలి. తప్పుడు ఫిర్యాదులు తగ్గించేందుకు ఆధారాలతో కూడిన ఫిర్యాదులకే ప్రాధాన్యత ఇవ్వాలి. ●

# ప్రజాస్వామ్య దిశానిర్దేశకుడు ఓటరే..

ఫిరోజ్ ఖాన్

రాజకీయ సభల్లో హాజరైన జనసందోహమే ప్రజాభిప్రాయం కాదు. సోషల్ మీడియాలో వైరల్ అయ్యే ప్రచారమే ఓటర్ల తుది నిర్ణయమూ కాదు. చివరకు ఎన్నికలఫలితాన్ని నిర్ణయించేది మౌనంగా ఉండే ఓటరేనా? ప్రస్తుతం తెలంగాణ రాజకీయాల్లో ఎక్కువగా చర్చకు వస్తున్న ప్రశ్న ఇదే. రాష్ట్రంలో 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో అధికార మార్పు చోటుచేసుకుంది. ఎన్నికల ముందు వెలువడిన వివిధ రాజకీయ విశ్లేషణలు, సర్వేలు, ప్రజా చర్చలతో పోలిస్తే తుది ఫలితాలపై భిన్న వ్యాఖ్యానాలు వ్యక్తమయ్యాయి. దీంతో 'సైలెంట్ ఓటర్' పాత్రపై మరోసారి చర్చ ప్రారంభమైంది. భారత ఎన్నికల సంఘం అధికారిక గణాంకాల ప్రకారం, గత తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో సుమారు 71 శాతం పోలింగ్ నమోదైంది. ఇది ప్రజాస్వామ్య భాగస్వామ్యం బలంగా కొనసాగుతోందని సూచిస్తుంది. మరో వైపు భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 326 ప్రతి అర్హుడైన పౌరుడికి సార్వత్రిక ఓటు హక్కును కల్పిస్తే, 2013లో 'పీపుల్స్ యూనియన్ ఫర్ సివిల్ లిబర్టీస్ (పీయూసీఎల్) వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా' కేసులో రహస్య ఓటు ప్రజాస్వామ్య సమగ్రతకు కీలకమైన అంశమని సుప్రీంకోర్టు పేర్కొంది. అందువల్ల ఓటరు తన రాజకీయ అభిప్రాయాన్ని బహిరంగంగా వెల్లడించకపోయినా, పోలింగ్ కేంద్రంలో తీసుకునే నిర్ణయమే ప్రజాస్వామ్యానికి అసలు నిర్వచనంగా నిలుస్తుంది. సైలెంట్ ఓటర్‌ను ఒకే కులం, ఒకే మతం, ఒకే వర్గం లేదా ఒకే పార్టీతో ముడిపెట్టడం ప్రజాస్వామ్య వాస్తవాలను అతిగా సరళీకరించినట్లే అవుతుంది. భారత ఎన్నికల సంఘం విడుదల చేసే పోలింగ్ శాతం, ఓటరు జాబితా సవరణలు, ఓటర్ల గణాంకాలు ఎన్నికల నిర్వహణకు సంబంధించిన సమాచారాన్ని మాత్రమే అందిస్తాయి. కానీ ఓటరు ఎందుకు ఒక నిర్ణయం తీసుకున్నాడో చెప్పవు. సీఎస్‌డీఎస్ (సెంటర్ ఫర్ ది స్టడీ ఆఫ్ డెవలపింగ్ సొసైటీస్-లోక్‌నీతి) వంటి సంస్థలు నిర్వహించిన ఎన్నికల అనంతర అధ్యయనాలు, ఓటర్ల నిర్ణయాన్ని ఒక్క అంశంతో వివరించడం సాధ్యం కాదని, అనేక సామాజిక, ఆర్థిక, స్థానిక అంశాలు కలిసే ప్రభావం చూపుతాయని సూచిస్తున్నాయి. పాలనపై అభిప్రాయం, స్థానిక అభివృద్ధి, ఉపాధి అవకాశాలు, రైతు సమస్యలు, మహిళల భద్రత, ధరల పెరుగుదల, సంక్షేమ పథకాల అమలు, అభ్యర్థి విశ్వసనీయత, ప్రాంతీయ సమస్యలు ఇలాంటి అనేక అంశాలు కలిసి ఓటరు నిర్ణయాన్ని ప్రభావితం చేస్తాయి. తెలంగాణలో పట్టణ-గ్రామీణ ప్రాంతాల అవసరాలు, ప్రాధాన్యతలు భిన్నంగా ఉండటంతో రాజకీయ స్పందన కూడా ఒకేలా ఉండదు. అందుకే ప్రతి రాజకీయ పార్టీ వివిధ సామాజిక వర్గాలతో నిరంతర సంబంధం కొనసాగించడం ప్రజాస్వా మ్య వ్యవస్థలో సహజమైన రాజకీయ ప్రక్రియ. అయితే తుది నిర్ణయం మాత్రం ఓటరు స్వతంత్ర అభి



ప్రాయం, వ్యక్తిగత అనుభవం, విశ్వాసంపైనే ఆధారపడి ఉంటుంది. రాజకీయ కమ్యూనికేషన్ గత దశాబ్దంలో గణనీయంగా మారిపోయింది. ఒకప్పుడు బహిరంగ సభలు, పోస్టర్లు, సంప్రదాయ ప్రచారమే ప్రధాన సాధనాలు కాగా, ఇప్పుడు సోషల్ మీడియా, డిజిటల్ ప్రచారం, డేటా ఆధారిత వ్యూహాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. అదే సమయంలో సమాచార వేగం పెరిగిన కొద్దీ వాస్తవ నిర్ధారణ అవసరమూ పెరిగింది. రాష్ట్రంలో అధికార, ప్రతిపక్ష పార్టీలన్నీ ప్రజలతో మమేకం కావడానికి విభిన్న పద్ధతులను అనుసరిస్తున్నాయి. ఇది ప్రజాస్వామ్య వ్యవస్థలో సహజమైన పోటీ. అయితే ప్రచార తీవ్రత ఒక్కటే ప్రజాభిప్రాయాన్ని కొలిచే ప్రమాణం కాదని రాజకీయ విశ్లేషకులు కూడా అభిప్రాయపడుతున్నారు. ఓటరు తన కుటుంబ ఆర్థిక పరిస్థితి, స్థానిక మౌలిక సదుపాయాలు, ప్రభుత్వ సేవల అనుభవం, ప్రజాప్రతినిధు ల అందుబాటు, భవిష్యత్‌పై నమ్మకం వంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకుంటాడు. అందువల్ల రాజకీయ సైకాలజీ అంటే భావోద్వేగాలను ప్రభావితం చేయడం మాత్రమే కాదు, ప్రజల్లో విశ్వాసాన్ని నిర్మించడం, నిలబెట్టుకోవడం, విశ్వసనీయతను సంపాదించడం కూడా అంతే కీలకమైన అంశంగా మారింది. డిజిటల్ ప్రచారం ఎంత విస్తరించినా, ఓటరు వ్యక్తిగత అనుభవం, స్థానిక వాస్తవాలు, పాలనపై తన అంచనాలే చివరికి అతని నిర్ణయాన్ని ప్రభావితం చేసే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. రాజకీయ పార్టీలు వ్యూహాలు రూపొందించడం, ప్రజలను ఆకర్షించే ప్రయత్నాలు చేయడం ప్రజాస్వామ్య వ్యవస్థలో సహజం. అదే సమయంలో ప్రతి పార్టీ తన విధానాలు, పనితీరు, నాయకత్వాన్ని ప్రజల ముందుకు తీసుకెళ్లే హక్కు కూడా కలిగి ఉంటుంది. కానీ ఆ ప్రయత్నాలన్నింటికీ తుది తీర్పు ఇచ్చేది ఓటరే. అందుకే 'సైలెంట్ ఓటర్' అనేది ఏ ఒక్క పార్టీకి చెందిన రాజకీయ పదం కాదు. అది భారత ప్రజా స్వామ్య స్వేచ్ఛకు ప్రతీక. ప్రస్తుత రాజకీయ పరిణామాల నేపథ్యంలో ప్రచారం దృష్టినిఆకర్షించవచ్చు, రాజకీయ నినాదాలు చర్చను సృష్టించవచ్చు, డిజిటల్ ట్రెండ్లు అభిప్రాయాలను ప్రభావితం చేయవచ్చు. కానీ ప్రజల విశ్వాసాన్ని గెలుచుకునేది పారదర్శక పాలన, జవాబుదారీతనం, అభివృద్ధి, రాజ్యాంగ విలువలపట్ల నిబద్ధత మాత్రమే. చివరికి ఎన్నికల ఫలితాలు ఏపార్టీ విజయాన్ని మాత్రమే కాదు, మౌనంగా తన నిర్ణయాన్ని వ్యక్తపరిచిన లక్షలాది ఓటర్ల సమిష్టి తీర్పు ను కూడా ప్రతిబింబిస్తాయి. అందుకే రాజకీయాలను అర్థం చేసుకోవాలంటే నాయకుల ప్రసంగాల కంటే ప్రజల జీవితా లను, ప్రచారాల కంటే ప్రజల అనుభవాలను, నినాదాల కంటే ప్రజల విశ్వాసాన్ని వినడం అవసరం. ప్రచారం ప్రజల దృష్టిని ఆకర్షించవచ్చు, కానీ ప్రజాస్వామ్యానికి దిశను నిర్దేశించేది చివరికి ఓటరే. ●

# సెమీకాన్ 2.0కు గ్రీన్‌సిగ్నల్




● రూ.1.28 లక్షల కోట్లు కేటాయింపు ● భారత్‌లో ఫోన్ల తయారీకి రూ.62.500 కోట్లు ● వారణాసిలో 2 మెగా ఎలివేటెడ్ కారిడార్లకు ఓకే ● రైల్వే విస్తరణ, ఎరువుల ఉత్పత్తి తదితర 7 కీలకప్రతిపాదనలకు కేంద్ర కేబినెట్ ఆమోదం ● వివరాలు వెల్లడించిన కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్

**న్యూఢిల్లీ, జులై 15:** మౌలిక సదుపాయాలు, సెమీకండక్టర్లు, మొబైల్ తయారీ, రైల్వేలు, యూరియా తదితర రంగాలకు సంబంధించిన 7 కీలక ప్రతిపాదనలకు బుధవారం ప్రధానమంత్రి నరేంద్రమోడీ అధ్యక్షతన నిర్వహించిన కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. మొత్తం రూ.2,19,353 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఈ ప్రాజెక్టులు భారత ఆర్థిక వ్యవస్థకు కొత్త దిశను చూపనున్నాయని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ అభిప్రాయపడ్డారు. దేశ అభివృద్ధికి అవసరమైన కీలకరంగాల్లో పెట్టుబడులను పెంచడం, దిగుమతులపై ఆధారాన్ని తగ్గించడం, ఉపాధి అవకాశాలను సృష్టించడం ఈ నిర్ణయాల ప్రధాన లక్ష్యమని ఆయన తెలిపారు. సెమీకండక్టర్ రంగానికి సంబంధించిన కీలక కార్యక్రమాన్ని విస్తరిస్తూ రూ. 1.28 లక్షల కోట్ల (రూ.1,27,500 కోట్లు) అదనపు నిధులను కేటాయించేందుకు, అలాగే మొబైల్ ఫోన్ తయారీకోసం రూ. 62,500 కోట్ల వ్యయానికి కేబినెట్ ఆమోదం తెలిపిందని కేంద్ర సమాచార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. కేబినెట్ సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడుతూ, భారతదేశంలో సెమీకండక్టర్ డిజైన్, తయారీ వ్యవస్థ (ఎకోసిస్టమ్) అభివృద్ధి కోసం ప్రభుత్వం 'సెమీకాన్ 2.0 కార్యక్రమానికి ఆమోదం తెలిపిందని వైష్ణవ్ చెప్పారు. సెమీకాన్ 2.0 కార్యక్రమం ఆరు ప్రధాన అంశాల (స్తంభాల) ఆధారంగా రూపొందించబడుతుందని వైష్ణవ్ పేర్కొన్నారు. 1.చిప్ డిజైన్, 2. యంత్రాలు- ముడి పదార్థాలు, 3. కొత్త సెమీకండక్టర్ తయారీ కేంద్రాల ఏర్పాటు, 4.అసెంబ్లీ, టెస్టింగ్, మార్కింగ్, ప్యాకేజింగ్. అలాగే అవుట్‌సోర్స్డ్ సెమీకండక్టర్ అసెంబ్లీ, టెస్ట్ ప్యాకేజింగ్ వ్యవస్థను బలోపేతం చేయడం. 5. పరిశోధన, అభివృద్ధి. 6. నైపుణ్యాల అభివృద్ధి (టాలెంట్ డెవలప్‌మెంట్). ఈ కార్యక్రమం మొదటి దశ అయిన 'సెమీకాన్ 1.0 విజయవంతమైందని పేర్కొన్న వైష్ణవ్, ఇప్పటికే మూడు ప్లాంట్లలో చిప్ ఉత్పత్తి ప్రారంభమైందని తెలిపారు. "ఇది ఒక వ్యూహాత్మక పరిశ్రమ. ప్రపంచంలోని అనేక దేశాలు దీనిని ఇప్పటికే వ్యూహాత్మక పరిశ్రమగా ప్రకటించాయి. సెమీకాన్ 1.0 కింద ఆమోదించబడిన 12 సెమీకండక్టర్‌ప్లాంట్లలో, మూడు ప్లాంట్లలో వాణిజ్య పరమైన ఉత్పత్తి ఇప్పటికే ప్రారంభమైంద్ది అని ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖల బాధ్యతలు కూడా నిర్వహిస్తున్న వైష్ణవ్ అన్నారు.

రాబోయే ఐదేళ్లలో రూ.62,500 కోట్ల బడ్జెట్ కేటాయింపుతో 'మొబైల్ ఫోన్ తయారీ పథకం'ను ప్రకటించినట్లు కేంద్ర మంత్రి వైష్ణవ్ తెలిపారు. ఉత్పత్తిని పెంచడానికి, దేశీయ విలువ జోడింపును మరింతగా పెంపొందించడానికి, సరఫరా గొలుసు స్థితిస్థాపకతను బలోపేతం చేయడానికి, 'మేడ్ ఇన్ ఇండియా' మొబైల్ ఫోన్‌ల ప్రపంచ పోటీతత్వాన్ని మెరుగుపరచడానికి ఈ నిధులను వినియోగిస్తామని పేర్కొన్నారు. ఈ పథకం కింద, భారతదేశంలో మొబైల్ ఫోన్‌ల తయారీకి సంబంధించిన అర్హత గల అమ్మకాలపై ప్రభుత్వం 2.25 శాతం నుండి 5 శాతం వరకు వేర్వేరు రేట్లలో ప్రోత్సాహక మద్దతునుఅందిస్తుంది. అలాగే,కీలకమైన భాగాలు, సబ్‌అసెంబ్లీల దేశీయ సేకరణకు అనుసంధానంగా 1.5 శాతం వరకు అదనపు ప్రోత్సాహకాన్ని కూడా అందిస్తుంది. భారతీయ బ్రాండ్‌లను నిర్మించే లక్ష్యంతో ఉత్పత్తి రూపకల్పన, ఆర్‌డి కోసం అర్హత గల అమ్మకాలపై ప్రభుత్వం 3 శాతం అదనపు ప్రోత్సాహకాన్ని అందిస్తుంది.

వారణాసికి వేగంగా పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలను తగ్గించేందుకు రెండు భారీ ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి కేంద్రం ఆమోదం తెలిపింది. మొదటి ప్రాజెక్టుగా వరుణా నది వెంట 6/4 లేన్ల ఎలివేటెడ్ కారిడార్ నిర్మించనున్నారు. దీనికి రూ.10,998 కోట్ల వ్యయం అవుతుంది. వారణాసి రింగ్ రోడ్‌ను జాతీయ రహదారి31తో అనుసంధానం చేసే ఈ ప్రాజెక్టు మొత్తం 43.21 కిలో మీటర్ల మేర నిర్మించబడుతుంది. రెండో ప్రాజెక్టుగా గంగా నది వెంట 6 లేన్ల గ్రీన్‌ఫీల్డ్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి ఆమోదం లభించింది. ఈ ప్రాజెక్టు వ్యయం సుమారు రూ.14,448 కోట్లుగా అంచనా వేశారు.

**రైల్వే రంగానికి మరో రెండు ప్రాజెక్టులు**

దేశంలో సరుకు రవాణా, ప్రయాణికుల రాకపోకలను మరింత వేగవంతం చేసేందుకు కేంద్రం రెండు కీలక రైల్వే ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది. ఒడిశాలోని పరదీప్ హారిదాస్‌పుర్ రైల్వే మార్గం డబ్లింగ్ పనులకు రూ.2,542 కోట్ల వ్యయాన్ని ఆమోదించింది. దీంతో పోర్టు ప్రాంతాల నుంచి సరుకు రవాణా మరింత సులభతరం కానుంది. అలాగే డంగోపోసిరాజ్ ఖర్సవాన్ మధ్య నాలుగో రైల్వే లైన్ నిర్మాణానికి రూ.1,365 కోట్ల పెట్టుబడికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ ప్రాజెక్టు పూర్తయితే తూర్పు భారతదేశంలో రైల్వే నెట్‌వర్క్ సామర్థ్యం పెరగనుంది.

## టిఎంసిలో ఎమ్మెల్యే రాజీనామా



### కేసులభయంతో రెబెల్ శిబిరంలోకి మదన్ మిత్రా

**కోల్‌కతా,జులై 15:** పశ్చిమ బెంగాల్ అధికార పార్టీ తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి)లో అంతర్గత విభేదాలు మరింత ముదురుతున్నాయి. సీనియర్ టిఎంసి ఎమ్మెల్యే మదన్ మిత్రా బుధవారం ప్రతిపక్ష నేత రితబ్రత బెనర్జీ నేతృత్వంలోని తిరుగుబాటు శిబిరంలో చేరడం పార్టీ అధినేత్రి మమతా బెనర్జీ వర్గానికి మరో రాజకీయ షాక్‌గా మారింది. తాను ఇప్పటికీ టిఎంసి సభ్యుడినేనని మదన్ మిత్రా స్పష్టం చేశారు. కమర్హాటి నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న మదన్ మిత్రా, మమతా బెనర్జీ వర్గానికి చెందిన "కాళీఘాట్ టిఎంసి" జాతీయ, రాష్ట్ర స్థాయి అన్ని సంస్థాగత కమిటీలకు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీలో పార్టీ చీఫ్ విప్ పదవికి కూడా తక్షణమే రాజీనామా చేశారు. అసెంబ్లీలో రితబ్రత బెనర్జీని ఆయన కార్యాలయంలో కలిసి అనంతరం మీడియాతో మాట్లాడిన మదన్ మిత్రా, నేను ఇల్లు మార్చలేదు.. కేవలం గది మాత్రమే మార్చాను. నేను ఇప్పటికీ తృణమూల్ కాంగ్రెస్‌లోనే ఉన్నానని వ్యాఖ్యానించారు. తెల్లటి కుర్తా, తన ప్రత్యేకమైన నల్లటి కళ్లద్దాలతో రితబ్రత బెనర్జీ పక్కన కూర్చున్న మదన్ మిత్రా, మమతా బెనర్జీ నేతృత్వంలోని వర్గంలో ఇకపై ఎలాంటి సంస్థాగత బాధ్యతలు చేపట్టబోనని, అయితే టిఎంసి ఎమ్మెల్యేగా కొనసాగుతానని వెల్లడించారు. కాళీఘాట్ టిఎంసికి చెందిన జాతీయ, రాష్ట్ర కమిటీలన్నింటి నుంచి రాజీనామా చేస్తున్నాను. అలాగే చీఫ్ విప్ పదవినీ వీడుతున్నాను. కానీ నేను టిఎంసి ఎమ్మెల్యేగానే కొనసాగుతానని ఆయన తెలిపారు. టిఎంసిలో సంస్థాగత విభజన బహిర్గతమైన తర్వాత తిరుగుబాటు శిబిరంలో చేరిన అత్యంత ప్రముఖ నేతగా మదన్ మిత్రా నిలిచారు. దీంతో మమతా బెనర్జీ వర్గం ఎదుర్కొంటున్న రాజకీయ సంక్షోభం మరింత తీవ్రమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. టిఎంసిలో ప్రజాదరణ కలిగిన కీలక నాయకుడిగా, మమతా బెనర్జీకి సుదీర్ఘకాలం అత్యంత సన్నిహిత సహచరుడిగా పేరుగాంచిన మదన్ మిత్రా, ఇటీవల పార్టీ నాయకత్వంలోని కొన్ని వర్గాలపై బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తం చేశారు. అయినప్పటికీ పార్టీని వీడే ఉద్దేశం లేదని పలుమార్లు స్పష్టం చేశారు.అయితే ఇప్పుడు రితబ్రత బెనర్జీ శిబిరానికి మద్దతు ప్రకటించడం ద్వారా తిరుగుబాటు వర్గానికి ఇప్పటివరకు లభించిన అత్యంత ప్రముఖ రాజకీయ ముఖచిత్రంగా మారారు.

## గల్ఫ్‌నౌకల్లో ఉన్న ప్రతి భారతీయ నావికుడి వివరాలు ప్రత్యేక నమోదు

### కేంద్ర షిప్పింగ్ శాఖ తాజా ఆదేశాలు

**న్యూఢిల్లీ,జులై 15:** పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్న వేళ గల్ఫ్ ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న ప్రతి భారత నావికుడి వివరాలను ప్రత్యేకంగా నమోదు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. నౌక ఏ దేశ జెండాతో ప్రయాణిస్తున్నా అందులో పనిచేస్తున్న ప్రతి భారతీయుడిపై పూర్తి సమాచారం ఉండేలా చర్యలు చేపట్టాలని ఆదేశించింది. ఈ మేరకు డైరెక్టర్ జనరల్ ఆఫ్ షిప్పింగ్‌కు కేంద్ర పోర్టులు, షిప్పింగ్, జలమార్గాల శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్ ఆదేశాలు జారీ చేశారు. పర్షియన్ గల్ఫ్, హార్మూజ్ జలసంధి, ఒమన్ గల్ఫ్‌లో ప్రయాణిస్తున్న ప్రతి నౌకపై ప్రత్యేక ఆపరేషనల్ డ్యాష్‌బోర్డ్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ డ్యాష్‌బోర్డ్‌లో నౌక ఉన్న ప్రాంతం, యాజమాన్యం, సరకు వివరాలు, సిబ్బంది సంఖ్య, భారతీయ నావికుల సంక్షేమం, భద్రతా పరిస్థితి, ప్రయాణ మార్గం, చేరాల్సిన పోర్టు, అందుబాటులో ఉన్న సౌకర్యాల వంటి సమాచారం ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంటుంది. వాణిజ్య నౌకలపై జరుగుతున్న దాడులను భారత్ తీవ్రంగా ఖండించిందని సోనోవాల్ తెలిపారు. ఈ దాడుల్లో భారత నావికులు ప్రాణాలు కోల్పోవడం, మరికొందరు గాయపడటం తీవ్ర వేదన కలిగించిందని చెప్పారు. ప్రపంచ సరఫరా వ్యవస్థ కొనసాగడంలో కీలక పాత్ర పోషిస్తున్న భారత నావికులపై ఇలాంటి దాడులు ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేశారు. ఇరాన్, ఒమన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని భారత రాయబార కార్యాలయాలు, విదేశాంగ శాఖతో సమన్వయం పెంచాలని అధికారులను మంత్రి ఆదేశించారు. నౌకాయాన భద్రత, ప్రత్యామ్నాయ పోర్టులు, వైద్య సాయం, తరలింపు, స్వదేశానికి పంపే ఏర్పాట్లు, దర్యాప్తు పురోగతిపై ఎప్పటికప్పుడు ధ్రువీకరించిన సమాచారం సేకరించాలని సూచించారు. అలాగే గల్ఫ్ ప్రాంతంలో భారతీయ నావికులను నియమించిన షిప్పింగ్ కంపెనీలు, నౌకల నిర్వహణ సంస్థలు, రిక్రూట్‌మెంట్ ఏజెన్సీలు వెంటనే నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. పూర్తి సమాచారం, భద్రత, అవసరమైన సాయం లేకుండా ఏ భారతీయ నావికుడినీ విధులకు పంపొద్దని స్పష్టం చేశారు.



## 19 యేళ్ల తర్వాత కోల్‌కతాకు తిరిగి వస్తున్న తస్లీమా నస్రీన్

### రాజకీయ వివాదానికి దారితీసిన పర్యటన

**కోల్‌కతా, జులై 15:** బంగ్లాదేశ్‌కు చెందిన ప్రవాస రచయిత్రి, మానవ హక్కుల కార్యకర్త తస్లీమా నస్రీన్ దాదాపు రెండు దశాబ్దాల అనంతరం కోల్‌కతాకు తిరిగి రానున్నారు. ఆమె రచనలపై గతంలో తీవ్ర నిరసనలు చెలరేగడంతో 2007లో నగరాన్ని విడిచిపెట్టాల్సి వచ్చిన సంగతి తెలిసిందే.63 యేళ్ల తస్లీమా నస్రీన్ రాసిన ఆత్మకథాత్మక గ్రంథం'ద్విఖండితో'పై దైవదూషణ ఆరోపణలు రావడంతో అప్పటి సిపిఎం ప్రభుత్వం ఆ పుస్తకాన్ని నిషేధించింది. 2004 నుంచి 2007 వరకు కోల్‌కతాలో నివసించిన ఆమె ప్రస్తుతం దీర్ఘకాలిక నివాస అనుమతితో ఢిల్లీలో ఉంటున్నారు.ఈ నేపథ్యంలో 2026 ఆగస్టు 1న రబీంద్ర సదన్‌లో నిర్వహించనున్నమౌలికవాద వ్యతిరేక కార్యక్రమానికి ఆమె హాజరుకానున్నారు. 2007 తర్వాత కోల్‌కతాకు ఇది ఆమె తొలి పర్యటన. మూడు సంస్థల సంయుక్త ఆహ్వానం మేరకు ఆమె ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో తస్లీమా నస్రీన్ కొన్ని కవితలు పఠించడంతో పాటు చర్చలో పాల్గొననున్నారు. ఆమె గౌరవార్థం పౌర సత్కారం కూడా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి సువేందు అధికారి, రాష్ట్ర ఆర్థిక మంత్రి స్వపన్ దాస్‌గుప్తా, ప్రముఖ రచయిత శీర్షేందు ముఖోపాధ్యాయ్ హాజరయ్యే అవకాశముందని నిర్వాహకులు వెల్లడించారు.అయితే ఆమె పర్యటన ఇప్పటికే రాజకీయ వివాదానికి దారి తీసింది. రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు సమీక్ భట్టాచార్య మాట్లాడుతూ, తస్లీమా నస్రీన్ స్వరాన్ని ఎందుకు అణచివేయాలి, బంగ్లాదేశ్‌లో హిందూ కుటుంబం ఎదుర్కొన్న హింసను లజ్జాలో ఆమె రాశారు. గత వామపక్ష ప్రభుత్వం ఆమె రచనలను నిషేధించింది. కోల్‌కతాకు ఆమె రావడాన్ని మేము స్వాగతిస్తున్నామన్నారు. బంగ్లాదేశ్‌లో ఇప్పటికీ నిషేధంలో ఉన్న లజ్జా నవలలో అక్కడి హిందువులు, ఇతర మతపు మైనారిటీలపై జరిగిన అవమానం, హింసను చిత్రీకరించారు.మరోవైపు తృణమూల్ ఎమ్మెల్యే అఖ్రుజ్జమాన్ స్పందిస్తూ, తస్లీమా నస్రీన్ తరచూ ముస్లింలపై విమర్శలు చేస్తారని, అందుకే డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ఆమెను గౌరవిస్తోందని ఆరోపించారు.

## మోస్ట్‌వాంటెడ్ జాబితాలో గ్యాంగ్‌స్టర్ నితీశ్ కౌశల్



**వాషింగ్టన్,జులై 15:** అగ్రరాజ్యం అమెరికాలో అంతర్జాతీయ నేర ముఠాలపై ఎఫ్‌బీఐ చర్యలను వేగవంతం చేసింది. తాజాగా భారత మూలాలున్న నితీశ్ కౌశల్‌ను మోస్ట్ వాంటెడ్ నేరస్థుల జాబితాలోచేర్చింది. హత్యలు, కిడ్నాప్‌లు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వసూళ్లు, ఆయుధాల అక్రమ రవాణా, మనీ లాండరింగ్, మానవ అక్రమ రవాణా వంటి నేరాల్లో అతనికి ప్రమేయం ఉన్నట్లు ఎఫ్‌బీఐ ఆరోపించింది. నితీశ్ కౌశల్‌కు జగ్గు భగవాన్‌పురియా ఆర్గనైజ్డ్ క్రిమినల్ గ్రూప్‌తో సంబంధాలు ఉన్నాయి. పంజాబ్‌లో ప్రారంభమైన ఈ ముఠా అమెరికాలోని కాలిఫోర్నియా సెంట్రల్ జిల్లా సహా పలు ప్రాంతాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు దర్యాప్తు సంస్థలు గుర్తించాయి.

## ఆ ముగ్గురికీ క్లీన్‌చిట్ ఇవ్వడమా?

### చిన్నస్వామి స్టేడియం తొక్కిసలాట కేసులో కాంగ్రెస్ సర్కార్‌పై అశోక్ తీవ్ర విమర్శలు




**బెంగళూరు, జూలై 15:** గత యేడాది బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనలో 11 మంది ప్రాణాలు కోల్పోయిన కేసులో ముగ్గురు సీనియర్ ఐపిఎస్అధికారులకు కర్ణాటక ప్రభుత్వం క్లీన్ చిట్ ఇవ్వడంపై రాష్ట్ర అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడు అశోక్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. బాధ్యులను కాపాడేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆయన ఆరోపించారు. జూన్ 4, 2025న జరిగిన ఈ విషాద ఘటనకు సంబంధించి సీనియర్ ఐపిఎస్ అధికారులు బి. దయానంద, వికాస్ కుమార్ వికాస్, శేఖర్ హెచ్. తెక్కన్నవర్‌లపై ప్రారంభించిన శాఖాపరమైన విచారణలను ప్రభుత్వం ఉపసంహరించుకోవడాన్ని ప్రశ్నించిన అశోక్ ఈ ఘటనకు అసలు బాధ్యులు ఎవరో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. బిడ్డలను కోల్పోయిన తల్లిదండ్రుల కన్నీళ్లు, వారి శాపం ఈ హంతకకాంగ్రెస్ ప్రభుత్వాన్ని వదిలిపెట్టదని ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన 11 మంది అమాయక యువతకు న్యాయం చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అశోక్ ఆరోపించారు. ఈ విషాదాన్ని ప్రభుత్వ ప్రాయోజిత హత్యగా అభివర్ణిస్తూ, బాధ్యులను రక్షించడమే ప్రభుత్వ లక్ష్యంగా మారిందని విమర్శించారు. చిన్నస్వామి స్టేడియం వద్ద జరిగిన భయానక తొక్కిసలాటలో 11 మంది అమాయక యువతీయువకుల మరణాలకు నిజమైన బాధ్యులు ఎవరు ఈ ప్రభుత్వ ప్రాయోజిత విషాదానికి న్యాయం ఎక్కడని ఆయన ప్రశ్నించారు.అప్పటి ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఒకే రోజు రెండు వేదికల్లో ఐపీఎల్ విజయోత్సవాలకు అనుమతి ఇచ్చారని, అదే సమయంలో అప్పటి ఉప ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్ విషాద పరిస్థితులు నెలకొన్నప్పటికీ ఆర్సీబీ జెండాతో ఫోటోలకు పోజులిచ్చారని అశోక్ ఆరోపించారు.అలాగే పోలీసులు ముందుగానే హెచ్చరించినప్పటికీ, అప్పటి డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ అడ్మినిస్ట్రేటివ్ రిఫార్మ్స్ (డీపీఏఆర్) కార్యదర్శి సత్యవతి విధానసౌధ ముందు కార్యక్రమం నిర్వహించాలంటూ పట్టుబట్టారని, మొత్తం పరిపాలనా యంత్రాంగాన్ని అప్పటి ప్రధాన కార్యదర్శి షాలిని రజనీష్ పర్యవేక్షించారని పేర్కొన్నారు. ఇప్పుడు సిద్ధరామయ్యకు తప్పులేదు, డి.కె. శివకుమార్ అమాయకుడు, ప్రధాన కార్యదర్శికి ఎలాంటి బాధ్యతలేదు, డిపిఏఆర్ కార్యదర్శి నిర్దోషి, ఇప్పుడు పోలీసు అధికారులూ నిర్దోషులయ్యారు.మరి ఆ 11మంది అమాయకుల మరణాలకు బాధ్యులు ఎవరు వాళ్లు తమంతట తామే చనిపోయారా అంటూ ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు. ప్రభుత్వం నియమించే ప్రతి విచారణ కూడా నిజాలను వెలికితీయడానికి కాకుండా కేసును పూడ్చిపెట్టడానికేనని అప్పుడే చెప్పానన్నారు. కాగా, జూన్ 4, 2025న జరిగిన చిన్నస్వామి స్టేడియం తొక్కిసలాట కేసులో సీనియర్ ఐపిఎస్ అధికారులు బి. దయానంద, వికాస్ కుమార్ వికాస్, శేఖర్ హెచ్. తెక్కన్నవర్‌లపై ప్రారంభించిన శాఖాపరమైన క్రమశిక్షణ చర్యలను కర్ణాటక ప్రభుత్వం మంగళవారం అధికారికంగా విరమించుకుంది. అఖిల భారత సర్వీసుల (క్రమశిక్షణ, అప్పీల్) నిబంధనలు1969 ప్రకారం ప్రారంభించిన విచారణలను సంబంధిత అధికారుల వివరణలు, పరిపాలనా శాఖ అభిప్రాయాలను పరిశీలించిన అనంతరం మూసివేస్తున్నట్లు డిపిఏఆర్ (సర్వీసెస్4) శాఖ ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసింది.2025 జూన్ 4న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబి) తొలి ఐపిఎల్ టైటిల్ విజయోత్సవాల సందర్భంగా చిన్నస్వామి స్టేడియం వెలుపల భారీ సంఖ్యలో అభిమానులు గుమిగూడడంతో తొక్కిసలాట చోటుచేసుకుంది. ఈ ఘటనలో అధికారిక లెక్కల ప్రకారం 11 మంది మృతి చెందగా, కనీసం 56 మంది గాయపడ్డారు.

## సుప్రీంకోర్టులో హంగామా చేసిన ఇద్దరు న్యాయవిద్యార్థుల అరెస్టు

**న్యూఢిల్లీ,జులై 15:** సుప్రీంకోర్టులో న్యాయ విచారణకు అంతరాయం కలిగించడంతో పాటు భద్రతా సిబ్బందిపై దాడి చేసిన ఇద్దరు న్యాయ విద్యార్థులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారిపై పలు సెక్షన్లకింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని ఎటావా జిల్లాకు చెందిన, లక్నో విశ్వవిద్యాలయంలో మూడో సంవత్సరం న్యాయ విద్యార్థి అయిన 24 ఏళ్ల ప్రబల్ ప్రతాప్ సింగ్, రాయ్‌బరేలికి చెందిన రెండవ సంవత్సరం న్యాయ విద్యార్థి 23 ఏళ్ల చందర్ భాన్ కలిసి జులై 10న సుప్రీంకోర్టులో హంగామా చేశారు. ప్రబల్ ప్రతాప్ సింగ్ దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌పై సర్వోన్నత న్యాయస్థానంలో విచారణ జరుగుతుండగా కోర్టు కార్యకలాపాలకు అంతరాయం కలిగించారు. పిటిషనర్ అయిన ప్రబల్ ప్రతాప్ స్వయంగా కోర్టుకు హాజరై గందరగోళం సృష్టించాడు. న్యాయయూర్తులను దుర్భాషలాడటంతో పాటు కోర్టు హాలులో కాగితాలు విసిరేశాడు. అదుపు చేసేందుకు జోక్యం చేసుకున్న భద్రతా సిబ్బందిపై న్యాయ విద్యార్థులు దాడిచేసి వారి విధులను అడ్డుకున్నారు. మరో వైపు సుప్రీంకోర్టు భద్రతా సిబ్బంది ఫిర్యాదుపై ఢిల్లీ పోలీసులు స్పందించారు. ఇద్దరు న్యాయ విద్యార్థులను అరెస్ట్ చేశారు. వారిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. నిందితుల ప్రవర్తనపై సుప్రీంకోర్టు సూచనల మేరకు వైద్య పరీక్షల కోసం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ బిహేవియర్ అండ్ అలైడ్ సైన్సెస్‌కు తీసుకువెళ్లారు. అయితే ఇద్దరు న్యాయ విద్యార్థుల మానసిక ఆరోగ్యం బాగానే ఉన్నట్లుగా వైద్యులు నిర్ధారించారని పోలీస్ అధికారి తెలిపారు. దీంతో నిందితులిద్దరినీ రెండు రోజుల పోలీస్ కస్టడీకి తరలించినట్లు చెప్పారు. వారి వద్ద ఉన్న అభ్యంతరకర విషయాల కరపత్రాలను కూడా స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

## భారీ వర్షాల మధ్య కూడా చార్‌ధామ్ యాత్ర..



### 14 లక్షలు దాటిన యాత్రికుల సంఖ్య

**డెహ్రాడూన్, జూలై 15:** ఉత్తరాఖండ్‌లో ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు కురుస్తున్నప్పటికీ, ప్రతిష్ఠాత్మక చార్‌ధామ్ యాత్రకు భక్తుల రద్దీ ఏమాత్రం తగ్గడం లేదు. ప్రతిరోజూ వేలాది మంది భక్తులు బద్రీనాథ్, కేదార్‌నాథ్ సహా పవిత్ర క్షేత్రాలను దర్శించుకుంటూ యాత్రను కొనసాగిస్తున్నారు.ప్రతికూల వాతావరణ పరిస్థితులు, భారీ వర్షాలు, కొండచరియలు విరిగిపడే ప్రమాదాలు ఉన్నప్పటికీ భక్తుల ఉత్సాహం ఏమాత్రం తగ్గలేదని అధికారులు తెలిపారు.అధికారుల వివరాల ప్రకారం, ప్రతిరోజూ 6 వేల మందికి పైగా భక్తులు శ్రీ బద్రీనాథ్ ధామ్‌ను దర్శించుకుంటున్నారు. ఇక ప్రస్తుత యాత్రా సీజన్‌లో కేదార్‌నాథ్ ధామ్‌ను దర్శించిన భక్తుల సంఖ్య ఇప్పటికే 14 లక్షలు దాటింది. అయితే నిరంతర వర్షాల కారణంగా ఉత్తరాఖండ్‌లోని అనేక ప్రాంతాల్లో రహదారులు దెబ్బతినడం, కొండచరియలు విరిగిపడటం, ట్రెక్కింగ్ మార్గాలు జారుడుగా మారడంవంటి సమస్యలు ఎదురవుతున్నాయని అధికారులు తెలిపారు. అందువల్ల యాత్రికులు అత్యంత అప్రమత్తంగా ప్రయాణించాలని సూచించారు.భారత వాతావరణ శాఖ (ఐఎండీ) రాష్ట్రంలోని చమోలి, రుద్రప్రయాగ్, పౌరీ గఢ్వాల్ తదితర కొండ ప్రాంతాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఈ ప్రాంతాల్లో భారీనుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు, యాత్రికులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. ప్రతికూల పరిస్థితులు ఉన్నప్పటికీ బద్రీనాథ్‌కేదార్‌నాథ్ ఆలయ కమిటీ, జిల్లా యంత్రాంగంకలిసి యాత్ర సజావుగా సాగేందుకు అన్ని ఏర్పాట్లు కొనసాగిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. యాత్రికుల భద్రత, సౌకర్యాల కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. బద్రీనాథ్ దర్శనం అనంతరం ఓ భక్తుడు మాట్లాడుతూ, తాము మొదట హేమకుండ్ సాహిబ్‌ను దర్శించేందుకు వచ్చామని, అక్కడ ప్రార్థనలు చేసిన తర్వాత బద్రీనాథ్ ధామ్‌ను కూడా సందర్శించాలని భావించి ఇక్కడికి వచ్చామని చెప్పారు. ఇక్కడి అనుభవం ఎంతో అద్భుతంగా ఉందని, అన్ని ఏర్పాట్లు బాగున్నాయని, ప్రతి ఒక్కరూ ఈ పవిత్ర క్షేత్రాన్ని దర్శించి ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందాలని సూచించారు.మరో భక్తుడు కూడా వర్షాలు కొనసాగుతున్నప్పటికీ యాత్ర కోసం చేసిన ఏర్పాట్లను ప్రశంసించారు.

ప్రతికూల వాతావరణం ఉన్నా యాత్ర ఎలాంటి ఇబ్బందులు లేకుండా పూర్తయిందని తెలిపారు. రుద్రప్రయాగ్ జిల్లా కలెక్టర్ విశాల్ మిశ్రా మాట్లాడుతూ, మొన్నటి సాయంత్రం వరకు అందుబాటులో ఉన్న గణాంకాల ప్రకారం కేదార్‌నాథ్ ధామ్‌ను దర్శించిన భక్తులసంఖ్య 14 లక్షలు దాటిందన్నారు. ప్రస్తుతం మాన్సూన్ కారణంగా వాతావరణ పరిస్థితులే ప్రధాన సవాలుగా మారాయని చెప్పారు.వర్షాల సమయంలో రహదారులు తరచూ మూసివేయబడుతున్నాయని, కొండచరియలు విరిగిపడే ప్రమాదం అధికంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఎత్తైన ప్రాంతాల్లో యాత్ర సాగుతుండటంతో కొంతమంది భక్తులు ఆరోగ్య సమస్యలకు గురవుతున్నారని తెలిపారు. ముఖ్యంగా గుండెపోటు వంటి కారణాలతో కొందరు మృతి చెందిన ఘటనలు చోటుచేసుకున్నాయని, అనారోగ్యానికి గురైన పలువురిని సకాలంలో రక్షించి వైద్య చికిత్స అందించామని వెల్లడించారు.

## సంక్షిప్త వార్తలు

### హార్మూజ్‌కు ప్రత్యామ్నాయంగా ఫుజైరా పోర్టు




**అబూదాబి,జులై 15:** పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలో నెలకొన్న తీవ్ర ఉద్రిక్తతల నేపథ్యంలో, వ్యూహాత్మక ప్రాధాన్యత కలిగిన హార్మూజ్ జలసంధికి ప్రత్యామ్నాయ మార్గాన్ని అభివృద్ధి చేయడంపై యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఎఇ) ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా, దుబాయ్‌కి చెందిన ప్రముఖ పోర్ట్స్ ఆపరేటర్ డిపి వరల్డ్, దేశ తూర్పుతీరంలోని ఫుజైరాలో కొత్తమల్టీపర్పస్ పోర్టు, కంటైనర్ టెర్మినల్ నిర్మాణ పనులను వేగవంతం చేసింది. ఈ ప్రాజెక్టు అందుబాటులోకి వస్తే, నౌకలు ప్రమాదకరమైన హార్మూజ్ జలసంధి గుండా ప్రయాణించాల్సిన అవసరంలేకుండానే నేరుగా యూఎఇకి సరుకు రవాణాచేసే వెసులుబాటు కలుగుతుంది.

### పాక్‌లో ఘోర ప్రమాదం: నలుగురు మృతి


**కాబూల్,జులై 15:** పాకిస్థాన్‌లోని పంజాబ్ ప్రావిన్స్‌లో బుధవారం ఉదయం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి చెందగా, మరో 15 మంది తీవ్రంగా గాయపడ్డారు.స్థానిక మీడియా కథనాల ప్రకారం, షేక్‌పురా జిల్లాలోని మురిద్కే ప్రాంతంలో కలా ఖతాయ్ రోడ్ సమీపంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. సైద్‌వాలాలో నిర్వహించిన ఒమతపరమైన కార్యక్రమానికి హాజరై లాహోర్‌కు తిరిగి వస్తున్న ప్రయాణికులతో బస్సు ప్రయాణిస్తోంది. మార్గమధ్యలో ఎదురుగా వస్తున్న మోటార్ సైకిల్‌ను తప్పించేందుకు బస్సు డ్రైవర్ ఒక్కసారిగా వాహనాన్ని మలుపు తిప్పడంతో అదుపుతప్పి బస్సు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో సంఘటనా స్థలంలోనే నలుగురు మృతి చెందినట్లు అధికారులు తెలిపారు.

### అయోధ్య ట్రస్టు సిఇఓ పోస్టుకు వెయ్యికిపైగా దరఖాస్తులు



**అయోధ్య,జులై 15:** రామమందిరం నిర్వహణ కోసం శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ నూతనంగా ప్రకటించిన ప్రధాన కార్య నిర్వహణాధికారి (సిఇఓ) పోస్టుకు అనూహ్య స్పందన లభిస్తోంది. నోటిఫికేషన్ విడుదలైన రెండు రోజుల్లో వెయ్యికిపైగా దరఖాస్తులు ట్రస్టుకు అందడం విశేషం. ఆలయ పరిపాలన, ఆర్థిక వ్యవహారాలను మరింత క్రమబద్ధీకరించి, వృత్తిపరమైన ప్రమాణాలతో తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ట్రస్ట్ ఈ సిఇఓపదవిని సృష్టించింది. అభ్యర్థులలో అత్యధికులు విశ్రాంత బ్యూరోక్రాట్లు, మాజీ సీనియర్ పరిపాలనాధికారులు ఉండటం గమనార్హం.

### అంతరిక్షంలోకి భారతసంతతి వ్యోమగామి అనిల్‌మీనన్



**ఆస్తానా, జులై 15:** భారత సంతతికి చెందిన నాసా వ్యోమగామి అనిల్ మీనన్ తన తొలి అంతరిక్ష యాత్రను విజయవంతంగా ప్రారంభించారు. రష్యాకు చెందిన సోయజ్ ఎంఎస్29 వ్యోమనౌకలో అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి ఆయన సురక్షితంగా చేరుకున్నారు. దాదాపు ఎనిమిది నెలలపాటు సాగే ఈమిషన్‌లో ఆయన కీలకమైన శాస్త్రీయ పరిశోధనలు, సాంకేతిక ప్రయోగాలు చేపట్టనున్నారు. కజకిస్థాన్‌లోని బైకనూర్ కాస్మోడ్రోమ్ నుంచి సోయజ్ ఎంఎస్ 29 వ్యోమనౌకలో అనిల్ మీనన్, రోస్‌కాస్మోస్ వ్యోమగాములు ప్యోటర్ డుబ్రోవ్, అన్నా కికినాలతో కలిసి బయలుదేరారు. కేవలం మూడు గంటల ప్రయాణం తర్వాత వారి వ్యోమనౌక ఐఎస్ఎస్‌లోని ప్రిచల్ మాడ్యూల్‌తో విజయవంతంగా అనుసంధానమైంది.

### ఇవి ఛార్జింగ్‌తో మంటలు.. ఇద్దరు మృతి

**లక్నో,జులై 15:** ఛార్జింగ్ చేస్తున్న ఎలక్ట్రిక్ వాహనంలో మంటలు చెలరేగాయి. పక్కనే ఉన్న వాహనాలకు మంటలు వ్యాపించడంతో బిల్డింగ్ అంతా పొగలు కమ్ముకున్నాయి. ఫైర్ సిబ్బంది వెంటనే అక్కడకు చేరుకుని మంటలు అదుపుచేశారు. ఈ అగ్నిప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మరణించారు. 50 కుటుంబాలకు చెందిన వారిని కాపాడారు. దేశ రాజధాని ఢిల్లీ శివారు ప్రాంతమైన ఉత్తరప్రదేశ్‌లోని నోయిడాలో ఈ సంఘటన జరిగింది. బుధవారం సెక్టార్ 66లోని మమురా విలేజ్ ప్రాంతంలోని ఒక బిల్డింగ్‌లో అగ్నిప్రమాదం సంభవించింది.

# స్మార్ట్ మీటర్ల ఏర్పాటు పనులు వేగవంతం

● ఎస్‌పిడిసిఎల్ మొబైల్ యాప్ సరళతరం ● ఎస్‌పిడిసిఎల్ సిఎండి శివశంకర్



**తిరుపతి, జులై 15 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎస్‌పిడిసిఎల్ పరిధిలో స్మార్ట్ మీటర్ల ఏర్పాటు పనులను వేగవంతం చేయాలని సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి కోరారు. తిరుపతిలోని ఎస్‌పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలో బుధవారం సంస్థ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా సిఎండి మాట్లాడుతూ సంస్థ పరిధిలో ప్రభుత్వ కార్యాలయాలు, వాటర్ వర్క్స్, వీధి దీపాలు తదితర సర్వీసులతోపాటు గృహ విద్యుత్ సర్వీసులకు, ఫీడర్లకు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లకు మొత్తం కలిపి ఇప్పటివరకు 10.50 లక్షల స్మార్ట్ మీటర్లను అమర్చామన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ప్రభుత్వ విద్యుత్ సర్వీసుల విద్యుత్ వినియోగం, బిల్లింగ్‌లో పారదర్శకతను పెంపొందించేందుకు వీలుగా స్మార్ట్ మీటర్లను ప్రిపెయిడ్ స్మార్ట్ మీటర్లుగా మార్చినట్లు తెలియజేశారు. స్మార్ట్ మీటర్ల ద్వారా వినియోగదారులు విద్యుత్ వినియోగాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించుకోవడం, విద్యుత్తు పొదుపు, బిల్లులో ఆదా చేసుకునేందుకు అవకాశం వుంటుందని వివరించారు.

**ఎస్‌పిడిసిఎల్ మొబైల్ యాప్ సరళతరం:** సంస్థ పరిధిలో విద్యుత్ వినియోగదారుల సౌలభ్యం కోసం అందుబాటులో ఉన్న మొబైల్ అప్లికేషన్‌ను సరళతరం చేశామని సిఎండి శివశంకర్ లోతేటి తెలిపారు. ఈ యాప్ ద్వారా వినియోగదారులు విద్యుత్ బిల్లుల చెల్లింపు, పేమెంట్ వివరాలను తెలుసుకోవడంతోపాటు కొత్త సర్వీసులకు దరఖాస్తు చేసుకునే సౌలభ్యం కూడా వుందన్నారు. ఆండ్రాయిడ్ మొబైల్స్ తోపాటు ఐఫోన్ వినియోగదారులు కూడా ఈ యాప్‌ను డౌన్లోడ్ చేసుకోవచ్చని తెలియజేశారు.

సంస్థ పరిధిలో ఇప్పటికే మంజూరైన సబ్ స్టేషన్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. సబ్ స్టేషన్ల నిర్మాణంలో పరికరాల నాణ్యతను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, సంబంధిత కాంట్రాక్టర్లతో సమన్వయం చేసుకుంటూ పనుల్ని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు పి.అయూబ్ ఖాన్, కె.గురవయ్య, చీఫ్ జనరల్ మేనేజర్లు కె.ఆదిశేషయ్య, జె.రమణా దేవి, సిహెచ్ రామచంద్ర రావు, కె.సంపత్ కుమార్, ఎస్.రమణ, జనరల్ మేనేజర్లు శ్రీనివాసులు, జగదీష్, లత పాల్గొన్నారు.

## మెరిట్ ఆధారంగానే ఎఇఇ పోస్టుల నియామకం

● 20 లోగా దరఖాస్తు చేసుకోవాలి ● ఆగస్ట్ 22 నుంచి రాతపరీక్షలు



**తిరుపతి, జులై 15 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో ఎపిట్రాన్స్‌కో, ఎపిజెన్‌కో, ఎస్‌పిడిసిఎల్, ఇపిడిసి ఎల్, ఎపిసిపిడిసిఎల్ సంస్థల్లో అసి స్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పోస్టు ల భర్తీ ప్రక్రియలో భాగంగా రాత పరీక్షలో మెరిట్ ద్వారానే నియామ కాలను చేపట్టడం జరుగుతుందని ఎస్‌పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి బుధవారం పేర్కొన్నారు. ఎపిట్రాన్స్‌కోలో ఎలక్ట్రికల్ ఇంజనీర్లు 16, టెలికామ్ 10, సివిల్ ఇంజనీర్లు 23 మొత్తం కలిపి 200, ఎపిజెన్‌కోలో ఎలక్ట్రికల్ ఇంజనీర్లు 52, మెకానికల్ 21, ఎలక్ట్రానిక్స్ 7, సివిల్ ఇంజనీర్లు 20 మొత్తం కలిపి 100, ఎపిఎస్‌పిడిసిఎల్లో ఎలక్ట్రికల్ ఇంజనీర్లు 125, టెలికామ్ 4, సివిల్ ఇంజనీర్లు 6 మొత్తం కలిపి 135, ఎపిఇపిడిసిఎల్లో ఎలక్ట్రికల్ ఇంజనీర్లు 128, టెలికామ్ 3, సివిల్ ఇంజనీర్లు 4 మొత్తం కలిపి 135, ఎపిసిపిడిసిఎల్లో ఎలక్ట్రికల్ ఇంజనీర్లు 56, టెలికామ్ 1, సివిల్ ఇంజనీర్లు 3 మొత్తం కలిపి 60 పోస్టుల నియామకానికి ఆయా సంస్థలు ప్రకటనను జారీ చేయడం జరిగింద న్నారు. నియామక ప్రకటనలో పేర్కొన్న షెడ్యూల్ మేరకే ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ కొన సాగుతోందని, ఈ నెల 20వ తేదీ లోగా అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దర ఖాస్తు చేసుకోవాలని సూచించారు. షెడ్యూల్ పేర్కొన్న విధంగానే ఈ ఏడాది ఆగస్టు 22వతేదీ నుండి 29వతేదీ వరకు కంప్యూటర్ ఆధారిత పరీక్షలను నిర్వహించడం జరుగు తుందని తెలిపారు. ఈ షెడ్యూల్ తేదీల్లో ఎటువంటి మార్పు వుండబోదని స్పష్టం చేశారు.

**నియామకాల్లో అవకతవకలకు చోటు లేదు:** ఎఇఇ పోస్టుల నియామక ప్రక్రియలో ఎటువంటి అవక తవకలకు చోటులేదని, ఈ ప్రక్రియ మొత్తాన్ని పారదర్శకంగా నిర్వహించడం జరుగుతుందని సిఎండి శివశంకర్ వివరించారు. ఈ ప్రక్రియకు సంబంధించిన అధికారిక సమాచారాన్ని వెబ్సైట్ ద్వారా తెలుసుకోవచ్చన్నారు. ఎఇఇ పోస్టుల నియామక అంశంలో అభ్యర్థులు దళారుల మాటలు, ఇతర అనధికారిక సామాజిక మాధ్య మాల ద్వారా వెలువడే సమాచారాన్ని నమ్మి మోసపోవద్దని సూచించారు.

## ఎక్సలెన్సీ సెంటర్లలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

●ప్రవేశం పొందిన విద్యార్థులకు ఇంటర్, ఐఐటి, నీట్, జెఇఇకి ఉచిత శిక్షణ

**విజయవాడ, జులై 15 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ ప్రముఖ కోచింగ్ సంస్థల సహ కారంతో నడపబోతున్న సెంటర్స్ ఆఫ్ ఎక్స లెన్స్‌లో, ఇంటిగ్రేటెడ్ ఐఐటి, జెఇఇ, నీట్ కోచింగ్‌తో కూడిన ఇంటర్మీడియట్ (ఎంపిసి/బైపిసి) కోర్సులలో ప్రవేశం కోసం అర్హులైన విద్యార్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తు న్నట్టు ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ కార్యదర్శి ప్రసన్న వెంకటేష్ తెలిపారు. మార్చి 2026లో జరిగిన ఎస్ఎస్‌సి పబ్లిక్ పరీక్షలో ఉత్తీర్ణులై, 85శాతం లేదా అంతకంటే ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులు జూనియర్ ఇంటర్మీడియట్ కోసం దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని తెలిపారు. మార్చి 2026లో జూనియర్ ఇంటర్మీడియట్‌లో 75శాతం మార్కులు సాధించిన విద్యార్థులు సీనియర్ ఇంటర్మీడియట్ కోసం దరఖాస్తు చేసుకోవచన్నారు.

ఈ సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ కేంద్రాల ద్వారా నాణ్యమైన ఇంటర్మీడియట్ విద్యతో పాటు సమగ్రమైన ఐఐటి, జెఇఇ, నీట్ కోచింగ్, వసతి, భోజనం, స్టడీ మెటీరియల్, ఇతర విద్యాపరమైన సహాయంతో కూడిన ఉచిత గురుకుల విద్యను అందిస్తామని తెలిపారు. 17 జులై 2026 నుండి 30 వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. ఇప్పటికే ఇతర జూనియర్ కళాశాలల్లో ప్రవేశం పొందిన విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని ప్రసన్న వెంకటేష్ తెలిపారు.

## రౌడీ షీటర్‌పై పిడి యాక్ట్

**తిరుపతి, జులై 15 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతి జిల్లాలో ప్రజల శాంతి భద్రతలకు భంగం కలిగిస్తూ వరుసగా తీవ్రమైన నేరాలకు పాల్పడుతున్న రౌడీ షీటర్ కంకి వంశి(25)పై పిడియాక్టు పోలీసులు నమోదు చేశారు. ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు ప్రతిపాదనతో జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ పిడి యాక్ట్ కింద నిర్బంధ ఉత్తర్వులు జారీ చేశారు. నిందితుడు సూళ్లూరుపేట, శ్రీహరికోట, తడ, నాయుడుపేట, చిట్టమూరు, కోట, వాకాడు, గూడూరు, నెల్లూరు, గుంటూరు తదితర ప్రాంతాల్లో దొంగతనాలు, దాడులు, మహిళలపై వేధింపులు, ఆయుధాలతో బెదిరింపులు, ప్రజల్లో భయాందోళనలు సృష్టించడం, ప్రభుత్వ ఉద్యోగుల విధులకు ఆటంకం కలిగించడం వంటి తీవ్రమైన నేరాలకు పాల్పడినట్లు నమోదైంది. అతనిపై మొత్తం 28 క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. పలుమార్లు అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకున్నప్పటికీ అతని నేరప్రవర్తనలో మార్పు రాకపోవడంతో, ప్రజా శాంతి భద్రతలకు తీవ్ర ముప్పుగా మారినట్లు జిల్లా పోలీసు శాఖ గుర్తించింది. దీంతో జిల్లా కలెక్టర్ జారీ చేసిన నిర్బంధ ఉత్తర్వుల మేరకు నిందితుడిని ఈరోజు కడప సెంట్రల్ జైలుకు భద్రతా ఏర్పాట్ల మధ్య తరలించారు.

# తిరుచానూరు రోడ్ల అభివృద్ధికి టిటిడి నిధులు

మాస్టర్ ప్లాన్ రోడ్ల ప్రణాళికలకు ఆమోదం



**తిరుపతి, జులై 15 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆధ్యాత్మిక నగరం తిరుపతికి అత్యంత ప్రధాన మైన మరో పుణ్యక్షేత్రం తిరుచానూరు పరిసర ప్రాంతాల రహదారుల విస్తరణ, మాస్టర్ ప్లాన్ రోడ్ల అభివృద్ధికి టిటిడి నిధులు మంజూరుకు ఆమోదం లభించింది. తిరుచానూరులో కొలువైన పద్మావతి అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు, స్థానిక ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా రహదారులను ఏ విధంగా అభివృద్ధి చేయాలనే అంశంపై ప్రణాళికలు సిద్ధం చేశారు. తిరుచానూరు రోడ్ల అభివృద్ధికి సంబంధించిన మాస్టర్ ప్లాన్ ప్రణాళికలు, బ్లూప్రింట్లను టిటిడి చైర్మన్ బి.ఆర్. నాయుడుకి తుడ చైర్మన్ సి.దివాకర్‌రెడ్డి, జిల్లా సంయుక్త కలెక్టర్,విసి గోవిందరావు వివరించారు.

బుధవారం తుడ చైర్మన్ దివాకర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు ఆర్. గోవిందరావుతో కలిసి తుడా కార్యాలయంలో టిటిడి చైర్మన్ బి.ఆర్. నాయుడు నేతృత్వంలో జరిగిన సమావేశంలో టిటిడి పాలకమండలి సభ్యులు పనబాక లక్ష్మి, భానుప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు. తిరుచానూరు పరిసరాల్లో పెరుగుతున్న వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకుని భవిష్యత్తు అవసరాలకు తగ్గట్టుగా అంతర్గత, ప్రధాన రహదారులను లింక్ చేస్తూ మాస్టర్ ప్లాన్ రోడ్లను డిజైన్ చేశామన్నారు.

భూసేకరణ ప్రక్రియ, ప్రస్తుతం ఉన్న రోడ్ల విస్తరణకు ఎదురవుతున్న సాంకేతిక సవాళ్లను అధిగమించడానికి తీసుకుంటున్న చర్యలను టిటిడి చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు.

టిటిడి, తుడ సంయుక్త భాగస్వామ్యంతో ఈ ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేయడం ద్వారా తిరుపతి నగర రూపురేఖలు మారతాయని స్పష్టంచేశారు.

తుడ అధికారులు అందించిన ప్రజెంటేషన్, ప్రణాళికలపై చైర్మన్ బి.ఆర్. నాయుడు సంతృప్తి వ్యక్తం చేశారు. తిరుచానూరు రోడ్ల అభివృద్ధికి అవసరమైన నిధులను తక్షణమే మంజూరు చేసేందుకు టిటిడి బోర్డు పరంగా అన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

నిధుల కొరత లేకుండా చూస్తామన్నారు. ఎలాంటి జాప్యం లేకుండా టెండర్ల ప్రక్రియను పూర్తి చేసి, పనులను యుద్ధ ప్రాతిపదికన ప్రారంభించాలని తెలిపారు.

# నదుల అనుసంధానంతోనే కరవు నివారణ

● జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు ● కేంద్ర మాజీ మంత్రి దివంగత కెఎల్ రావుకు నివాళి



**విజయవాడ, జులై 15 ప్రభాతవార్త ప్రతినిధి:** భారతదేశం కరవు విపత్తును అధిగమించాలంటే నదులను అనుసంధానం చేయడమే ఏకైక మార్గమని ఎపి జలవనరుల శాఖా మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు ఉద్ఘాటించారు. గంగా, మహానది, గోదావరి, కృష్ణా, కావేరి వంటి నదులు ఈ దేశానికి చాలా అవసరమని కెఎల్ రావు సూచించారని, వాటిని అనుసంధానం చేయాలన్నారు. జలవనరుల శాఖ నిపుణుడు, కేంద్ర మాజీ మంత్రి దివంగత కెఎల్ రావు 125వ జయంతి సందర్భంగా విజయవాడ ప్రకాశం బ్యారేజీ వద్ద ఉన్న ఆయన ఘాట్ వద్ద మంత్రి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా నిమ్మల మాట్లాడుతూ "కెఎల్‌రావు ఇచ్చిన స్ఫూర్తి, అప్పటి ప్రధానమంత్రి నుండి ప్రస్తుత నరేంద్ర మోడీకి స్ఫూర్తినిచ్చింది. అదేవిధంగా, చంద్రబాబు నాయుడు కూడా దీనిని అమలు చేసి, పట్టిసీమ ద్వారా గోదావరి-కృష్ణా డెల్టాలను అనుసంధానించారు. ఇది కెఎల్ రావుకు మన గొప్ప నివాళి. పట్టిసీమ ద్వారా 445 టిఎంసిలకు పైగా గోదావరి జలాలను కృష్ణా డెల్టాకు తరలించాం" అని వివరించారు. పట్టిసీమ, ఒట్టిసీమ అన్న గొడ్డలి పార్టీ నాయకుడు ఇప్పుడు ఏం చెబుతారని మంత్రి నిమ్మల రామానాయుడు నిలదీశారు. విధ్వంసపు ఆలోచనలు, పాలన అనుభవం లేకపోవడం, ముందుచూపు లేకపోవడం వల్లే గొడ్డలి పార్టీ నాయకుడు పట్టిసీమ ఎత్తిపోతల వైపు కన్నెత్తి చూడలేదని మంత్రి విమర్శించారు. కృష్ణా డెల్టాకు నీరు అందక, సాగు తాగునీరు లేక బీడుగా మారితే చూడాలన్నదే గొడ్డలి పార్టీ ఆకాంక్ష అని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి దేవినేని ఉమా, కెఎల్ రావు కుమారుడు విజయరావు పాల్గొన్నారు.

మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ఈ అండర్ టన్నెల్ అయినా, భవానీపురం సమీపంలోని గాంధీ హిల్ అయినా, లేదా ప్రకాశం బ్యారేజీ వద్ద నీటిని నిల్వ చేయడం అయినా, ఈ స్ఫూర్తిని అందుకున్న ఎన్టీ రామారావు ఆ రోజుల్లో కృష్ణమ్మను తన కలంలో ఇరికించి తెలుగు గంగపై వారి మద్రాసులకు నీటిని అందించారు. అదే స్ఫూర్తితో, ముఖ్యమంత్రి పట్టిసీమ ప్రాంతంలో నదుల అనుసంధానం ద్వారా ఆ ప్రాంతానికి 445 టిఎంసిల నీటిని తీసుకువచ్చారు. 442 టిఎంసిల నీటిని వినియోగించుకొని రూ.50 వేల కోట్ల విలువైన పంటలను కృష్ణా డెల్టా రైతులు పండించారని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు చెప్పారు. వైఎస్సార్సీపీ కుట్రలు ఎన్ని చేసినా సిఎం చంద్రబాబు తాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేస్తారని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తన తండ్రి ఆశయాలతో ముందుకు సాగుతుండటం సంతోషంగా ఉందని కెఎల్ రావు కుమారుడు విజయరావు అన్నారు.

## తిరుమల సమాచారం

### శ్రీవారి దర్శన టిక్కెట్లు, వసతి కోసం మధ్యవర్తులను నమ్మి మోసపోవద్దు

● టిటిడి అధికారిక వెబ్‌సైట్‌నే వినియోగించాలి: అదనపు ఇఒ వెంకయ్యచౌదరి



**తిరుమల, జులై 15 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనానికి రోజురోజుకూ రెట్టింపవుతున్న భక్తుల సంఖ్యకు తగ్గట్లు పలు రకాలుగా దళారులు భక్తులను నమ్మించి మోసం చేస్తున్నారు. వివిధ దర్శనాలు కల్పిస్తామని, గదులు ఇప్పిస్తామని నమ్మించి భారీగా డబ్బులు తీసుకుని చివరకు దగా చేస్తున్నారు. దీంతో రోజురోజుకూ భక్తుల నుండి వస్తున్న ఫిర్యాదులతో టిటిడి అధికారులు కూడా అప్రమత్తమయ్యారు. ఓ వైపు టిటిడి విజిలెన్స్ విభాగం అధికారులు, తిరుమల పోలీసులు కేసులు నమోదు చేసి చేతులు దులుపేసుకుంటుండ టంతో దళారుల మోసాలు ఎక్కువయ్యాయనే విమర్శలు లేకపోలేదు. ఇప్పుడు టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి కూడా మధ్యవర్తులను, దళారులను నమ్మిమోసపోవద్దని సూచించారు. టిటిడి అధికారిక వెబ్‌సైట్ ద్వారానే భక్తులు దర్శనం టిక్కెట్లు, వసతి కోసం సంప్రదించాలని తెలిపారు. శ్రీవారి దర్శనం, వసతి గదులు, ఆర్జిత సేవలు తదితర బుకింగ్‌ల కోసం భక్తులు తప్పనిసరిగా టిటిడి అధికారిక వెబ్‌సైట్ ద్వారానే బుకింగ్ చేసుకోవాలని అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి విజ్ఞప్తి చేశారు.

# కుప్పలుతెప్పలుగా విరాళాలు!

● పెరిగిన దాతల దర్శనాల ఒత్తిడి తట్టుకోలేకనే సదుపాయాలు కోత
● టిటిడి కొత్త దాతలకు జీవితాంతం నుండి పాతికేళ్లకు కుదింపు




**తిరుమల, జులై 15 ప్రభాతవార్త ప్రతినిధి:** అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు... ఆపద మొక్కుల వాడు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనాల ప్రాధాన్యతలో దాతలు కీలకంగా మారారు. ఎన్నో ఏళ్ళనుండి ధార్మిక సంస్థ తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహిస్తున్న వివిధ ట్రస్టులు, పథకాలకు డబ్బున్న ధనవంతులు నుండి కోటీశ్వరులు కూడా దేవదేవునిపై భక్తి విశ్వాసాలతో విరాళాలివ్వడం పరిపాటిగా మారింది. ధనవంతులు, పారిశ్రామిక వేత్తలు, కోటీశ్వరులు కూడా దేవునిపై భక్తి విశ్వాసాలతోనే గాక వారి కుటుంబం తిరుమలకు వస్తే ఇష్టదైవాన్ని దగ్గరగా వీక్షించే భాగ్యం కలుగుతుందని విశ్వాసంతోనే విరాళాలు ఇస్తున్నారనేది టిటిడి వర్గాల అభిప్రాయం. ఇందులో ఎస్వీ అన్న ప్రసాదం ట్రస్ట్‌కు రూ.2,500 కోట్లకు పైగానే విరాళాలు రావడం విశేషం. ఆ తరువాత ఎస్వీ ప్రాణ దాన ట్రస్ట్‌కు ప్రస్తుతం విరాళాలు వెల్లువెత్తుతున్నాయి. అలాగే పలు ట్రస్ట్‌లకు దాతలు విరాళాలు ఇచ్చేందుకు టిటిడి అధికారులతో బాటు పాలకమండలి కూడా ప్రోత్సాహమిస్తోంది. టిటిడిలో దాదాపు 2లక్షల మంది దాతలు నమోదైనట్లు తెలుస్తోంది. మంగళవారం ఒక్కరోజే 96.98కోట్ల రూపాయలు వివిధ పథకాలకు విరాళాలు రావడం విశేషం. ఇందులో ఆన్‌లైన్‌ద్వారా 2,354మంది, ఆఫ్‌లైన్ ద్వారా 106మంది భక్తులు విరాళాలు అందించారు.

ఇదివరకు టిటిడి ట్రస్టులు, పథకాల్లో ఏదేని ఒక దానికి ఒక లక్ష రూపాయలు విరాళమిచ్చినా దాతలకు నిన్నటి వరకు సంవత్సరంలో మూడు సార్లు ఐదుగురికి సుపథం టిక్కెట్లు జారీచేసేవారు. నూతన దాతల పాలసీతో ఏడాదికి ఒకసారి మాత్రమే ప్రత్యేక ప్రవేశ దర్శనం (ఎస్ఇడి) టిక్కెట్లు జారీ చేస్తారు. రూ.2 లక్షలు విరాళాల దాతలకు ఏడాదికి ఒకసారి సుపథం దర్శనం టిక్కెట్లు ఇస్తారు. ఇలా రూ.3లక్షలు దాతలకు ఏడాదికి రెండుసార్లు సుపథం, రెండు సార్లు ఎస్ఇడి టిక్కెట్లు ఇస్తారు. రూ.10లక్షలు ఇచ్చిన దాతలకు సంవత్సరంలో ఒకసారి బిగినింగ్ బ్రేక్ దర్శనం సదుపాయం కల్పించారు. రూ.15లక్షలు విరాళమిచ్చిన దాతలకు ఒకసారి సుపథం, ఒకసారి బిగినింగ్ బ్రేక్ దర్శనాలు సదుపాయం కల్పించారు. రూ.20లక్షలు దాతలకు ఒకసారి సుపథం, ఒకసారి ఎస్ఇడి, రెండు సార్లు బిగినింగ్ బ్రేక్ దర్శనాలు సౌకర్యం ఉంటుంది. 25లక్షలు ఇచ్చిన దాతలకు రెండు సార్లు సుపథం, ఒకసారి ఎస్ఇడి, మూడు సార్లు విఐపి బ్రేక్ దర్శనాలు సదుపాయం ఉంటుంది. రూ.50లక్షలు దాతలకు ఏడాదికి నాలుగుసార్లు సుపథం, 2సార్లు బిగినింగ్ బ్రేక్, ఒకసారి సుప్రభాతం, 2సార్లు కల్యాణోత్సవం సేవా భాగ్యం కల్పిస్తారు.

అత్యధికంగా కోటి రూపాయలు ఇచ్చిన దాతలకు నాలుగుసార్లు సుపథం దర్శనం, 3సార్లు బిగినింగ్ బ్రేక్, సుప్రభాతసేవ దర్శనం 2సార్లు అవకాశం ఉంటుంది. ఇదివరకు ఉన్న సదుపాయాల్లో భారీగా టిటిడి కొత్తగా చేరే దాతలకు కోత విధించింది. ఇదివరకు దాతలకు జీవితాంతం సౌకర్యాలు కల్పించిన టిటిడి కొత్తవారికి 20యేళ్ళకు మాత్రమే కుదించింది. పలురకాలుగా పారిశ్రామికవేత్తలు ఇచ్చే విరాళాల దాతల సౌకర్యాలను 15సంవత్సరాలకు కుదించారు. టిటిడి గణాంకాల మేరకు రూ.10లక్షల లోపు దాతలు 1,212మంది, రూ.10లక్షల నుండి 25లక్షల వరకు 1,246మంది దాతలు, కోటి రూపాయలు విరాళాలిచ్చిన దాతలు కేవలం ఇద్దరే ఉండటం గమనార్హం. వసతి సదుపాయాల్లో కూడా వంద రూపాయలు గదుల నుండి 3వేల రూపాయల అద్దె గదుల వరకు ప్రయోజనం ఉంటుంది. టిటిడి నుండి ప్రయోజనాలను పొందడానికి దాతలు ముందుగానే తమ విరాళాలు సమర్పించారనేది అధికారుల వాదన. రూ.2 కోట్లు విరాళాలిచ్చిన దాతలకు ప్రయోజనాలు కూడా 20యేళ్ళకే కుదించారు.

ఇంకా దాతలు శ్రీవారి దర్శనాల కోసం తీసుకువస్తున్న ఒత్తిడితోనే నూతన దాతల నిబంధనల్లో మార్పుచేసి సౌకర్యాలు కుదించారనే విమర్శలు వెల్లువెత్తు తున్నాయి. ఓ వైపు పలు పథకాలకు, ట్రస్ట్‌లకు విరాళాలివ్వాలని టిటిడి విజ్ఞప్తి చేస్తుండగా మరోవైపు ఇలా సౌకర్యాలు కుదించడంతో మరీ భక్తులైన దాతల నుండి ఏ మేరకు స్పందన ఉంటుందనేది చూడాల్సిందేనని టిటిడి ఉద్యోగ వర్గాల సమాచారం. టిటిడి అధికారులు మాత్రం సామాన్యభక్తుల దర్శనాల కోసమే దాతల ప్రయోజనాల్లో కుదింపు చేశామనేది వివరణ.

# ఆపదమొక్కులవాడికి రేపు ఆణివార ఆస్థానం



**తిరుమల, జులై 15 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం (రేపు) సాలకట్ల ఆణివార ఆస్థానం పర్వదినం జరుగనుంది. ఉదయం 7గంటలకు బంగారు వాకిలి ముందు గల ఘంటా మండపంలో సర్వభూపాల వాహనంలో ఉభయ దేవేరులతో మలయప్పస్వామి గరుత్మంతునికి అభిముఖంగా కొలువుకు వేంచేపు చేస్తారు. మరో పీఠంపై స్వామివారి సర్వసైన్యాధ్యక్షుడైన విష్వక్సేనులవారు దక్షిణాభిముఖంగా వేంచేపు చేస్తారు. ఈ ఉత్సవమూర్తులతో పాటు ఆనందనిలయంలోని మూలవిరాట్టుకు ప్రత్యేకపూజలు, ప్రసాదాలు నివేదిస్తారు. తిరుమల పెద్దజీయ్యర్ స్వామి పెద్ద వెండితట్టలో ఆరు పెద్ద పట్టువస్త్రాలను తలపై పెట్టుకుని మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా విచ్చేస్తారు. వీటిలో నాలుగు పట్టువస్త్రాలను మూలమూర్తికి అలంకరిస్తారు. మిగిలిన రెండు వస్త్రాలలో ఒకటి మలయప్పస్వామికి, మరొకటి విశ్వక్సేనులకి అలంకరిస్తారు. శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకుడు తలకు శ్రీవారిపాదవస్త్రంతో వరిపట్టం కట్టుకుని స్వామివారి ద్వారా బియ్యపు దక్షిణ స్వీకరించి నిత్యైశ్వరోభం అని స్వామిని ఆశీర్వదిస్తారు. ఆ తరువాత అర్చకులు పెద్దజీయర్, చిన్నజీయర్ స్వామికి, టిటిడి ఇఒ చేతులకు లచ్చన తాళపు చెవిగుత్తిని వరుస క్రమంలో కుడిచేతికి తగిలిస్తారు. హారతి, చందనం, తాంబూలం, తీర్థం, శఠారి మర్యాదలు చేసి తాళపు గుత్తిని స్వామివారి పాదాలచెంత ఉంచుతారు.

**సాయంత్రం పుష్ప పల్లకీ:** ఆణివార ఆస్థానం సందర్భంగా శుక్రవారం సాయంత్రం 6 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామి అత్యంత శోభాయమానంగా అలంకరించిన పుష్పపల్లకీపై ఆలయ మాడవీధుల్లో విహరిస్తూ భక్తులకు కనువిందు చేస్తారు. ఆణివార ఆస్థానం కారణంగా జులై 17న కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను టిటిడి రద్దు చేసింది.

# విద్య, ఆరోగ్య రంగాలకు అత్యున్నత ప్రాధాన్యం

● ప్రతిభతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలి: టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు



**తిరుమల, జులై 15 ప్రభాతవార్త ప్రతినిధి:** ధార్మిక సంస్థ టిటిడిలో విద్య, ఆరోగ్య రంగాల అభివృద్ధికి అత్యున్నత ప్రాధాన్యతనిస్తూ విద్యార్థుల సమగ్ర వికాసానికి అన్ని విధాలా కృషి చేస్తున్నామని టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు టిటిడిలో విద్య, ఆరోగ్య రంగాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించామని చెప్పారు. టిటిడి ఆధ్వర్యంలోని 33 విద్యాసంస్థల్లో సుమారు 20 వేల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నా రని, వారికి నాణ్యమైన విద్యతో పాటు అత్యా ధునిక మౌలిక వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణ, విలువలు, కృషిని అలవర్చుకుని ఉన్నత శిఖరాలను అధి రోహించి సమాజానికి ఆదర్శంగా నిలవాలని పిలుపు నిచ్చారు. తిరుపతి మహతి కళాక్షేత్రంలో బుధవారం టిటిడి విద్యాసంస్థల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు "ప్రతిభా పురస్కారం-2026" కార్యక్రమాన్ని నిర్వహించి 147 మంది ప్రతిభావంతులను సన్మానించారు. ఇఒ ముద్దాడ రవిచంద్ర మాట్లాడుతూ విద్యే జీవితాన్ని మార్చే శాశ్వత సంపద అని, దానిని ఎవరూ హరించలేరని పేర్కొన్నారు. గ్రామీణ, రైతు కుటుంబాల నుంచి వచ్చిన విద్యార్థులు టిటిడి కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా టిటిడి విద్యాసంస్థలను తీర్చిదిద్దేందుకు అవసరమైన అధ్యాపక సిబ్బంది, మౌలిక సదుపాయాలు, పోషకాహార భోజనం, నాణ్యమైన బోధనను అందిస్తున్నామని తెలిపారు. జెఇఒ డాక్టర్ ఎ.శరత్ మాట్లాడుతూ టిటిడి 150 ఏళ్ల చరిత్రలో తొలిసారిగా "ప్రతిభా పురస్కారాల్ని అందజేయడం చారిత్రాత్మక ఘట్టమన్నారు. రూ.162 కోట్లతో విద్యాసంస్థలను ఆధునీకీకరిస్తూ డిజిటల్ క్లాస్‌రూములు, కంప్యూటర్ ల్యాబ్‌లు, సిసిటివి వ్యవస్థలు, ఆధునిక మౌలిక వసతులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. యోగా, సంగీతం, నృత్యం, నైతిక విలువల బోధనకు ప్రాధాన్యం ఇస్తూ దేశంలోని ప్రముఖ విద్యాసంస్థల సహకారంతో విద్యాసంస్థలను అత్యున్నత ప్రమాణాలతో అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు.

టిటిడి బోర్డు సభ్యురాలు పనబాక లక్ష్మి, బోర్డు సభ్యుడు జి. భానుప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ 250 అదనపు సీట్లు, డే స్కాలర్లకు మధ్యాహ్న భోజన పథకం, కొత్త విద్యా భవనాల నిర్మాణం ద్వారా మరింత మందికి నాణ్యమైన విద్య అందిస్తున్నామని తెలిపారు.

ఈ సందర్భంగా ఎస్వీ జూనియర్ కళాశాల, పద్మావతి మహిళా జూనియర్ కళాశాలకు చెందిన 76మంది ఇంటర్మీడియట్ విద్యార్థులతో పాటు, తిరుపతి, తిరుమలలోని వివిధ టిటిడి పాఠశాలలకు చెందిన 71మంది విద్యార్థులను సన్మానించారు. పద్మావతి మహిళ జూనియర్ కళాశాలకు చెందిన ప్రణవి, ఉత్పల, నేహశ్రీ రాష్ట్ర స్థాయిలో 99శాతం మార్కులు సాధించినందుకు చైర్మన్, ఇఒ ప్రత్యేకంగా అభినందించారు. ప్రతిభ కనబరిచిన 147 మంది విద్యార్థులకు ఐదు గ్రాముల వెండి డాలర్, మెమెంటో, శాలువా, ప్రశంసాపత్రం అందజేశారు. అనంతరం విద్యార్థులు తమ గురువులను గౌరవిస్తూ, క్రమశిక్షణతో కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో బోర్డు సభ్యుడు ఎన్. సదాశివరావు, సభ్యురాలు జానకి, టిటిడి డిఇఒ ఫణికుమార్ నాయుడు, సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవి, సంక్షేమ విభాగం డిప్యూటీ ఇఒ ఆనందరాజు, విద్యాసంస్థల ప్రిన్సిపాళ్ళు, ప్రధానోపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## డిజిటల్ సేవలో శివయ్య దర్శనం సులభతరం

కియోస్క్ యంత్రాలు ప్రారంభించిన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



**శ్రీకాళహస్తి, జులై 15 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో భక్తులకు అందించే సేవలలో పారదర్శకత కోసం ప్రభుత్వం అన్నిసేవలను డిజిటలైజేషన్ చేసిందని శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆలయంలోని నాల్గవ గేటు వద్ద భక్తుల సౌకర్యార్థం కియోస్క్ యంత్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని దేవాలయాల్లో ఆన్‌లైన్ సేవలను అమలు చేసేందుకు పైలట్ ప్రాజెక్టుగా శ్రీకాళహస్తీశ్వర ఆలయాన్ని ఎంపిక చేసారన్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఎన్నో సేవలున్నాయని వాటిని ఆన్‌లైన్ చేయటం ద్వారా భక్తులకు ఇబ్బంది ఉండదన్నారు. ఏ పథకమైనా ఆదిలో కొన్ని ఒడుదుడుకులు ఎదుర్కొక తప్పదన్నారు. భక్తులకు సులభతర దర్శనం కోసం ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఆన్‌లైన్ సేవలు అమలు చేస్తుందన్నారు. ఇందుకు భక్తులు సహకరించాలన్నారు.

డిజిటల్ పద్ధతిలో నేరుగా టోకెన్లు దర్శన టిక్కెట్లు బుక్ చేసుకునే సదుపాయం కల్పించటమే ధర్మకర్తల మండలి లక్ష్యమని ధర్మకర్తల మండలి చైర్మన్ కొట్టె సాయిప్రసాద్ అన్నారు. ఈ కార్యక్రమాల్లో ధర్మకర్తల మండలి సభ్యులు వాకచర్ల గుర్రప్పశెట్టి, గోపీనాథ్, ఇఒ బికె వెంకటేశులు పాల్గొన్నారు.

## ఎస్ఐ నిర్లక్ష్యంతోనే యువకుడు మృతి

• ఏడుకొండలు కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాడుతాం: మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి



**గూడూరు (నెల్లూరు), జులై 15 ప్రభాతవార్త:** గూడూరు ప్రభుత్వ ఏరియా వైద్యశాల వద్ద హై టెన్షన్ వాతావరణం చోటుచేసుకుంది. మనుబోలు మండలం చెరుకుముడిలో బొల్లి ఏడుకొండలు అనే వ్యక్తి అనుమానా స్పదంగా మృతి చెందాడు. గత మూడు రోజుల క్రితం బంగారం దొంగతనం కేసులో మృతుడిని మనుబోలు పోలీసులు అరెస్ట్ చేశారు. ఏడుకొండలుని పోలీసులే కొట్టి హత్య చేశారని మృతిని బంధువులు ఆరోపిస్తున్నారు. గూడూరు పట్టణంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో ఉన్న ఏడుకొండలు మృతదేహాన్ని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి పరిశీలించారు. వైసిపి నాయకులు కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. మృతదేహాన్ని చూసేందుకు కాకాణి గోవర్ధన్ రెడ్డిని అనుమతించగా, మిగిలిన వైసిపి శ్రేణులను అనుమతించకపోవడంతో పోలీసులకు, వైసీపీ శ్రేణులకు మధ్య ఉద్రిక్తత వాతావరణం చోటుచేసుకుంది. అనంతరం మాజీ మంత్రి గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో దళితులు అణగారిన వర్గాలపై ప్రభుత్వంలో ఉన్న పెద్దలు కక్షసాధింపు చర్యలు చేస్తున్నారన్నారు. ఏడుకొండలుని పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించి థర్డ్ డిగ్రీ ఉపయోగించారని, పోలీసుల ఆధ్వర్యంలో చనిపోయాడు కాబట్టి అతని మృతిని లాకప్ డెత్‌గా పరిగణించాల్సి ందేనన్నారు. ఏడుకొండలుని పోలీసులు మూడు రోజులపాటు స్టేషన్‌లో ఉంచి తీవ్రంగా కొట్టారని.. పోలీసులు ఉన్నతాధికారుల సహకారంతో హత్యను ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఎస్ఐ హనీఫ్ పై గతంలో పొదలకూరు పోలీస్ స్టేషన్‌లో పలు ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. పోలీస్ స్టేషన్‌లో మృతుడిని విచారిస్తున్న సమయంలో సిసి ఫుటేజ్ రికార్డులను పరిశీలించాలని డిమాండ్ చేశారు. ఏడుకొండలు కుటుంబానికి న్యాయం జరిగే వరకు వదిలిపెట్టే పరిస్థితి లేదని స్పష్టం చేశారు. వీరితోపాటు పలు ప్రజా సంఘాల నాయకులు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నారపరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు మృతుని కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించాలని బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ మేరీగా మురళి, తిరుపతి ఎంపి గురుమూర్తి, సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, నాయకులు ఎల్లసిరి గోపాల్ రెడ్డి, మీరారెడ్డి, జడ్పిటిసి యామిని, గూడూరు ఎంపీపీ గురవయ్య, తదితరులు పాల్గొన్నారు.

### మృతదేహంతో వైసిపి శ్రేణుల ధర్నా

**మనుబోలు (నెల్లూరు), జులై 15, ప్రభాతవార్త:** చోరి కేసులో నిందితుడు బొల్లి ఏడుకొండలును మనుబోలు పోలీసులు కొట్టి చంపారు అని ఆరోపిస్తు నిందితుడి మృతదేహాన్ని పంచనామా అనంతరం కాకాణి గోవర్ధన్‌రెడ్డి, పార్లమెంట్ సభ్యులు గురుమూర్తి ఆధ్వర్యంలో వైసిపి శ్రేణులు మనుబోలు పోలీస్ స్టేషన్ సమీపంలోని జాతీయ రహదారిపై ఉంచి ఆందోళనకు దిగారు. ఈ సంద్భంగా కాకాణి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలి, ప్రభుత్వం తరపున బాధిత కుటుంబానికి కోటి రూపాయాలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి, ఆ కుటుంబ సభ్యులలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వారి డిమాండ్లు నెరవేరే వరకు బాధిత కుటుంబానికి వైసిపి అండగా ఉంటుందని వారు భరోసా ఇచ్చారు. 15 రోజుల్లోగా సమగ్ర విచారణ జరిపి నిందితులపై తగుచర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా డిఎస్‌పి శ్రీనివాసరావు తెలియజేయడంతో ఆందోళన విరమించారు.

## జగమర్ల అడవిలో ఏనుగు హల్‌చల్



**పలమనేరు, జులై 15 ప్రభాతవార్త:** చిత్తూరు జిల్లా పలమనేరు మండలం జగమర్ల అటవీ ప్రాంతంలో ఒంటరి ఏనుగు హల్‌చల్ చేసింది. దీంతో అటవీ అధికారులు స్పందించి కుంకీఏనుగుతో గాలింపు చర్యలు చేపట్టి ఒంటరి ఏనుగును పట్టుకున్నారు. మూడు నెలలుగా ఒంటరి ఏనుగు నేషనల్ హైవే పక్కనే తిరుగుతూ పాదచారులను, వాహన దారులను భయభ్రాంతులకు గురిచేస్తోంది. ఈ నెల 13న తెల్లవారు జామున 3:30 గంటల సమయంలో నేషనల్ హైవే పక్కనే నిలిచి వుండగా వాహన దారులు గుర్తించి అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. దీంతో అప్రమత్తమైన అధికారులు అపరేషన్ కుంకీ ప్రారంభించారు. పెంగరగుంట అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన ఏనుగుల శాంచురీ నుండి శిక్షణ పొందిన కుంకీ ఏనుగును తీసుకు వచ్చి గాలింపు చర్యలు చేపట్టారు. బుధవారం ఉదయం నుండి ఆపరేషన్ కుంకీ పేరుతో గాలింపు చర్యలు చేపట్టిన అధికారులకు రాత్రి 7గంటల సమయంలో పట్టుబడింది. గాలింపు చర్యల్లో భాగంగా కుంకీ ఏనుగు అరుపులు విన్న ఒంటరి ఏనుగు చివరకు జగమర్ల అటవీ ప్రాంతంలో పట్టుబడింది. ఈ ఏనుగును టెంపో వాహనంలో పెంగరగుంట వద్ద ఏనుగుల శాంచురీకి తరలించారు.

## భర్త దారుణ హత్య.. భార్య, చిన్నారి అదృశ్యం

**గుడుపల్లె, జులై 15 ప్రభాతవార్త:** గుడికి భార్య, చిన్నారిపాపతో కలసి వెళ్లిన ఓ భర్త దారుణహత్యకు గురికాగా భార్య, చిన్నారి అదృశ్యమైన సంఘటన చిత్తూరు జిల్లా గుడుపల్లె మండలం మల్లప్పకొండ ప్రాంతంలో చోటు చేసుకుంది. ఈసంఘటనకు సంబంధించి డిఎస్పీ పార్థసారథి తెలిపిన మేరకు వివరాలిలా వున్నాయి. శాంతిపురం మండలం బోయనపల్లికి చెందిన హాసినికి తమిళనాడు రాష్ట్రం దేవదాసనపల్లికి చెందిన రమేష్‌తో వివాహం జరిగిందన్నారు. వీరికి ఏడాదిన్నర వయసుగల చిన్నారి ఉంది. కాగా మంగళవారం రమేష్ తన భార్య, చిన్నారితో కలసి మల్లప్పకొ ండకు టువీలర్‌లో వచ్చారన్నారు. కాగా బుధవారం ఉదయం రాళ్లబూదుగూరు పోలీస్‌స్టేషన్‌లో వీరు ముగ్గురు అదృశ్యమైనట్లు కేసు నమోదైందన్నారు. ఈ నేపథ్యంలో గాలించగా మల్లప్పకొండ అటవీ ప్రాంతంలో రమేష్ హత్యకు గురైన విషయం గుర్తించినట్లు చెప్పారు. రమేష్ భార్య, చిన్నారి అదృశ్యమైనారన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## రెండు బైక్‌లు ఢీ: ఇద్దరు మృతి

**పుల్లంపేట, జులై 15 ప్రభాతవార్త:** తిరుపతి జిల్లా పుల్లంపేట మండల పరిధిలోని ఉత్తరంవారి పల్లె ఆంజనేయ స్వామి విగ్రహం దగ్గర మంగళవారం అర్ధరాత్రి రెండు బైకులు ఢీకొని ఇద్దరు మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. కడప-చెన్నై జాతీయ రహదారిపై ఎదురెదురుగా వస్తున్న స్కూటీని హీరో హోండా ప్యాషన్ బైక్ ఢీకొంది. ఈ ప్రమాదంలో నలుగురు గాయాలపాలయ్యారు. వీరిని వెంటనే రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో రాజంపేట మండలం గాలివారిపల్లికు చెందిన భార్యాభర్తలు సోంబత్తిన నారాయణ(48), లక్ష్మీదేవి(42)లు చికిత్స పొందుతూ మృతి చెందారు. ఇరువురు స్వగ్రామమైన గాలివారిపల్లి నుంచి ఓబులవారిపల్లె మండలం పెరుమాళ్ళపల్లిలో వ్యవసాయం చేసుకుంటూ ఉన్నారు. ఈ క్రమంలో రోజు మాదిరిగానే పొలం పనులు ముగించుకొని తిరిగి రాత్రి సమయంలో బయలుదేరారు. పుల్లంపేట సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న రాజంపేట మండలం మందపల్లికి చెందిన గోపాల్, ప్రసాదులు వస్తున్న మోటార్ బైక్‌ను బలంగా ఢీకొనడంతో భార్యాభర్తలు ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ భార్యాభర్తలు బుధవారం మృతి చెందారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

• ప్రకాశం జిల్లా డిఆర్‌సి సమావేశంలో మంత్రులు ఆనం, గొట్టిపాటి, డోలా • హాజరైన శాసనసభ్యులు, కార్పొరేషన్ చైర్మన్లు, ప్రజా ప్రతినిధులు, అధికారులు

**ఒంగోలు (కలెక్టరేట్), జులై 15 ప్రభాతవార్త:** ఒంగోలులోని ప్రకాశం భవనం పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో ప్రకాశం జిల్లా సమీక్షా మండలి (డీఆర్‌సీ) సమావేశం జిల్లా ఇన్‌చార్జి దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా బాలవీరాంజనేయ స్వామి, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, ప్రకాశం జిల్లా కలెక్టర్ ఏ. రాజాబాబు, మార్కాపురం జిల్లా కలెక్టర్ విజయ సునీత, జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు, జాయింట్ కలెక్టర్లు కల్పన కుమారి, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్ రావు, ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, బీఎన్ విజయకుమార్, కందుల నారాయణరెడ్డి, ముత్తుముల అశోక్‌రెడ్డి, దర్శి టీడీపీ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి, ఏపీ మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, ఏపీ టూరిజం బోర్డు చైర్మన్ నూకసాని బాలాజీ, ఒయూడీఏ చైర్మన్ షేక్ రియాజ్, పీడీసీసీ బ్యాంక్ చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య, జడ్పీ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, రాష్ట్ర కల్చరల్ చైర్‌పర్సన్ పొడపాటి తేజస్వి, గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుచిత్ర వీరయ్యతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు. సమావేశంలో జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలు, ప్రజా సమస్యల పరిష్కారం, మౌలిక వసతుల కల్పన, తాగునీటి సరఫరా, సాగునీరు, రహదారులు, విద్య, వైద్యం, వ్యవసాయం తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఇంచార్జ్ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి సూచనలు చేస్తూ ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి పారదర్శకంగా అందేలా అధికారులు కృషి చేయాలని, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని




ప్రజాప్రతినిధులు సూచించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించి ప్రభుత్వంపై విశ్వాసం మరింత పెరిగేలా పనిచేయాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ముందస్తు చర్యలు చేపట్టి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత, జవాబుదారీతనం పాటిస్తూ ప్రతి శాఖ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఈ సందర్భంగా అటవీ ప్రాంత గ్రామాల సమస్యలు, తాగునీటి సరఫరా, వెలిగొండ ప్రాజెక్టు పురోగతి, మత్స్యశాఖ అంశాలపై కూడా విస్తృతంగా చర్చించారు. టైగర్ రిజర్వ్ పరిధిలోని గ్రామాల ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించే అంశంపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, అటవీ చట్టాల కారణంగా వెదురు సాగు సాధ్యం కాని ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న రవాణా, బిల్లుల చెల్లింపులు, ఇతర సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు మంత్రి ఆనం ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని, ముఖ్యంగా మార్కాపురం జిల్లాలో భూగర్భ జలమట్టం తగ్గుతున్న ప్రాంతాల్లో ప్రాజెక్టులు, కాలువల ద్వారా అందుబాటులో ఉన్న నీటిని రిజర్వాయర్లలో నిల్వ చేసే చర్యలు చేపట్టాలని సూచించారు. ఎక్కడ తాగునీటి సమస్య వచ్చే అవకాశం ఉందో ముందుగానే గుర్తించి అవసరమైన నిధులు కేటాయించి పనులు పూర్తి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

వెలిగొండ ప్రాజెక్టు పనులపై సమీక్ష నిర్వహిస్తూ, గతంలో ప్రాజెక్టు ప్రారంభమైనప్పటికీ రైతులకు నీరు అందలేదని గుర్తు చేసిన మంత్రి, ప్రస్తుతం ప్రభుత్వం సుమారు రూ.2,900 కోట్లతో నిర్మాణ పనులు, మరో రూ.900 కోట్లతో భూసేకరణ చేపట్టిందని తెలిపారు. ముఖ్య మంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు సెప్టెంబర్ లేదా అక్టోబర్ నాటికి వెలిగొండ ప్రాజెక్టు ద్వారా రైతులకు సాగునీరు విడుదల చేసే లక్ష్యంతో పనులు వేగంగా కొనసాగుతున్నాయని మంత్రి ఆనం వెల్లడించారు. అదేవిధంగా జిల్లా అభివృద్ధికి సంబంధించిన ప్రతి పనిని నిర్దేశిత గడువులో పూర్తి చేసేలా అధికారులు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగాలని, ప్రజాప్రతినిధులు-అధికారులు సమన్వయంతో పనిచేస్తే ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు ప్రజలకు మరింత వేగంగా చేరుతాయని పేర్కొన్నారు. జిల్లాను అన్ని రంగాల్లో ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం పూర్తిస్థాయిలో కట్టుబడి ఉందని సమావేశంలో స్పష్టం చేశారు. జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనుల నాణ్యతపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని, ప్రభుత్వ నిధులు సద్వినియోగం అయ్యేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో ప్రకాశం జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా అమలవుతున్నాయని తెలిపారు. ప్రజలకు ఉపయోగపడే మౌలిక వసతుల కల్పనకు అవసరమైన సహకారం అందిస్తామని పేర్కొన్నారు.

ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ మాట్లాడుతూ జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేయడంతో పాటు ప్రజా సమస్యలను ప్రాధాన్యత ఆధారంగా పరిష్కరించాలని కోరారు. ఇతర ఎమ్మెల్యేలు కూడా తమ తమ నియోజకవర్గాల్లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు, సాగునీరు, తాగునీరు, రహదారులు, విద్య, వైద్య రంగాలకు సంబంధించిన సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు.

ప్రజాప్రతినిధులు చేసిన సూచనలను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి అధికారులను ఆదేశించారు. సమావేశంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో సమన్వయంతో పనిచేయాలని నిర్ణయించారు.



# రైతుల అంగీకారంతోనే ఆక్వా ధరల నిర్ణయం ఉండాలి

మాజీ ముఖ్యమంత్రి జగన్

**భీమవరం, జులై 15 ప్రభాతవార్త:** రాష్ట్రంలో యావత్ రైతాంగం పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక సమస్యల సుడిగుండంలో కూరుకుపోయిన పరిస్థితులు కనిపిస్తున్నాయని మాజీ ముఖ్యమంత్రి, వైయస్సార్సీపి అధినేత జగన్మోహన్ రెడ్డి అన్నారు. ఆక్వా సమస్యల పరిష్కార నిమిత్తం పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో నిర్వహించిన కార్యక్రమంలో జగన్ మాట్లాడుతూ రైతాంగం పండించిన ప్రతి పంటకు గిట్టుబాటు ధర లేదని ఆక్వా రంగం కూడా అత్యంత దయనీయ పరిస్థితుల్లో ఉందని అన్నారు. ఇష్టానుసారంగా సీడ్ ఫీడ్ ధరలను పెంచుకుంటూ పోతున్నారని, రైతుల అంగీకారంతోనే ధరల నిర్ణయం ఉండాలని ధరలు పెంచాలంటే అక్టోబర్ నవంబర్ మాసాల్లో పంటలు సమృద్ధిగా అందుబాటులో ఉన్న తరుణంలో రివ్యూ చేయాలని అన్నారు. ఆక్వా రైతాంగం అంతా తమ గోడును వెళ్ళబోసుకున్నారని తెలిపారు. ఆక్వా రంగంలో రైతులకు అవసరమైన మెటీరియల్ సప్లై చేసే కంపెనీలు అన్నీ చంద్రబాబు సానుభూతి పరులకే ఉండటం రైతాంగం చేసుకున్న కర్మ అని అన్నారు. సీడ్ ఫీడ్ వారే నిర్ణయిస్తారని రైతులు ఎంతో పెట్టుబడి పెట్టి సాగుచేస్తే పంట చేతికి వచ్చేసరికి వారంతా సిండికేట్లుగా ఏర్పడి రేట్లు ధమాలున పడేస్తున్నారని అన్నారు. చంద్రబాబు సానుభూతిపరుల సిండికేట్ ఈ రాష్ట్రాన్ని నడిపిస్తుందని జగన్ విమర్శించారు. చంద్రబాబు వచ్చారంటే చాలు సిండికేట్లకు పండగే పండగ అని, రైతాంగానికి కన్నీళ్లే కన్నీళ్లు అని ఈ పరిస్థితి ఇప్పుడు రాష్ట్రంలో ఉందన్నారు. కంపెనీలు ఇస్తానుసారంగా ధరలూ పెంచుతూ పోతే ముఖ్యమంత్రి ఎందుకు అదుపు చేయలేక పోతున్నారని ప్రశ్నించారు. కిలో ధర 14 నుండి 16 వరకు ఎడాపెడా పెంచి, ఆందోళన వెలిబుచ్చితే కంటితడుపు చర్యగా రెండు రూపాయల తగ్గించారు అన్నారు చంద్రబాబు భాషలో చెప్పాలంటే వంద కొరడా దెబ్బలు కాదు 98 మాత్రమే అని చెప్పినట్టు ఉందన్నారు రైతాంగం ఎలా బ్రతుకుతుందని జగన్ ప్రశ్నించారు. సూపర్ సిక్స్ సెవెన్ హామీలు, మోసాలతో అడుగు ముందుకేసి ప్రజలను మోసం చేశారన్నారు. 2018-19లో ఆక్వా ఎగుమతుల విలువ రూ.13,855 కోట్లు ఉంటే వైఎస్ఆర్సీపి ప్రభుత్వ హయాంలో రూ.20వేల కోట్లు ఉందన్నారు. నరసాపురంలో ఫిషరీస్ యూనివర్సిటీ నిలిచిపోయిందన్నారు. మెడికల్ కాలేజీ కూడా ఆగిపోయిన పరిస్థితి ఉందన్నారు మీ అందరి కష్టాలు నాకు తెలుసు అని, అందరికీ ఒకటే హామీఇస్తున్నానని అది "నేను ఉన్నాను" అని మాత్రం చెబుతున్నాను అన్నారు పొగాకు రైతులకు గిట్టుబాటు ధర లేదని ఆర్‌బికే లు నిర్వీర్యమయ్యాయని, సబ్సిడీలు లేవని, వైఎస్ఆర్సీపి అందరికీ తోడుగా ఉంటుందని చెబుతున్నాను అన్నారు. అప్పటివరకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చే ప్రయత్నాలు కొనసాగుతాయని రైతాంగాన్ని చేయి పట్టి నడిపిస్తూ తోడుగా ఉంటామని ఆక్వా రైతులకు వైస్ జగన్ భరోసానిచ్చారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యం

• టిడిపి శ్రేణులకు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి పిలుపు



**కోవూరు, జులై 15 ప్రభాతవార్త:** రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పార్టీ శ్రేణులంతా సమన్వయంతో పనిచేస్తూ ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఇంటికి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. బుధవారం కోవూరులోని కార్యాలయంలో టిడిపి నియోజకవర్గస్థాయి విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఎస్ఐఆర్ కార్యక్రమంలో కోవూరు నియోజకవర్గంలోని పార్టీ శ్రేణులంతా అంకితభావంతో పనిచేశారని, వారిని ప్రత్యేకంగా అభినందిస్తున్నామన్నారు. ఎన్నికల సంఘం మరో 10 రోజులు గడువు ఇచ్చిన నేపథ్యంలో బిఎల్ఎలు సద్వినియోగం చేసుకుని పూర్తి చేయాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు వ్యక్తిగత బేధాభిప్రాయాలు పక్కనపెట్టి పార్టీ విజయమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. గ్రామాల్లో వర్గాలు ఉన్నా ఎన్నికల సమయంలో అందరూ ఏకమై పార్టీ అభివృద్ధిలో విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సమావేశంలో పాల్గొన్న పలు నాయకులు వారి సమస్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు రెడ్డి, ఐదు మండలాల అధ్యక్షులు, సమన్వయకర్తలు పాల్గొన్నారు.

## కాణిపాకం హుండీ ఆదాయం రూ.1.84 కోట్లు



**కాణిపాకం, జులై 15 ప్రభాతవార్త:** కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానానికి హుండీ లెక్కింపు ద్వారా రూ.1.84 కోట్లు ఆదాయంగా వచ్చింది. బుధవారం స్థానిక ఆస్థాన మండపంలో ఆలయ చైర్మన్ వి.మణినాయుడు, ఇఓ కె.పెంచల కిషోర్‌ల ఆధ్వర్యంలో ఆలయ హుండీలను లెక్కించారు. 22 రోజులకు హుండీల ద్వారా రూ1,83,98,379లు ఆదాయంగా లభించింది. అలాగే 49 గ్రాముల బంగారు, 640 గ్రాముల వెండి ఆదాయంగా వచ్చింది. అలాగే గోసంరక్షణ హుండీ ద్వారా 16,165 రూపాయలు ఆదాయంగా వచ్చింది. నిత్యాన్నదాన హుండీ ద్వారా రూ2,20,830లు ఆదాయంగా లభించింది. దీనితో పాటు 2373 అమెరికా డాలర్లు, 625 యూఏఈ దినార్స్,12 సింగపూర్ డాలర్లు 3 మలేషియా రింగిట్స్, 60 సౌదీ రియాల్స్, ఐదు ఆస్ట్రేలియా డాలర్లు, 65 కెనడా డాలర్లు ఆదాయంగా వచ్చినట్లు ఆలయ ఈఓ పెంచల కిషోర్ తెలిపారు. ఈ హుండీ లెక్కింపు కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ సాగర్‌బాబు, ఏఈఓలు ఎస్వీ,కృష్ణారెడ్డి, హరిమాధవరెడ్డి, ధనుంజయ, ప్రసాద్, సీఎఫ్ఓ నాగేశ్వరరావు, సూపరెండెంట్‌లు కోదండపాణి, శ్రీధర్‌బాబు, కాణిపాకం యూనియన్ బ్యాంకు, ఆలయ సిబ్బంది, సేవకులు పాల్గొన్నారు.

# అమరావతిలో అభివృద్ధి పేరుతో దోపిడీ

• రాజధానిని ఫ్రీ జోన్‌గా తక్షణమే ప్రకటించాలి • వర్షాభావంతో ఇబ్బందుల్లో ఖరీఫ్ రైతులు • ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టి ఆదుకోవాలి • సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గం సభ్యులు జగదీష్

**అనంతపురం, జులై 15 ప్రభాతవార్త బ్యూరో:** రాష్ట్ర రాజధాని అమరావతిలో అభివృద్ధి పేరుతో చేస్తున్న ప్రతి పని లోనూ భారీ స్థాయిలో అవినీతి, అక్రమాలు జరుగుతున్నాయని సిపిఐ రాష్ట్ర కార్యవర్గం సభ్యులు జగదీష్ ఆరోపించారు. బుధవారం అనంతపురంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అమరావతిలో నిబంధనలకు విరుద్ధంగా పనులు చేపడుతున్నారన్నారు. తాము అమరావతి అభివృద్ధికి పూర్తిగా సహకరిస్తామని అన్నారు. కానీ పనుల పేరుతో ఇష్టానుసారంగా కాంట్రాక్టర్లకు, బిల్డర్లకు వేల కోట్ల రూపాయల ప్రజా సొమ్మును కట్టపెడుతున్నారని, ఇది సరికాదని హితవు పలికారు. ఒక చదరపు అడుగు నిర్మాణానికి అయ్యే ఖర్చు సగటున రూ.5 వేలు ఉంటుందని, కానీ టిడిపి ప్రభుత్వం ఏకంగా 16 వేల నుంచి 20 వేల వరకు ఇస్తుండడం ఏమిటని ప్రశ్నించారు. దీనిపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. తెలంగాణాలో సచివాలయం ఏర్పాటుకు, ఢిల్లీలో నూతన పార్లమెంటు భవన నిర్మాణానికి కేవలం చదరపు అడుగుకు కేవలం రూ.6 వేలు చెల్లించారని గుర్తుచేశారు. కానీ అమరావతిలో ఏకంగా రూ.20 వేల వరకు అడుగునకు చెల్లించడం వెనుక అవినీతి, అక్రమాలు దాగున్నాయని అన్నారు. గతంలో వైసిపి ప్రభుత్వం రుషికొండలో ప్యాలెస్ నిర్మాణాన్ని వ్యతిరేకించామని గుర్తు చేశారు. ఇప్పుడు టిడిపి ప్రభుత్వం అమరావతిలో కూడా అలాంటి తప్పిదమే చేస్తోందని హెచ్చరించారు. ఇక రాజధాని



అమరావతి కేవలం కొన్ని జిల్లాలకే పరిమితం కాదని, రాష్ట్రంలోనే అన్ని జిల్లాలకు ఉద్యోగ ఉపాధి అవకాశాల్లో భాగస్వామ్యం కల్పించాలని, అందువల్ల రాజధాని అమరావతిని ఫ్రీ జోన్‌గా తక్షణమే ప్రకటించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థి యువజనలు కూడా ఆందోళన చేయవలసి వస్తుందని హెచ్చరించారు.

వర్షాభావంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సకాలంలో వర్షాలు కురవక భూములు బీటులు వాలాయన్నారు. తక్షణమే రైతులకు ప్రత్యామ్నాయ విత్తనాలు సరఫరా చేయాలని, వారి రుణాలను మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి నారాయణస్వామి, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి రాజేష్‌గౌడ్, సిపిఐ నాయకులు లింగమయ్య తదితరులు పాల్గొన్నారు.

# దుర్గమ్మకి వైభవంగా ఆషాఢం సారె

• ఇంద్రకీలాద్రిపై శాస్త్రోక్తంగా ప్రారంభమైన ఆషాఢ సారె ఉత్సవాలు



**ఇంద్రకీలాద్రి, జులై 15 ప్రభాతవార్త:** తమ ఇలవేలుపును ఇంటి ఆడపడుచుగా భావిస్తూ భక్తులు దుర్గమ్మకి ఆషాఢం సారె సమర్పణ ఉత్సవాలు వైభవంగా బుధవారం ప్రారంభమయ్యాయి. తొలిసారెను ఆలయ వైదిక సిబ్బంది తొలి సారె సమర్పణ చేశారు. ఘాట్ రోడ్ ఓం మలుపు నుండి మేళతాళాలు, కోలాటాలు, వేదమంత్రోచ్చారణల నడుమ శోభాయమానంగా సాగిన ఊరేగింపుకు వైదిక బృందానికి ఇఓ వికె శీనా నాయక్ ఘనస్వాగతం పలికారు. మహామండపం 6వ అంతస్తులో అమ్మవారికి తొలి సారె సంభారాల సమర్పణ చేశారు. అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సారె సమర్పించిన వైదిక సిబ్బందికి, వారి కుటుంబ సభ్యులకు ఆలయ మర్యాదలతో వేదఆశీర్వాదాలు అందించి, అమ్మవారి శేషవస్త్రం, ప్రసాద వితరణ గావించారు. ఈ మహత్తర కార్యక్రమంలో దేవస్థాన స్థానాచార్య వి శివ ప్రసాద్ శర్మ, ప్రధాన అర్చకులు ఎల్ దుర్గా ప్రసాద్, కోట ప్రసాద్, ఉప ప్రధాన అర్చకులు శంకర శాండిల్య, కోట రవికుమార్, ఇతర అర్చకులు, వైదిక సిబ్బంది, సంప్రదాయ పాఠశాల విద్యార్థులు, భక్తులు పాల్గొన్నారు.

**వేద పాఠశాల సందర్శించిన ఇఓ:** దేవస్థానం ఈవో వికె శీనానాయక్ దేవస్థానం వేదపాఠశాలను సందర్శించారు. పాఠశాల పరిసరాలు, విద్యార్థులకు అందుతున్న సదుపాయాలు, భోదన తీరు పరిశీలన చేశారు. వేదపాఠశాల ప్రాంగణంలో దేవతా వృక్షాలు ఎదగటానికి గానూ బిల్వం, మారేడు, నేరేడు వంటి మొక్కలు నాటారు. ఈవో ఆదేశాల ప్రకారం విద్యార్థుల ఆరోగ్యస్థితి తెలుసుకోవడానికి దేవస్థానం వైద్యబృందం వేదపాఠశాల సందర్శించి, విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానాచార్య శివ ప్రసాద్ శర్మ, ముఖ్య అర్చకులు శ్రీనివాస శాస్త్రి, ఎఈ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.


**దుర్గమ్మకి వెండి గిన్నె కానుక:** శ్రీ అమ్మవారి తీర్థము



భక్తులకు వితరణ చేయడానికి 374 గ్రాముల వెండి గిన్నెను బుధవారం హైదరాబాద్‌కు చెందిన సత్యనారాయణ, భారతి దంపతులు తమ కుమార్డు జి వెంకట అజయ్ కుమార్ పేరిట కానుకగా అందించారు. వారికి దుర్గమ్మవారి దర్శన ఏర్పాట్లు చేసిన అధికారులు అనంతరం వారికి దుర్గమ్మ చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం, అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

**నిత్యాన్నదాన పథకానికి విరాళం:** దుర్గమ్మ ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన వై శ్రీనివాసరెడ్డి తమ కుటుంబీకులతో కలిసి రు.1,01,116ల విరాళాన్ని బుధవారం అందించారు. వారికి దుర్గమ్మవారి దర్శన ఏర్పాట్లు చేసిన అధికారులు అనంతరం వారికి దుర్గమ్మవారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం, అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

**మహిళల రద్దీ:** ఆషాఢ సారె సమర్పణకు ఇరు తెలుగు రాష్ట్రాల నుండి భక్తులరా ఈరోజు సాయంత్రం 4 గంటల వరకు 23 సారె బృందాలు 9623 మంది భక్తులు వచ్చారు. ఉదయం 6.30 గంటలకు శ్రీ కనకదుర్గ అమ్మవారి ప్రధాన ఆలయం నుండి ఉత్సవ మూర్తిని మంగళ వాయిద్యాలు, వేద మంత్రాలు నడుమ



అర్చక బృందం మహా మండపం 6వ అంతస్తుకు తీసుకు వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించి వేదిక పై ప్రతిష్టించారు. అనూహ్యంగా పెరిగిన సారె భక్తుల రద్దీతో దర్శనం భవానీ అనుగ్రహ దర్శన్ క్యూ లైన్ (100/దర్శనం లైన్ ) మొత్తం సారె భక్తులకు ఉచిత దర్శనంగా ఇఓ కేటాయించారు.

ఈ సందర్భంగా ఇఓ మాట్లాడుతూ ఆగస్టు 12 వరకు దుర్గమ్మకి ఆషాఢమాస సారె సమర్పించడానికి ఏర్పాట్లు చేశామన్నారు. సారె సమర్పించాలనుకున్న భక్తులు ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకుని ఆ రశీదుతో పాటు సారె తీసుకురావాలన్నారు. మొబైల్ ఫోన్లు, కెమెరాలుతో సారె బృందాలకు ఆలయ ప్రవేశం లేదని, సారె సమర్పణ బృందాలు లగేజ్, పాదరక్షలు, సెల్‌ఫోన్లు కనకదుర్గ నగర్లోనే భద్ర పరచుకుని ఆలయ ప్రాంగణం లోకి ప్రవేశించాలని, ఆలయ ప్రాంగణంలో, మహా మండపం 6వ అంతస్తులో సెల్ ఫోన్స్ కలిగిన భక్తుల వద్ద నుండి ఫోన్స్ స్వాధీనం చేసుకొని సీజ్ చేస్తామన్నారు.

# ఫ్రాన్స్‌కు షాక్ : ఫైనల్లో స్పెయిన్


ఫిఫా ప్రపంచకప్‌లో రెండోసారి ఫైనల్ చేరిన ఆనందంలో స్పెయిన్‌ఆటగాళ్లు

**టెక్సాస్, జులై 15:** సాకర్ వరల్డ్ కప్‌లో యూరోపియన్ ఛాంపియన్ స్పెయిన్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. డల్లాస్‌లో జరిగిన జరిగిన తొలి సెమీఫైనల్లో 2-0గోల్స్ తేడాతోఫ్రాన్స్‌ను ఓడించింది. ఈసారైనా కప్ సాధించాలన్న గత రన్నరప్ ఫ్రాన్స్ ఆశలపై నీళ్లు చల్లింది. ఫుట్‌బాల్ చరిత్రలో రెండోసారి ఫిఫా వరల్డ్ కప్ ఫైనల్‌కు అర్హత సాధించింది. 2010లో మొదటిసారి ఫైనల్ చేరిన స్పెయిన్, అప్పట్లో నెదర్లాండ్స్‌ను ఓడించి విశ్వవిజేతగా నిలిచింది.

**దుర్భేధ్యమైన డిఫెన్స్**

మ్యాచ్ ప్రారంభం లో హాట్ ఫేవరెట్‌గా బరిలోకి దిగి ఫ్రాన్ జట్టు... స్పెయిన్ పటిష్టమైన డిఫెన్స్‌ను ఛేదించలేకపోయింది. కిలియన్ ఎంబాపె, మైఖేల్ ఒలిసే, డెంబెలేలతో కూడిన బలమైన ఫ్రాన్స్ అటాకింగ్ త్రయాన్ని స్పెయిన్ డిఫెండర్లు సమర్థవంతంగా కట్టడిచేశాయి.

**పెనాల్టీ గోల్**

తొలిఅర్ధభాగం 22వ నిమిషంలో స్పెయిన్ యువ సంచలనం లామిన్ యమల్‌ను ఫ్రాన్స్ డిఫెండర్ లూకాస్ దిగ్నే బాక్స్ లోపల ప్రమాదకర రీతిలో కిందపడేయడంతో స్పెయిన్‌కు పెనాల్టీ లభించింది. దీన్ని స్టార్ ఫార్వర్డ్ మికెల్ ఓయార్జబాల్ గోల్‌గా మలిచి స్పెయిన్‌కు 10 ఆధిక్యం లభించింది. ఇక ద్వితీయార్ధం కొద్దిసేపటికే 58వ నిమిషంలో స్పెయిన్ మిడ్‌ఫీల్డర్ డాని ఓల్మో అందించిన అద్భుతమైన పాస్‌ను ఫుల్ బ్యాక్ ఆటగాడు పెడ్రో పోర్రో గోల్‌గా మలిచాడు. స్పెయిన్‌కు రెండో గోల్ అందించాడు.

**విఫలమైన ఫ్రాన్స్ వ్యూహాలు**

మ్యాచ్ మధ్యలో ఫ్రాన్స్ జట్టుకు ఊహించని ఎదురుదెబ్బ తగిలింది. ఆ జట్టు ప్రధాన డిఫెండర్ విలియం సాలిబా గాయంతో మైదానం వీడాడు. ఫ్రాన్స్ జట్టును గట్టెక్కించడానికి హెడ్ కోచ్ డిడియర్ డెషాంప్స్ వ్యూహాత్మక మార్పులు చేశారు. అడ్రియన్ రాబియోట్ స్థానంలో మను కోనేను, బ్రాడ్లీ బార్కోలా స్థానంలో డెసిరె డౌను, అలాగే రాయన్ చెర్కిలను మైదానంలోకి దించినప్పటికీ ఫలితం లేకపోయింది. స్పెయిన్ గోల్‌కీపర్ ఉనై సిమన్ చేసిన అద్భుతమైన సేవ్స్, డిఫెండర్ మార్క్ కుకురెల్లా టాకిల్స్ ఫ్రాన్స్ ఆశలపై నీళ్లు చల్లాయి.

**ఓయార్జబాల్ అరుదైన రికార్డు**

ఓయార్జబాల్ తన ఫామ్‌ను మరోసారి చాటుకున్నాడు. స్పెయిన్ తరఫున గత20 మ్యాచ్‌ల్లో ఇది అతనికి 18వ గోల్. ఈ గోల్‌తో అంతర్జాతీయ ఫుట్‌బాల్‌లో స్పెయిన్ తరఫున 30గోల్స్ మార్కు అందుకున్న ఆరో ఆటగాడిగా రికార్డు సృష్టించాడు.ఈ జాబితాలో డేవిడ్ విల్లా (59), రావుల్ (44), ఫెర్నాండో టోరెస్ (38), అల్వారో మొరాటా (37), డేవిడ్ సిల్వా (35) వంటి దిగ్గజాల సరసన చేరాడు. ఈ విజయంతో స్పెయిన్ జట్టు అంతర్జాతీయ ఫుట్‌బాల్‌లో వరుసగా 37 మ్యాచ్‌లు ఓటమి లేకుండా గెలుస్తూ వస్తోంది. దీంతో ఇటలీ పేరిట ఉన్న చారిత్రాత్మక రికార్డును సమం చేసింది. అలాగే ఫ్రాన్స్‌పై వరుసగా ఇది స్పెయిన్‌కు మూడో విజయం.స్పెయిన్ జట్టు ఈనెల 19న న్యూజెర్సీ స్టేడియంలో జరగబోయే ఫైనల్లో కప్ కోసం ఆడనుంది.

**ఇది మా స్థాయి ఆటకాదు: ఎంబాపె**

సెమీఫైనల్లో ఫ్రాన్స్ ఆటతీరుపై ఆ జట్టు స్టార్ ఆటగాడు క్లియాన్ ఎంబాపె తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాడు. ఇది తమ స్థాయి ఆట కాదని, అనుకున్నట్లుగా ఆడలేకపోయామన్నాడు. వ్యూహాలు, సాంకేతికంగానూ ఘోరంగా విఫలమయ్యామని వాపోయాడు. మిడ్‌ఫీల్డ్‌లో 3 ఆన్ 2వ్యూహంతో బరిలోకి దిగినా. అయితే, ఆటగాళ్ల మధ్య సమన్వయలోపంతో అనుకున్న ఫలితం సాధించలేకపోయినట్లు వెల్లడించాడు. స్టారర్ ఎంబాపె కూడా ఈ మ్యాచ్‌లో గోల్ చేయలేకపోయాడు.

## జపాన్ ఓపెన్‌లో పివి సింధుపైనే ఆశలు

## తొలి రౌండ్‌లోనే లక్ష్య, ఆయుష్, ఉన్నతి ఔట్

**టోక్యో, జూన్ 15:** జపాన్ ఓపెన్‌లో రెండో రోజు భారత్‌కు నిరాశాజనకంగా నిలిచింది. భారత షటర్లు లక్ష్య సేన్, ఆయుష్ శెట్టి, ఉన్నతి హుడా తొలి రౌండ్ ఓటమితో ఇంటిదారి పట్టారు. లక్ష్యసేన్ వరుస గేమ్‌ల్లో ఓడగా, యువ షట్లర్లు ఆయుష్ శెట్టి, ఉన్నతి హుడా పోరాటపటిమను ప్రదర్శించినప్పటికీ చివరికి ఓటమి పాలయ్యారు. ఆసియా ఛాంపియన్‌షిప్స్ ఫైనలిస్ట్ ఆయుష్ మూడు గేమ్ల పోరులో థాయిలాండ్‌కు చెందిన రెండో సీడ్ కున్‌లావుత్ చేతిలో 19-21, 25-23, 15-21తో పరాజయం పొందాడు. ఈ పోరు ఏకంగా 82 నిమిషాలపాటు ఉత్కంఠగా కొనసాగింది. ఇక రెండుసార్లు ఒడిశా ఓపెన్ సూపర్ 100 ఛాంపియన్ ఉన్నతి 21-16, 16-21, 15-21 తేడాతో మరోసారి చైనీస్ తైపీ షట్లర్ హువాంగ్ యుహసున్ చేతిలో ఓడింది.

ఆల్ ఇంగ్లాండ్ ఛాంపియన్‌షిప్స్‌లో రన్నరప్‌గా నిలిచిన లక్ష్యసేన్... స్థానిక ఫేవరెట్ కోకి వతనాబే ముందు నిలవలేకపోయాడు. కేవలం 38 నిమిషాల్లోనే 16-21, 14-21 తేడాతో పరాజయం పొందాడు. రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత పీవీ సింధు, మిక్స్‌డ్ డబుల్స్ జోడీ ధ్రువ్ కపిల, తనిషా క్రాస్టోలే జోడీ రూపంలో ఈ టోర్నీలో భారత్ సవాల్ మిగిలివుంది. రెండో రౌండ్‌లో సింధు ఐదో సీడ్ చైనా క్రీడాకారిణి హాన్ యూతో తలపడనుండగా... ధ్రువ్, తనిషాలు టాప్ సీడ్స్ ఫెంగ్ యాన్ జె, హువాంగ్ డాంగ్ పింగ్‌లతో పోటీపడతారు.











## గోల్డెన్ బూట్ రేసులో మెస్సీ, ఎంబాపె

**టెక్సాస్, జులై 15:** ఫిఫా ప్రపంచకప్‌లో అత్యధిక గోల్స్ చేసే ఆటగాడికి ఇచ్చే గోల్డెన్ బూట్ రేసు ఆసక్తిగా మారింది. అర్జెంటీనాస్టార్ లియోనెల్ మెస్సీ, ఫ్రాన్స్ స్టార్ ఫార్వర్డ్ ఎంబాపె మధ్య పోరు నెలకొంది. సెమీస్‌లో గోల్ చేయడంలో విఫలమైనా... ఎంబాపె మాత్రం గోల్డెన్ బూట్ రేసులో నిలిచాడు. ప్రస్తుతం 8 గోల్స్, 3 అసిస్ట్స్‌తో అగ్రస్థానంలో ఉన్నాడు. అతడి తర్వాత మెస్సీ (8 గోల్స్, 2 అసిస్ట్స్), ఇర్లింగ్ హాలాండ్ (7గోల్స్)ఉన్నారు.నార్వే ఇంటిముఖం పట్టడంతో ఇర్లింగ్ హాలాండ్ ఛాన్స్ కోల్పోయాడు. మెస్సీ... ఇంగ్లాండ్‌తో సెమీఫైనల్ మ్యాచ్‌లో గోల్ సాధిస్తే గోల్డెన్‌బూట్ రేసులో ముందుకొస్తాడు. అర్జెంటీనా సెమీస్ గెలిచినా, ఓడినా మెస్సీకి మరోమ్యాచ్ ఉంటుంది. ఫ్రాన్స్ మూడో స్థానం మ్యాచ్ నేపథ్యంలో.. ఎంబాపె కూడా గోల్డెన్ బూట్ కోసం పోటీలో ఉన్నట్లే.ఇక ఇంగ్లాండ్ సంచలనాలు హ్యారీ కానే, జూడ్ బెల్లింగ్హామ్ చెరో ఆరేసి గోల్స్‌తో తరువాతి స్థానాల్లో ఉన్నారు. అర్జెంటీనాతో పాటు గెలిస్తే ఫైనల్, లేదంటే థర్డ్ ప్లేస్ మ్యాచ్ రూపంలో రెండు మ్యాచ్‌లు ఉన్నాయి. ఇందులో ఈ ఇద్దరూ మెరుగ్గా గోల్స్ సాధిస్తే మెస్సీ, ఎంబాపెను వెనక్కి నెట్టే అవకాశం ఉంది.

## జోరు మీదున్న టీమిండియా కెప్టెన్ గిల్

### వన్డేల్లో నంబర్ వన్ దిశగా



**దుబాయ్, జులై 15:** టీమిండియా వన్డే, టెస్ట్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ జోరు మీదున్నాడు. అన్ని ఫార్మాట్లలో పరుగుల వరద పారిస్తున్నాడు. ఐపీఎల్ ప్లే ఆఫ్‌లో రాజస్థాన్ రాయల్స్‌పై సెంచరీ (104) సాధించిన శుబ్ మన్ గిల్... ఆఫ్ఘనిస్తాన్‌పై ఏకైక టెస్ట్‌లో 126పరుగులతో అదరగొట్టాడు. ఇక రెండు వన్డేల్లోనూ వరుసగా 84 నాటౌట్, 154 రన్స్ సాధించాడు. ఇక ఇంగ్లాండ్‌తో జరిగిన తొలి వన్డేలోనూ 80నాటౌట్‌తో నిలిచి జట్టు విజయంలో కీ రోల్ పోషించాడు. మొత్తంగా బ్యాట్‌కు పనిచెబుతూ శుభ్‌మన్ గిల్ ప్రత్యర్థి బౌలర్ల వెన్నులో వణుకు పుట్టిస్తున్నాడు.

తాజాగా ఐసీసీ విడుదల చేసిన వన్డే ర్యాంకింగ్స్‌లోనూ భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ రేటింగ్ పాయింట్లు పెంచుకుని ప్రపంచ నంబర్ వన్ స్థానానికి మరింత చేరువయ్యాడు. తొలి వన్డేలో 80 పరుగులు చేసిన గిల్‌కు 12 రేటింగ్ పాయింట్లు లభించాయి. ప్రస్తుతం అతను ప్రపంచ వన్డే బ్యాటర్ల ర్యాంకింగ్స్‌లో రెండో స్థానంలో కొనసాగుతున్నాడు.

అగ్రస్థానంలో ఉన్న డారిల్ మిచెల్‌ను (814) అధిగమించేందుకు గిల్‌కు (803) ఇంకా 12 రేటింగ్ పాయింట్లు మాత్రమే అవసరం. మరో మంచి ఇన్నింగ్స్ ఆడితే మిచెల్‌ను వెనక్కినెట్టి నెంబర్ వన్ ర్యాంకు సొంతమవుతుంది. తొలి వన్డేలో విఫలమైనప్పటికీ భారత స్టార్ బ్యాటర్లు విరాట్ కోహ్లి (3వ స్థానం), రోహిత్ శర్మ (4వ స్థానం) తమ స్థానాలను నిలబెట్టుకున్నారు.

అజేయ అర్ధశతకం సాధించిన వాషింగ్టన్ సుందర్ బ్యాటర్ల ర్యాంకింగ్స్‌లో ఏకంగా 18 స్థానాలు ఎగబాకి 73వ స్థానానికి చేరుకున్నాడు. అలాగే తొలి వన్డేలో అద్భుత ఆల్‌రౌండ్ ప్రదర్శన కనబర్చిన అక్షర్ పటేల్ ఆల్‌రౌండర్ల జాబితాలో టాప్-10లోకి ప్రవేశించాడు. జస్ప్రీత్ బుమ్రా బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో 24వ స్థానానికి చేరుకున్నాడు.ఇంగ్లండ్ ఆటగాళ్లకు కూడా మెరుగైన ర్యాంకులు దక్కాయి. ఇంగ్లండ్ తరఫున తొలి వన్డేలో 76 పరుగులు చేసిన జో రూట్ 12వ స్థానానికి చేరుకున్నాడు.

## స్వల్పలాభాలతో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ



**ముంబయి, జులై15:** దేశీయ ఈక్విటీ మార్కెట్లు బుధవారం ప్రారంభంలో బలమైన ర్యాలీ నమోదు చేసినప్పటికీ, చివర్లో పెట్టుబడిదారులు లాభాల స్వీకరణకు మొగ్గుచూపడంతో రోజువారీ గరిష్ఠ స్థాయిల నుంచి లాభాలు తగ్గాయి.ఐబీఎం నిరాశపరిచే భవిష్యత్ మార్గదర్శకాలను ప్రకటించడంతో ఐటీ షేర్లపై అమ్మకాల ఒత్తిడి కనిపించింది. బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 86 డాలర్ల సమీపంలో కొనసాగుతుండటంతో ప్రపంచ ఇంధన సరఫరాపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

బీఎస్ఈ సెన్సెక్స్ 130.49 పాయింట్లు పెరిగి 77,185.43వద్ద ముగిసింది.ఎన్ఎస్ఈ నిఫ్టీ50 సూచీ 26.45పాయింట్లు లాభపడి 24,078.50 వద్ద స్థిరపడింది.గత మూడు వరుస ట్రేడింగ్ సెషన్లలో నిఫ్టీ 1.38 శాతం, సెన్సెక్స్ 1.45 శాతం మేర నష్టపోయాయి. ఎటర్నల్ -2.80శాతం లాభం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్-0.69శాతం పెరిగితే ఐసీఐసీఐ బ్యాంక్-0.24 శాతం లాభం బీఎస్ ఈ మిడ్‌క్యాప్150 సూచీ 0.55 శాతం, స్మాల్‌క్యాప్250 సూచీ 0.69 శాతం చొప్పున పెరిగాయి.మార్కెట్‌లో మొత్తం 2,297 షేర్లు లాభపడగా, 1,974 షేర్లు నష్టపోయాయి. 178 షేర్లు మార్పులేకుండా ముగిశాయి. విదేశీ మారకద్రవ్య మార్కెట్‌లో డాలర్‌తో పోలిస్తే రూపాయి స్వల్పంగా బలహీనపడింది. రూపాయి విలువ గత ముగింపు 96.1600 తో పోలిస్తే 96.3200 వద్ద ట్రేడైంది.

ఎంసీఎక్స్‌లో ఆగస్టు 5, 2026 డెలివరీ గోల్డ్ ఫ్యూచర్స్ 0.64 శాతం తగ్గి రూ.1,41,301 వద్దకు చేరాయి.సెప్టెంబర్ 2026 డెలివరీ బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 89 సెంట్లు (1.05 శాతం) పెరిగి 85.62 డాలర్లకు చేరింది. ఐపీఓలో లిస్టైన కుసుమ్‌గర్‌కు భారీ ప్రీమియంకుసుమ్‌గర్ షేరు బీఎస్ఈలో తొలి ట్రేడింగ్ రోజున ఇష్యూ ధర 419తో పోలిస్తే 44.26 శాతం ప్రీమియంతో రూ.604.45 వద్ద ముగిసింది. ఎల్ అండ్ టీ టెక్నాలజీ సర్వీసెస్ 6.50శాతం ఎగిసింది. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నికర లాభం 29.57 శాతం పెరిగి రూ.5,332.30 కోట్లకు చేరడంతో షేరు 0.96 శాతం లాభపడింది. బిలియన్ బ్రెయిన్స్ గ్యారేజ్ వెంచర్స్, తొలి త్రైమాసికంలో నికర లాభం త్రైమాసిక ప్రాతిపదికన 7.1 శాతం, వార్షిక ప్రాతిపదికన 94.28 శాతం పెరిగి రూ.735 కోట్లకు చేరడంతో షేరు 6.46 శాతం ఎగిసింది.ఫెడ్‌బ్యాంక్ ఫైనాన్షియల్ సర్వీసెస్ 7.52శాతం లాభపడింది.స్టీల్ స్ట్రిప్స్ వీల్స్ - 5.81 శాతం పెరిగింది. ఆదిత్య బిర్లా మనీ 8.82 శాతం, గోవా కార్బన్ 7.59 శాతం, టాటా ఎల్ఎక్సి 4.44 శాతం, డెన్ నెట్‌వర్క్స్ 4.42 శాతం, ఆనంద్ రాఠీ షేర్ అండ్ స్టాక్ బ్రోకర్స్ 4.34 శాతం, బెనారస్ హోటల్స్ 1.05 శాతం నష్టపోయాయి.ఐపిఒల పరంగా ఎస్‌బీఐ ఫండ్స్ మేనేజ్‌మెంట్ ఐపీఓకు మంచి స్పందన లభించింది. బుధవారం సాయంత్రం 4.30 గంటల వరకు 12.45 కోట్ల షేర్ల ఆఫర్‌కు 33.44 కోట్ల షేర్లకు బిడ్లు రావడంతో ఈ ఇష్యూ 2.69 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది. షేరు ధర రూ.545-574గా నిర్ణయించారు. ఆల్పైన్ టెక్స్‌వర్క్స్ ఐపీఓకు బుధవారం సాయంత్రం వరకు 1.20 కోట్ల షేర్ల ఆఫర్‌కు వ్యతిరేకంగా 94.92 లక్షల షేర్లకు బిడ్లు రావడంతో 0.79 రెట్లు సబ్‌స్క్రిప్షన్ నమోదైంది. ఈ ఐపీఓ కూడా ధరలు ఒక్కో షేరుకు రూ.100-105గా నిర్ణయించారు.





## అమల్లోకి భారత్ - బ్రిటన్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం

**న్యూఢిల్లీ, జులై 15:** భారత్‌బ్రిటన్ సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం అమల్లోకి వచ్చింది. ఈ ఒప్పందం ద్వారా ఇరు దేశాల మధ్య వాణిజ్య సంబంధాలు మరింత బలోపేతం కానుండగా, వివిధ రంగాలపై భిన్నమైన ప్రభావం పడనుంది. భారతీయ ఎగుమతులకు బ్రిటన్ మార్కెట్లో భారీ ప్రోత్సాహం లభించగా, బ్రిటన్‌కు చెందిన పలు ఉత్పత్తులపై భారత్ దిగుమతి సుంకాలను తగ్గించింది. భారతదేశం నుంచి బ్రిటన్‌కు ఎగుమతి అయ్యే దాదాపు 99 శాతం ఉత్పత్తులకు సుంక రహిత ప్రవేశం లభించనుంది. మరోవైపు బ్రిటన్ నుంచి భారత్‌కు వచ్చే పలు ఉత్పత్తులపై దిగుమతి సుంకాలను గణనీయంగా తగ్గించారు.

భారత శ్రామిక ఆధారిత రంగాలకు పెద్ద ఊతంఈ ఒప్పందంతో రెడీమేడ్ దుస్తులు, పాదరక్షలు, కార్పెట్లు, ప్రాసెస్డ్ ఫుడ్, ధాన్యాలు, పండ్లు, కూరగాయలు, సుగంధ ద్రవ్యాలు, చేపలు, మాంస ఉత్పత్తులు వంటి శ్రామిక ఆధారిత రంగాలకు భారీ ప్రయోజనం చేకూరనుంది. ఇప్పటివరకు 4 శాతం నుంచి 16 శాతం వరకు ఉన్న బ్రిటన్ దిగుమతి సుంకాలు పూర్తిగా తొలగించబడటంతో ఈ ఉత్పత్తులు ఇకపై సుంకం లేకుండా బ్రిటన్ మార్కెట్లోకి ప్రవేశించనున్నాయి. ఆటోమొబైల్స్, ఆటో విడిభాగాలు, యంత్రాలు, ఎలక్ట్రానిక్స్, ఫ్యాబ్రికేటెడ్ మెటల్ ఉత్పత్తులు, సిరామిక్స్, గాజు, రాయి, సిమెంట్ ఉత్పత్తుల ఎగుమతులకు కూడా మెరుగైన మార్కెట్ అవకాశాలు లభించనున్నాయి. భారత్‌లో తయారయ్యే ఎలక్ట్రిక్, హైబ్రిడ్, హైడ్రోజన్ ఆధారిత ప్రయాణికుల వాహనాలకు బ్రిటన్ ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చింది. నిర్ణయించిన కోటా పరిధిలో ఎగుమతి అయ్యే ఈ వాహనాలు ప్రస్తుతం అమల్లో ఉన్న 10 శాతం సుంకం లేకుండా బ్రిటన్‌లోకి ప్రవేశించనున్నాయి. కొన్ని ఉత్పత్తులకు సుంక రాయితీ వర్తించదుతాజా ఆపిల్స్, వాల్‌నట్స్, వే ప్రొడక్ట్స్, బ్లూవెయిన్ చీజ్, ఎంపిక చేసిన విత్తన రకాలు, బంగారు బార్లు, స్మార్ట్‌ఫోన్లు వంటి సున్నితమైన ఉత్పత్తులను భారత్ సుంక రాయితీల నుంచి మినహాయించింది.

స్కాచ్ విస్కీ, బోర్బన్, రమ్, జిన్, వోడ్కా, బ్రాండీ, టెకిలా, సాకే, సైడర్, మీడ్, లిక్కర్స్ వంటి ప్రీమియం మద్యపాన ఉత్పత్తులపై దిగుమతి సుంకాలు తగ్గింపు ఉంటుంది. స్కాచ్ విస్కీపై ప్రస్తుతం ఉన్న 150 శాతం దిగుమతి సుంకాన్ని దశలవారీగా 40 శాతానికి తగ్గించనున్నారు. ఆటోమొబైల్ రంగంలో నిర్ణీత కోటా మేరకు దిగుమతి అయ్యే వాహనాలపై 100 శాతం సుంకాన్ని 10 శాతానికి తగ్గించనున్నారు. సౌందర్య ఉత్పత్తులపై ప్రస్తుతం ఉన్న 22 శాతం వరకు సుంకాలను ఒప్పందం అమలైన తొలి రోజు నుంచే లేదా గరిష్ఠంగా 10 సంవత్సరాల వ్యవధిలో పూర్తిగా తొలగించనున్నట్లు ఇరు దేశాలు వెల్లడించాయి.

## హెచ్‌డిఎఫ్‌సి లైఫ్ లాభం 611 కోట్లు



**ముంబై, జులై 15:** ప్రైవేట్ జీవిత బీమా సంస్థ హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఇన్సూరెన్స్ లిమిటెడ్ తొలిత్రైమాసికంలో నికరలాభం వార్షిక ప్రాతిపదికన 11.5శాతంపెరిగిరూ.611 కోట్లకు చేరుకుంది.గత ఏడాది ఇదే త్రైమాసికంలో కంపెనీ రూ.548 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. కంపెనీ నెట్ ప్రీమియం ఆదాయం కూడా 15.1 శాతం పెరిగి రూ.14,539 కోట్ల నుంచి రూ.16,728 కోట్లకు చేరుకుంది.ఇది బీమా వ్యాపారంలో స్థిరమైన వృద్ధిని ప్రతిబింబిస్తున్నట్లు కంపెనీ తెలిపింది.పాలసీదారుల కొనసాగింపు పరంగా కూడా కంపెనీ మిశ్రమ ఫలితాలను నమోదు చేసింది. 61 నెలల పర్సిస్టెన్సీ నిష్పత్తి గత ఏడాది 61 శాతం నుంచి 65.5 శాతానికి మెరుగుపడగా, 13 నెలల పర్సిస్టెన్సీ నిష్పత్తి మాత్రం 82.7 శాతం నుంచి 80 శాతానికి తగ్గింది.కంపెనీ సాల్వెన్సీ నిష్పత్తి గత ఏడాది 192 శాతం నుంచి ఈసారి 185 శాతానికి తగ్గినప్పటికీ, గత త్రైమాసికంలోని 177 శాతంతో పోలిస్తే గణనీయంగా మెరుగుపడింది. నియంత్రణ సంస్థ నిర్దేశించిన కనిష్ఠ స్థాయికంటే ఇది ఎంతో ఎక్కువగా ఉందని కంపెనీ పేర్కొంది. దేశ ఆర్థిక పరిస్థితులు తమ వ్యాపారానికి అనుకూలంగా ఉన్నాయని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో లాభదాయకమైన కస్టమర్ సమీకరణ పైనే ప్రధాన దృష్టి సారిస్తామని కంపెనీ స్పష్టం చేసింది.వాల్యూ ఆఫ్ న్యూ బిజినెస్ మార్జిన్లు వచ్చే కొన్ని త్రైమాసికాల్లో ప్రస్తుత స్థాయిలోనే కొనసాగే అవకాశం ఉందని యాజమాన్యం తెలిపింది. అయితే వ్యాపార పరిమాణం పెరగడం, ఉత్పత్తుల మిశ్రమంలో మార్పులు చోటుచేసుకోవడం వల్ల దీర్ఘకాలంలో మార్జిన్లు మెరుగుపడతాయని పేర్కొంది.202627 ఆర్థిక సంవత్సరంలో మార్జిన్ల కంటే వ్యాపార విస్తరణకే అధిక ప్రాధాన్యం ఇస్తామని కంపెనీ వెల్లడించింది. నికరలాభం రూ.548 కోట్ల నుంచి 611 కోట్లకు పెరిగితే నెట్ ప్రీమియం ఆదాయం రూ.14,539 కోట్ల నుంచి రూ.16,728 కోట్లకు చేరింది.



## సెబీ బోర్డు సభ్యులకు కఠిన నియమావళి

**ముంబయి, జులై 15:** మార్కెట్ నియంత్రణ సంస్థ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా(సెబీ) తన బోర్డు సభ్యుల కోసం సమగ్ర ప్రవర్తనా నియమావళిని ఆమోదించింది. ఈ కొత్త నియమావళిలో ప్రయోజనాల సంఘర్షణ (కాన్ఫ్లిక్ట్ ఆఫ్ ఇంటరెస్ట్) నివారణకు కఠిన నిబంధనలు, పూర్తిస్థాయి సభ్యుల ప్రత్యక్షషేర్ పెట్టుబడులపై ఆంక్షలు, ఆస్తులు-బాధ్యతల వెల్లడిపై మరింత పారదర్శకత, పదవీ విరమణ అనంతర పరిమితులు వంటి అంశాలను చేర్చింది. మార్కెట్ నియంత్రణ వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయడమే ఈ చర్యల ప్రధాన ఉద్దేశమని సెబీ తెలిపింది. కొత్త నిబంధనల ప్రకారం సెబీ చైర్‌పర్సన్‌తో పాటు హోల్ టైమ్ సభ్యులు తమ పదవీకాలంలో వ్యక్తిగత ఈక్విటీ షేర్లు, ఈక్విటీగా మారే ఆర్థిక సాధనాలు, ఈక్విటీ మరియు కమోడిటీ డెరివేటివ్‌లలో కొత్త పెట్టుబడులు పెట్టేందుకు అనుమతి ఉండదు.అయితే మ్యూచువల్ ఫండ్లు, రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్టులు,ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్టులు వంటి నిపుణుల నిర్వహణలో ఉండే సమిష్టి పెట్టుబడి సాధనాల్లో మాత్రం పెట్టుబడులు కొనసాగించవచ్చు. బోర్డులో చేరే సమయానికి ఇప్పటికే నిషేధిత పెట్టుబడులు కలిగి ఉన్న హోల్‌టైమ్ సభ్యులు వాటిని విక్రయించడం, పదవీకాలం ముగిసే వరకు నిలిపివేయడం (ఫ్రీజ్ చేయడం) లేదా సెబీ ఆమోదించిన విధానంలో వాటిని బదిలీ చేయడం తప్పనిసరి. అలాగే ఫ్రీజ్ చేసిన ఈక్విటీ పెట్టుబడులకు సంబంధించిన ఓటింగ్ హక్కులను వినియోగించుకునే అవకాశం కూడా ఉండదు.

కొత్త కోడ్ ప్రకారం బోర్డు సభ్యులు తమ కుటుంబ సంబంధాలు, ఆర్థిక పెట్టుబడులు, అప్పులు, స్థిరాస్తులు, వృత్తిపరమైన ప్రయోజనాలు, అద్దె ఒప్పందాలు తదితర వివరాలను సమగ్రంగా వెల్లడించాల్సి ఉంటుంది.

## స్విగ్గీ ఇన్‌స్టామార్ట్‌లో హెచ్‌పిసిఎల్ సిలిండర్లు



**ముంబయి, జులై 15:** క్విక్ కామర్స్ ప్లాట్‌ఫామ్ స్విగ్గీ ఇన్‌స్టామార్ట్, హెచ్‌పిసిఎల్‌తో జతకట్టి దేశంలోనే మొదటిసారిగా క్విక్ కామర్స్ ప్లాట్‌ఫామ్ ద్వారా నిత్యావసర ఎల్‌పీజీ గ్యాస్‌సిలిండర్లను ఆర్డర్ చేసిన నిమిషాల్లోనే డెలివరీ చేసే సేవలను బుధవారం ప్రారంభించింది. ప్రస్తుతం తొలి దశలో భాగంగా ఈ సేవలను కర్ణాటక రాజధాని బెంగళూరులో పైలట్ ప్రాజెక్ట్‌గా అందుబాటులోకి తీసుకువచ్చారు. గ్యాస్ సిలిండర్ బుక్ చేసుకోవడానికి ఉండే నిబంధనలవలే కాకుండా, ఈ యాప్ ద్వారా ఆర్డర్ చేయడానికి వినియోగదారులకు ముందస్తుగా ఎలాంటి డొమెస్టిక్ గ్యాస్ కనెక్షన్ ఉండాల్సిన అవసరం లేదు. ఈటైఅప్‌లో భాగంగా హెచ్‌పీసీఎల్ తన సరికొత్త 10 కిలోల హెచ్‌పీ నవ్య కాంపోజిట్ సిలిండర్లను వాణిజ్యపరంగా మార్కెట్లోకి ప్రవేశపెట్టింది. ఈ సిలిండర్ల ప్రత్యేకత ఏంటంటే, ఇవి పారదర్శకంగా (ట్రాన్స్‌లూసెంట్) ఉండి, సిలిండర్‌లో ఎంత గ్యాస్ మిగిలి ఉందో బయటి నుంచే స్పష్టంగా చూసుకోవచ్చు. వీటితో పాటు సాధారణ 5 కిలోల మెటల్ సిలిండర్లు కూడా ఇన్‌స్టామార్ట్ యాప్‌లో లభిస్తాయి. ఇన్‌స్టామార్ట్ కేవలం నిత్యావసర సరుకులకే పరిమితం కాకుండా, గ్యాస్ సిలిండర్ల వంటి అత్యవసర గృహ అవసరాలను కూడా సురక్షితంగా, నమ్మకంగా ప్రజల చెంతకు చేర్చడమే లక్ష్యంగా పెట్టుకుందని సంస్థ ప్రతినిధులు తెలిపారు. గ్యాస్ సిలిండర్ల రవాణాలో భద్రత అత్యంత కీలకమైన అంశం కాబట్టి, వీటి డెలివరీ బాధ్యతలను స్విగ్గీ సాధారణ డెలివరీ బాయ్స్‌కు కాకుండా, హెచ్‌పీసీఎల్ అధికారిక గుర్తింపు పొందిన పంపిణీదారుల (డిస్ట్రిబ్యూటర్స్) నెట్‌వర్క్‌కు అప్పగించారు. యాప్‌లో వచ్చే ఆర్డర్లను స్థానిక హెచ్‌పీసీఎల్ డిస్ట్రిబ్యూటర్లకు బదిలీ చేస్తారు. వారు తమ శిక్షణ పొందిన సిబ్బంది ద్వారా మాత్రమే వినియోగదారుల ఇళ్లకు సిలిండర్లను సురక్షితంగా చేరవేస్తారు. మొదటిసారి ఆర్డర్ చేసే వారికి కొత్త గ్యాస్ కనెక్షన్‌గా పరిగణించి గుర్తింపు కార్డులను , నివాస ధృవీకరణ పత్రాలను సేకరిస్తారు.




## హెచ్‌డిపి ఫైనాన్షియల్ లాభం 735కోట్లు

**న్యూఢిల్లీ, జులై 15:** హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్ ఆర్థిక సంవత్సర తొలి త్రైమాసికంలో మెరుగైన ఆర్థిక ఫలితాలను నమోదు చేసింది. రుణాల వృద్ధి, రుణాల పంపిణీ పెరగడం, ప్రధాన రుణ వ్యాపారంలో స్థిరమైన వృద్ధి కారణంగా కంపెనీ నికర లాభం గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 38శాతం పెరిగింది. త్రైమాసికంలో రుణాలపై బలమైన డిమాండ్‌తో పాటు కార్యకలాపాల్లో స్థిరమైన పురోగతి కనిపించినట్లు కంపెనీ వెల్లడించింది. త్రైమాసికంలో కంపెనీ నికర లాభం రూ.735 కోట్లకు చేరుకుంది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో ఇది రూ.532 కోట్లుగా నమోదైంది. కంపెనీ మొత్తం ఆదాయం దాదాపు రూ.5,000 కోట్లకు పెరిగింది. రుణాల పోర్ట్‌ఫోలియోలో అన్ని విభాగాల్లో కొనసాగుతున్న డిమాండ్, వ్యాపార విస్తరణ ఇందుకు ప్రధాన కారణాలుగా నిలిచాయి.త్రైమాసికంలో రుణాల పంపిణీ వార్షిక ప్రాతిపదికన 16.2 శాతం పెరిగి రూ.17,629 కోట్లకు చేరుకుంది. అలాగే కంపెనీ నిర్వహణలోని మొత్తం ఆస్తుల విలువ 32.4 శాతం పెరిగి రూ.1.09 లక్షల కోట్లకు చేరింది.కంపెనీ స్థూల రుణాల (గ్రాస్ లోన్స్) పరిమాణం రూ.1.14 లక్షల కోట్లకు పెరిగి, గత ఏడాదితో పోలిస్తే 17.4 శాతం వృద్ధిని నమోదు చేసింది.పోటీ తీవ్రంగా ఉన్న రుణ మార్కెట్‌లోనూ కంపెనీ స్థిరమైన విస్తరణను కొనసాగించినట్లు ఈ గణాంకాలు సూచిస్తున్నాయి. ఆస్తుల నాణ్యత కూడా దాదాపు స్థిరంగానే కొనసాగింది. జూన్ చివరి నాటికి స్థూల నిరర్థక ఆస్తుల నిష్పత్తి 2.58 శాతంగా నమోదైంది. నికర నిరర్థక ఆస్తుల నిష్పత్తి 1.05 శాతంగా గత ఏడాదితో దాదాపు సమానంగా ఉంది. ప్రొవిజన్లకు ముందు నిర్వహణ లాభం వార్షిక ప్రాతిపదికన 20.5శాతం పెరిగి రూ.1,420 కోట్లకు చేరుకుంది.సవాళ్లు ఉన్నప్పటికీ సంస్థ కార్యకలాపాలు సానుకూల దిశలో కొనసాగుతున్నాయి.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

పశ్చిమగోదావరి,ఏలూరు
వార్త



# జగన్ సభకు అనూహ్య స్పందన

- కిక్కిరిసిన భీమవరం
- స్టేజ్ పైనుంచి అదుపు తప్పి పడబోయిన జగన్

జూలై 15, పశ్చిమ గోదావరి జిల్లా బ్యూరో: బుధవారం పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో జరిగిన ఆక్వా రైతుల ముఖాముఖి సభకు అనూహ్య స్పందన వచ్చింది. ఈ కార్యక్రమానికి హాజరైన వైయస్సార్సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డిని చూసేందుకు, ఆయన ప్రసంగాన్ని వినేందుకు వైసీపీ అభిమానులు, ఆక్వా రైతులు భారీగా తరలివచ్చారు. భీమవరంలోని ప్రధాన రహదారులు ట్రాఫిక్ జామ్ సమస్యలతో కిక్కిరిసాయి. జగన్ సభ ప్రాంగణ వేదికైన బైపాస్ రోడ్డు అడుగు పెట్టడానికి వీలులేని విధంగా జనసంద్రంగా మారింది. హెలికాప్టర్ లో భీమవరం లూథరన్ గ్రౌండ్కి చేరుకున్న జగన్ అక్కడి నుంచి కాన్వాయ్ లో సభా ప్రాంగణానికి చేరుకున్నారు. జగన్ కాన్వాయ్ లో ప్రయాణిస్తుంటే వైసీపీ శ్రేణులతో పాటు ఎక్కడ చూసిన వేలాది జనంతో పట్టణం కిక్కిరిసిపోయింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా జగన్ కు ఘనస్వాగతం లభించింది. ఈ దశలో జగన్ స్టేజ్ పైకి చేరుకోవడానికి వేలాది మంది జనం, వైసీపీ అభిమానులు, రైతులు ఒంమధ్య నలిగిపోవలసి వచ్చింది. పోలీసులు తమ వంతు ఎంతో శ్రమించారు. అభిమానుల తోపులాట మధ్య జగన్ స్టేజ్ పైనుంచి కింద పడబోయారు. భద్రతా సిబ్బంది సాయంతో పట్టు నిలుపుకొని నిలబడ్డారు. రాష్ట్రంలో కూటమి పాలన లోఆక్వా తో పాటు వ్యవసాయ రైతాంగం తీవ్ర అవస్థలు పడుతుందని, నేను విన్నాను, నేను ఉన్నాను అంటూ జగన్ భరోసా ఇచ్చారు. జగన్ స్పీచ్ కి సభా ప్రాంగణం మారు మ్రోగింది.



# వైసిపి ఉండి పగ్గాలు సర్రాజు తనయుడు కేనా...!!!

- జగన్ భీమవరం పర్యటన విజయవంతంలో వాసు రాజు కీలక పాత్ర
- ఉండి నియోజకవర్గం అంతటా సర్వత్ర చర్చ

ఉండి, జూలై 15, (ప్రభాతవార్త) వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉండి నియోజకవర్గ పగ్గాలు స్థానిక మాజీ శాసనసభ్యులు పాతపాటి సర్రాజు తనయుడు పాతపాటి శ్రీనివాసరాజు (వాసు రాజు) కు దక్కుతుందని ప్రచారం ఊపందుకుంది.. మాజీ ముఖ్యమంత్రి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డి భీమవరం పర్యటనలో వాసు రాజు కీలకపాత్ర పోషించారు. ఆక్వా రంగంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించేందుకు జగన్ బుధవారం భీమవరం వచ్చి రైతులతో ముఖాముఖి సభను ఏర్పాటు చేశారు. ఈ సభ విజయవంతానికి ఉండి నియోజకవర్గంలో నుంచి పాతపాటి వాసురాజు ప్రధాన పాత్ర పోషించారు అనటంలో అతిశయోక్తి లేదు. జగన్ పర్యటన ఖరారు అయిన నాటి నుంచి సభ ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ జన సమీకరణలో వాసు రాజు నిమగ్నమైనారు. అలాగే ఉండి నియోజకవర్గంలో నుంచి హాజరైన జనానికి అవసరమైన మౌలిక వసతులు సైతం తన సొంత ఖర్చులతో ఏర్పాటు చేసినట్లు తెలిసింది. సుమారు 5 వేల మందికి ఆహార పొట్లాలను ఏర్పాటు చేసి జగన్ సభకు హాజరైన వారికి అందించినట్లు ఇక్కడి క్యాడర్ చెబుతోంది. ఇది ఇలా ఉండగా ఉండి నియోజకవర్గంలో వైసిపి కార్యకర్తల యోగక్షేమాలను నిత్యము తెలుసుకుంటూ వాసు రాజు వారికి అందుబాటులో ఉంటున్నారు. వైసిపి నేతలు కార్యకర్తలు ఇళ్లకు వెళ్లి పరామర్శలు చేస్తూ వారికి భరోసా కల్పించడంలో వాసు రాజు ముందుంటున్నారు. ఈ నేపథ్యంలో ఉండి నియోజకవర్గంలో నుంచి వైసీపీ పగ్గాలను వాసు రాజుకు అందిస్తున్నారని ప్రచారం సాగుతోంది. 2004లో వైయస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వంలో ఉండి నియోజకవర్గం నుంచి పాతపాటి సర్రాజు శాసనసభ్యునిగా పనిచేశారు. 2009 ఎన్నికలలో సర్రాజు ఓటమి చెందినప్పటికీ రాజశేఖర్ రెడ్డి మరణానంతరం జగన్ వెంట నడిచారు. 2014లో సైతం ఉండి నియోజకవర్గంలో నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసిన సర్రాజు ఓటమి చెందారు. అయితే 2019లో జగన్మోహన్ రెడ్డి సర్రాజు కు రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పదవిని అప్పగించారు. తర్వాత కాలంలో సర్రాజు మరణానంతరం ఆయన పెద్ద కుమారుడైన శ్రీనివాసరాజుకు రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పదవిని అందించి సర్రాజు పట్ల వైసీపీకి ఉన్న మమకారాన్ని చాటుకున్నారు. ప్రస్తుతం స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్నందున ఉండి నియోజకవర్గం నుంచి వైసీపీ బాధ్యతలు నిర్వర్తించే సమర్థవంతమైన నాయకుడి కోసం ఆ పార్టీ అన్వేషిస్తుంది. అయితే ఇటీవల కాలంగా వాసు రాజు పార్టీలో చురుకుగా పాల్గొన్న తీరును పరిశీలిస్తే ఉండి నియోజకవర్గ పగ్గాలు ఆయనకే దక్కుతాయని ప్రచారం సాగుతోంది.





**పరిశీలనలో ఆ నలుగురు పేర్లు :**

ఇదిలా ఉండగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉండి నియోజకవర్గ ఇన్చార్జి పదవికి నాలుగు పేర్లు పరిశీలనలోకి వచ్చినట్లు పార్టీకి క్యాడర్ చెబుతోంది. పాతపాటి శ్రీనివాసరాజు (వాసు రాజు) తోపాటు కాళ్ళ మండలం కలవపూడి గ్రామానికి చెందిన ప్రసాదరాజు, ఆకివీడు జడ్పిటిసి సభ్యులు ఎండగండి శ్రీను, పాలకోడేరు మండలం కోరుకోల్లుకు చెందిన మంతెన బాబు, ఈ నాలుగు పేర్లు అధిష్టానం దృష్టిలో ఉన్నట్లు చర్చ సాగుతోంది. వీరిలో ఎవరి సామర్థ్యాన్ని గుర్తించి అధిష్టానం నియోజకవర్గ పగ్గాలను అప్పగిస్తుందో వేచి చూద్దాం..!!




## పార్టీ కోసం పాటుపడ్డ ప్రతి కార్యకర్తకు
# అండగా ఉంటాం..

**జనసేన పార్టీలో పవన్ కళ్యాణ్ గ్రూపు ఒక్కటే ఉంటుంది**

**చర్చా వేదికలో ప్రసంగించిన మంత్రి నాదెండ్ల మనోహర్**

కైకలూరు,జూలై 15(ప్రభాతవార్త) జనసేన పార్టీ కోసం నిరంతరం కష్టపడిన కార్యకర్తలకు క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలు, వారికి ఎదురవుతున్న సవాళ్లను వినేందుకు, పార్టీని మరింత పటిష్టంగా ప్రజల్లోకి తీసుకెళ్లేలా పార్టీ అధ్యక్షులు కె. పవన్ కళ్యాణ్ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్, రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రివర్యులు నాదెండ్ల మనోహర్ తెలిపారు. బుధవారం కైకలూరు సివిఆర్ గార్డెన్స్ వద్ద నిర్వహించిన జనసేన చర్చ వేదిక కార్యక్రమాన్ని మంత్రి నాదెండ్ల మనోహర్ శాసన మండలి విప్ పిడుగు హరి ప్రసాద్,ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్, పత్సమట్ల ధర్మరాజులతో కలిసి ప్రారంభించారు. ముందుగా మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం మృతికి సంతాపం తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని ఒక నిమిషం పాటు మౌనం పాటించారు. ఈ సందర్భంగా నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ జనసేన పార్టీలో పవన్ కళ్యాణ్ గ్రూపు మాత్రమే ఉంటుందన్నారు. క్షేత్రస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయడం, ప్రజల్లో మైలేజ్ తెచ్చే అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం ద్వారా జనసేన ప్రస్థానాన్ని మరింత వేగవంతం చేయవచ్చున్నారు. జనసేన పార్టీలో ఎటువంటి గ్రూపు రాజకీయాలకు తావు లేదని సమాధానం ఇచ్చారు. పార్టీలో ఉన్నదల్లా ఒకే ఒక్క వర్గం. అది పవన్ కళ్యాణ్ వర్గం తేల్చి చెప్పారు.అధినేత పవన్ కళ్యాణ్ సిద్ధాంతాలు, ఆయన ఆశయాలే జనసేనా పార్టీకీ, ప్రతి సైనికుడికి మార్గదర్శకాలు. కొందరు నాయకులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం విడిగా గ్రూపులు కట్టే ప్రయత్నం చేస్తే వాటిని ప్రారంభంలోనే జనసైనికులు తుంచి వేయాలన్నారు. జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వం కేవలం 60 వేలతో ప్రారంభమై, నేడు రాష్ట్రవ్యాప్తంగా 24 లక్షల మార్కుకు చేరుకుంది. కైకలూరు నియోజకవర్గంలో 12,400 మంది సభ్యత్వాన్ని నమోదు చేసుకున్నారు. ఈ రోజు ఈ స్థాయిలో ఉన్నామంటే దానికి ముఖ్య కారణం జనసైనికులు, వీరమహిళలు అందించిన అండదండలే. జనసేన పార్టీ 12 సంవత్సరాల ప్రయాణాన్ని పూర్తి చేసుకోవడం వెనుక పవన్ కళ్యాణ్ గట్టి పట్టుదల, అనేక త్యాగాలు ఉన్నాయి. ఇప్పటం సభలో ఇచ్చిన మాట ప్రకారం, ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలనివ్వకుండా కూటమిని ఏర్పాటు చేశారు. పార్టీకి బలం ఉన్న చోట కూడా ప్రజా ప్రయోజనాలే ముఖ్యం అని సీట్లను వదులుకున్నారు. స్వార్థ ప్రయోజనాల కంటే ప్రజలకు మేలు జరగడమే లక్ష్యంగా నిలబడ్డారు. ఎన్నో అవమానాలు, కష్టాలు మరియు ఇబ్బందులను అధిగమిస్తూ పార్టీని ఈ స్థాయికి చేర్చారు. నిరంతరం ప్రజలతో మమేకమవుతూ, పార్టీ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలోకి బలంగా తీసుకెళ్లాలి. క్షేత్రస్థాయి పర్యటనల ద్వారానే రాజకీయాల్లో అనుభవం, ఎదుగుదల వస్తాయి. ప్రజలు ఇచ్చిన అఖండ విజయాన్ని గౌరవిస్తూ, కార్యకర్తల్లో నాయకత్వంపై ఎలాంటి అపనమ్మకం కలగకుండా బాధ్యతగా నడుచుకోవాలన్నారు.





**బలం ఉన్న ప్రతి చోటా పోటీ చేస్తాం**

స్థానిక ఎన్నికల్లో జనసేనకు ఎన్ని సీట్లు కేటాయిస్తారు? ఎక్కడ పోటీ చేస్తుంది అని కొందరు అడుగుతున్నారు. వారందరికీ ఒకటే సమాధానం... పార్టీ నాయకత్వం బలంగా ఉన్న అన్ని చోట్ల జనసేన పోటీ చేస్తుంది. క్షేత్రస్థాయి పరిశీలన తర్వాత గెలిచే ప్రాంతాలను గుర్తించి అక్కడ అభ్యర్థులను బరిలోకి దింపుతాం. వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రానికి, ప్రభుత్వ వ్యవస్థలకు తీవ్ర నష్టం వాటిల్లింది. నాటి ప్రభుత్వం వ్యవస్థలను స్వప్రయోజనాల కోసమే వాడుకుంటూ వాటిని నిర్వీర్యం చేసింది. కొల్లేరు విషయంలో పవన్ కళ్యాణ్ పై కొందరు కావాలనే దుష్ప్రచారం చేశారు. ఆయన ఎన్నడూ ప్రజలకు వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకోలేదు" అన్నారు. ప్రతి కార్యకర్త చెప్పింది వింటూ.. నోట్ చేసుకుంటూ... కైకలూరులో జరిగిన జనసేన చర్చ వేదికలో పార్టీ పీఏసీ ఛైర్మన్ శ్రీ నాదెండ్ల మనోహర్ గారు, శాసనసభలో ప్రభుత్వ విప్ శ్రీ హరిప్రసాద్ గారు కార్యకర్తల వద్దకే వెళ్లి వారు చెప్పిందంతా ఓపికగా విన్నారు. కార్యకర్తలు చెప్పిన విషయాలను నోట్ చేసుకొన్నారు. వాటి పరిష్కారాన్ని అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ముందు పెడతామని చెప్పారు. ప్రతి ఒక్కరి వద్దకు వెళ్లి, వారి వ్యక్తిగత వివరాలు, పార్టీ కోసం ఎప్పటి నుంచి పని చేస్తున్నారు..? పార్టీలోని పరిస్థితి, క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి తీసుకోవల్సిన చర్యలు గురించి కార్యకర్తల ఫీడ్ బ్యాక్ విన్నారు. ఈ సందర్భంగా పలువులు కార్యకర్తలు వారి ప్రాంతాల్లో చేయాల్సిన ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల గురించి, ప్రభుత్వం తరపున చేయాల్సిన పనులను కూడా ప్రస్తావించారు. కార్యక్రమంలో పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ కళ్యాణం శివ శ్రీనివాస్, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పార్టీ అధ్యక్షులు కొటికలపూడి గోవిందరావు, కృష్ణా జిల్లా పార్టీ అధ్యక్షులు బండ్రెడ్డి రామకృష్ణ, పార్టీ నాయకులు చెన్నమల్ల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆక్వా రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

## తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ

- భీమవరం సభలో మాజీ సీఎం జగన్ వ్యాఖ్యలు పూర్తిగా రాజకీయ ప్రేరేపితమైనవే

తణుకు, జూలై 15 ( ప్రభాత వార్త) భీమవరంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆక్వా రైతులపై చేసిన వ్యాఖ్యలు పూర్తిగా రాజకీయ ఉద్దేశాలతో కూడుకున్నవని, ఆక్వా రైతులను నష్టపరిచిన వ్యక్తికి వారి సమస్యలపై మాట్లాడే నైతిక హక్కు లేదని తణుకు నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు.తణుకులోని ఎమ్మెల్యే కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గత వైసీపీ ప్రభుత్వంలో మత్స్యరంగ వృద్ధి రేటు 1 శాతానికి పడిపోయి ఆక్వా రంగం తీవ్రంగా దెబ్బతిందన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2024–25లో 7.38 శాతం, 2025–26లో 14.9 శాతం వృద్ధి రేటు సాధించేలా కార్యాచరణ అమలు చేస్తోందని తెలిపారు.వైసీపీ హయాంలో ఫిష్ ఫీడ్ ధరను ఆరు దఫాల్లో 27 శాతం పెంచి రైతులపై భారం మోపారని, కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే కేజీ ఫీడ్ ధరను రూ.5.60 తగ్గించి రూ.102కు తీసుకొచ్చిందన్నారు. ప్రస్తుతం అంతర్జాతీయ యుద్ధ పరిస్థితులు, ముడి పదార్థాల ధరలు భారీగా పెరిగినా, రైతులపై భారం తగ్గించే ఉద్దేశంతో కేవలం 8 శాతం మాత్రమే పెంచి కేజీ రూ.111కు పరిమితం చేశామని తెలిపారు.ఆక్వా రైతులకు విద్యుత్ విషయంలో కూడా కూటమి ప్రభుత్వం అండగా నిలిచిందని ఎమ్మెల్యే చెప్పారు. గత ప్రభుత్వం జోన్--నాన్ జోన్ విధానంతో రైతులను ఇబ్బందులకు గురిచేసిందని, కూటమి ప్రభుత్వం ఆ విధానాన్ని రద్దు చేసి జోన్, విస్తీర్ణంతో సంబంధం లేకుండా అర్హులైన ప్రతి ఆక్వా రైతుకు యూనిట్కు రూ.1.50కే విద్యుత్ అందించేలా జీవో జారీ చేసిందన్నారు. విద్యుత్ సబ్సిడీని కూడా గణనీయంగా పెంచి, 2026–27లో 71 వేల కనెక్షన్లకు రూ.1,150 కోట్ల సబ్సిడీ అందించేలా ప్రతిపాదనలు సిద్ధం చేశామని వెల్లడించారు. నరసాపురం ఫిషరీస్ యూనివర్సిటీ పనులను గత ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేయగా, కూటమి ప్రభుత్వం ఇప్పటికే రూ.32 కోట్లు విడుదల చేసి పనులను వేగవంతం చేసిందన్నారు. అలాగే ఏపీఏడీఏ వ్యవస్థను బలోపేతం చేసి క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహిస్తూ ఆక్వా రంగాభివృద్ధికి చర్యలు తీసుకుంటోందని చెప్పారు.రైతుల సంక్షేమం, ఆక్వా రంగాభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.



# అధికారులు--ప్రజాప్రతినిధుల సమన్వయంతోనే జిల్లా అభివృద్ధి సాధ్యం

## కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ

భీమవరం జూలై 15 ప్రభాతవార్త కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు జిల్లాలోని అర్హులైన ప్రతి లబ్ధిదారునికి సకాలంలో చేరేలా అధికారులు అంకితభావంతో పనిచేయాలని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ సూచించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తేనే జిల్లా అభివృద్ధి మరింత వేగవంతమవుతుందని ఆయన పేర్కొన్నారు. జిల్లా కలెక్టరేట్ పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన జిల్లా అభివృద్ధి, సమన్వయ మరియు పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశానికి కేంద్ర మంత్రి అధ్యక్షత వహించారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, డీఆర్ఓ పి. ప్రభాకర్, జిల్లా పరిషత్ సీఈఓ పి. జగదాంబతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. సమావేశంలో కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు, నిధుల వినియోగం, ప్రస్తుత పురోగతి, ప్రజలకు అందుతున్న సేవల నాణ్యతపై సమగ్రంగా సమీక్షించారు. జల్ జీవన్ మిషన్, ప్రధానమంత్రి ఆవాస్ యోజన, వైద్య ఆరోగ్యం, గృహ నిర్మాణం, ఇరిగేషన్, తాగునీరు, విద్యుత్, రహదారులు తదితర శాఖల పనితీరును శాఖల వారీగా పరిశీలించారు. గత దిశ సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలుపై కూడా మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ మాట్లాడుతూ పనుల నాణ్యత, పారదర్శకత, జవాబుదారీతనంతో నిర్దేశిత గడువులోగా లక్ష్యాలను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రంలో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలవుతున్నాయని, మంజూరైన నిధులను శాఖలు సకాలంలో వినియోగించుకోవాలని సూచించారు. ప్రతి మూడు నెలలకు నిర్వహించే దిశ సమావేశాలకు జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని, ఈ సమావేశంలో చర్చించిన అంశాలపై తీసుకున్న చర్యల నివేదికతో తదుపరి సమావేశానికి రావాలని ఆదేశించారు. జల్ జీవన్ మిషన్ పనులపై సమీక్ష సందర్భంగా ఆచంట, నర్సాపురం నియోజకవర్గాల్లో పనులు పురోగతిలో ఉన్నాయని అధికారులు వివరించారు. తాగునీటి పైప్లైన్ పనుల వల్ల రహదారులు దెబ్బతినకుండా ఆర్అండ్బీ శాఖతో సమన్వయం చేసుకుని పనులు వేగవంతం చేయాలని మంత్రి సూచించారు. గృహ నిర్మాణ శాఖ సమీక్షలో జిల్లాలో నిర్మించాల్సిన 50,619 ఇళ్లలో 36,398 ఇళ్లు పూర్తయ్యాయని, మరో 14 వేల ఇళ్ల నిర్మాణం కొనసాగుతోందని అధికారులు తెలిపారు. గృహ నిర్మాణ పురోగతిలో జిల్లా రాష్ట్రంలో నాలుగో స్థానంలో ఉందని వివరించారు. వైద్య ఆరోగ్య శాఖ సమీక్షలో ఆచంట, భీమవరం ప్రభుత్వ ఆసుపత్రుల్లో కొత్త డయాలసిస్ యూనిట్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. విద్యాశాఖ సమీక్షలో ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు, 27 పీఎం శ్రీ పాఠశాలల్లో విద్యాబోధన, మౌలిక సదుపాయాలపై అధికారులు వివరించారు. వ్యవసాయ శాఖ సమీక్షలో అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ లబ్ధిదారుల వివరాలు, ఆన్లైన్ ద్వారా ఎరువుల సరఫరా అంశాలను అధికారులు వివరించారు. విద్యుత్ శాఖ సమీక్షలో పీఎం సూర్యఘర్ పథకం కింద సోలార్ యూనిట్ల ఏర్పాటు, విద్యుత్ ఉత్పత్తి, మిగులు విద్యుత్ను గ్రిడ్కు సరఫరా చేసే అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ పి.ప్రభాకర్, జిల్లా పరిషత్ సీఈఓ పి జగదాంబ, డిపిఓ కె.అనురాధ, సిపిఓ కె.శివ పార్వతి, డ్వామా పీ.డి డాక్టర్. కెసిహెచ్ అప్పారావు, పి జి ఆర్ ఎస్ నోడల్ అధికారి వై.దో సిరెడ్డి రెడ్డి, డీఈవో ఈ నారాయణ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్. వెంకటేశ్వరరావు, డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్. రవిబాబు, డి సి హెచ్ ఎస్ పి సూర్యనారాయణ, జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి జి.పిచ్చయ్య, ఎల్ డి ఎం నాగేంద్రప్ర సాద్, ఆర్ అండ్ బి ఎస్.ఇ ఎ.శ్రీనివాస్, జిల్లా లేబర్ ఆఫీసర్ ఎ.లక్ష్మి, తదితర శాఖ అధికారులు పాల్గొన్నారు.



## జూలై 17న మున్సిపల్ కార్యాలయం భీమవరంలో
# నియోజకవర్గ స్థాయి ప్రత్యేక పీజీఆర్ఎస్ కార్యక్రమం

## జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

భీమవరం జూలై 15 ప్రభాతవార్త ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని, వాటిని వేగవంతంగా పరిష్కరించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న "ఒక నెల -- ఒక నియోజకవర్గం -- నాలుగు పర్యటనలు" కార్యక్రమంలో భాగంగా భీమవరం నియోజకవర్గంలో నాల్గవ ప్రత్యేక పీ.జీ.ఆర్.ఎస్ కార్యక్రమాన్ని ఈ నెల 17వ తేదీ శుక్రవారం భీమవరం మున్సిపాలిటీ కార్యా లయంలో నిర్వహిస్తు న్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ ప్రత్యేక ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు నిర్వహించబడుతుందని ఆమె వెల్లడించారు.ప్రజల నుంచి స్వీకరించిన ప్రతి వినతిని సంబంధితశాఖల అధికారులు క్షుణ్ణం గాపరిశీలించి, ప్రభుత్వ నిబంధ నలు, మార్గదర్శకాల మేరకు పరిష్క రించేందుకు తగిన చర్యలు తీసుకుంటా మని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ కార్యక్ర మంలో జిల్లా, డివిజన్, మండల స్థాయిలకు చెందిన అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొంటారనిఆమె చెప్పారు.ప్రజా సమస్యల పరిష్కా రంలో ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేయడమే ఈ ప్రత్యేక పీజీఆర్ఎస్ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని కలెక్టర్ తెలిపారు. భీమవరం నియోజకవర్గ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కా రం పొందాలని ఆమె విజ్ఞప్తి చేశారు.



# స్థానిక ఎన్నికల్లో నూటికి నూరు శాతం విజయం సాధించాలి

## రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారధి

ఆగిరపల్లి:జూలై: 15ప్రభాతవార్త ఆరిరపల్లి మండలం తోటపల్లి గ్రామంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలోరాష్ట్ర నిర్మాణ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ రానున్న స్థానిక ఎన్నికల్లో నూటికి నూరు శాతం తెలుగుదేశం పార్టీ కైవసం చేసుకోవాలని నాయకులు కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. నాయకులు కార్యకర్తలు సమిష్టిగా పనిచేసే స్థానిక ఎన్నికల్లో మండలంలోని 25 గ్రామాలకు 25 గ్రామాలు తెలుగుదేశం పార్టీ విజయం సాధించాలనిమంత్రిసూచించారు.మండలంలో ఇప్పటికే అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని కోట్ల విలువ చేసే పనులు చేశామన్నారు. గత ప్రభుత్వం ఆర్థిక విధ్వంసం చేసి రూ.10 లక్షల కోట్లు అప్పు ఇచ్చిందని, ఓ పక్క అప్పులు తీరుస్తూ అభివృద్ధి సంక్షేమాన్ని దూర దృష్టి ఉన్న మన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారన్నారు .గత ప్రభుత్వంలో బ్యాంకులు రుణాలు ఇవ్వకుండా వెళ్ళిపోతే కూటమి ప్రభుత్వానికి 75పైసలకు రుణాలు అందిస్తుందని.ఇది కూటమి ప్రభుత్వ పరపతి అన్నారు. గత ప్రభుత్వం రోడ్లు మరియు డ్రైనేజీ త్రాగునీటి ప్రాజెక్టులు గాలికి వదిలారన్నారు.2027 సంవత్సరానికి పోలవరం పూర్తిచేసి జాతికి అంకితం చేస్తామని అన్నారు.నిన్న జరిగిన అధికారుల సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో అత్యంత ప్రాధాన్యత కలిగిన 36 ప్రాజెక్టుల్లో చింతలపూడి ప్రాజెక్టు కు 7వ స్థానం ఇచ్చారని అన్నారు. గత ప్రభుత్వం అభివృద్ధిని వదిలి బటన్ నొక్కడమే అజెండగా పెట్టుకుందని గంజాయి బ్యాచ్ ను పెంచిపోసిస్తుందని దుయ్యబట్టారు.సంవత్సరానికి నాలుగు లక్షల మంది విద్యార్థులు విద్యను పూర్తిచేసుకుని పట్టా తీసుకుంటారని కానీ వారికి ఉద్యోగ ఉపాధిని కల్పించడానికి పరిశ్రమల అభివృద్ధి మరింత అవసరమని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు కేవలం సంవత్సరానికి 40వేల నుండి 50వేలు మాత్రమే ఉంటాయన్నారు. అందరికీ ఉద్యోగ ఉపాది కలగాలంటే ప్రవేటు పరిశ్రమ స్థాపన జరగాలని దానికి అందరూ సహకరించాలన్నారు.తోటపల్లి గ్రామస్తులు కొంతమంది మాట్లాడుతూ స్మశాన అభివృద్ధికి నిధులు కావాలని డ్రైనేజీ త్రాగునీరు సిసి రోడ్లు కావాలని కోరగా త్వరలో పూర్తి చేస్తామని మాట ఇచ్చారు. గత ప్రభుత్వ పాలకులు దూరదృష్ట లేక అభివృద్ధిని కుంటిపరిచారని ఈనాడు కూటమి ప్రభుత్వం దూరదృష్టి అనుభవం రాజకీయ అనుభవం కలిగిన మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన త్రాగునీరు సిసి రోడ్లు నీటిపారుదల ప్రాజెక్టులు నిర్మించడంతో రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకెళుతుందన్నారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమమే కాకుండా వివిధ సామాజిక వర్గాల అభివృద్ధికి అభ్యున్నతికి కట్టుబడుతుందని అన్నారు. గౌడ సోదరులకు రెస్టారెంట్లో 10% రిజర్వేషన్ కేటాయించిందన్నారు. మత్స్యకారులకు పదివేల నుండి 20 వేల ఆర్థిక సహాయం అందిస్తుందన్నారు. నాయి బ్రాహ్మణులకు మరియు ఇతర చేతి కులవృత్తులకు ఆర్థిక చేయుతనిచ్చి వారి యొక్క ఆర్థిక అభివృద్ధికి తోడ్పడుతున్న ది ప్రభుత్వం అన్నారు. గత ప్రభుత్వం సుమారు లక్ష 30 వేల ఫిషరీస్ సొసైటీలు రద్దు చేసిందని అన్నారు.కూటమి ప్రభుత్వం అదే వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు రూ.10వేల నుండి రూ.20వేలు ఆర్థిక సహాయం అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



# తీరిన 'వ్యథ'..చివరి మజిలీ కథ..!

- ఎట్టకేలకు నిర్వాసిత గ్రామాల్లో "స్మశాన వాటికల" నిర్మాణం,
- హర్షం వ్యక్తం చేస్తున్న నిర్వాసితులు

జీలుగుమిల్లి, జూలై-15, (ప్రభాతవార్త) పోలవరం నిర్వాసితులకు నిర్మించిన గ్రామాల్లో ఇప్పటివరకు స్మశాన వాటికలు లేక తీవ్ర ఇబ్బందులు పడిన నిర్వాసితులకు ఎట్టకేలకు స్మశాన వాటికల నిర్మాణాలు చేపట్టడంతో స్థానిక గిరిజనులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గత ఐదు సంవత్సరాల క్రితం నిర్వాసిత గ్రామాలకు చేరుకున్నప్పటికీ గ్రామాల్లో రోడ్లు, విద్యుత్తు, డ్రైనేజీలు, బడి గుడి తదితర మౌలిక వసతులు కల్పించినప్పటికీ జీవిత చివరి మజిలీ అయిన స్మశానాలను ఎక్కడ కేటాయించలేదు. దీంతో ఇప్పటివరకు నిర్వాసిత గ్రామాల్లో ఎవరు మృతి చెందిన నిర్వాసితులకు కేటాయించిన భూముల్లో ఖననం లేదా దహనం చేయడం తప్ప ఉమ్మడి స్మశాన వాటిక ఇప్పటివరకు కేటాయించలేదు. గత ప్రభుత్వం పోలవరం నిర్వాసితులను పట్టించుకోకపోవడంతో వీరి పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వేగవంతం కావడం, నిర్వాసిత గ్రామాలకు పూర్తి సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఉమ్మడి స్మశాన వాటికల నిర్మాణం జీలుగుమిల్లి మండలంలో ప్రస్తుతం తెల్లవరం (అంకన్న గూడెం పంచాయతీ), చీడూరు (పి అంకంపాలెం పంచాయతీ) వద్ద నూతన స్మశాన వాటికలు ఆహ్లాద వాతావరణంలో సుందరంగా రూపు దిద్దుకుంటున్నాయి.



**నిర్మాణం ఇలా:-** మండలంలోని తెల్లవరం, చీడూరు గ్రామాలలో ఒక్కొక్క స్మశాన వాటిక ఆర్ అండ్ ఆర్ నిధులతో ఒక్కొక్కటి రూ.1.00 కోటి వ్యయంతో రెండేసి ఎకరాల విస్తీర్ణంలో ఒక మంచం దహన భవనం, మరొక విశ్రాంతి భవనం, చుట్టూ ప్రహరీ, విద్యుత్ సౌకర్యం, బోరు, అంతర్గత రహదారులు తదితర పనులు శరవేగంగా సాగుతున్నాయి. రానున్న నెల రోజుల్లో స్మశాన వాటికల నిర్మాణాన్ని అన్ని హంగులతో పూర్తి చేస్తామని గుత్తేదారు తరపు పర్యవేక్షకులు "ప్రభాతవార్తకు" తెలిపారు. ఇదిలా ఉంటే మిగిలిన నిర్వాసిత గ్రామాల్లో కూడా ఇలాంటి ఆధునిక స్మశాన వాటికలు, మిగిలిన మౌలిక సదుపాయాలు కల్పించి సమస్యలు లేని పునరావాసానికి పూర్తిగా ముగింపు పలకాలని నిర్వాసితులు కోరుతున్నారు

## వర్షాభావ పరిస్థితుల్లో ఉన్నందున ఆరుతడి పంటలను ఎంచుకోండి

### -వ్యవసాయాధికారి శివశంకర్



**చాట్రాయి, జులై 15 ప్రభాతవార్త** ఎల్నే ఓ ప్రభావం కారణంగా వర్షాభావ పరిస్థితులు ఏర్పడతాయని వాతావరణ శాఖ హెచ్చరించుతున్నందున రైతులు ఆరుతడి పంటలను ఎంచుకోవాలని మండల వ్యవసాయాధికారి బి శివశంకర్ అన్నారు. బుధవారం చాట్రాయి మండలంలోని నరసింహారావు పాలెం గ్రామం నందు పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ ఈ సందర్భంగా ఆయన రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ ఎల్నినో వాతావరణ పరిస్థితులను వర్షాభావాన్ని బట్టి పంట ఎంపికను ఆరుతడి పంటలను సాగు చేసుకోవాల్సిందిగా సూచించారు. రైతులు కచ్చితంగా పంటల బీమాను పొందవలెనని లోన్ తీసుకోని రైతులు ఒక ఎకరానికి వరి 840 రూపాయలు, మినుము 300 రూపాయలు, ప్రత్తి 1900 రూపాయలు, నిమ్మ పంటకు 2500 ప్రీమియం చెల్లించిన యెడల ఇన్సూరెన్స్ వర్తిస్తుందన్నారు. రైతులకు అవసరమైన యూరియా, డిఏపి స్టాకులు ప్రాథమిక సహకార సంఘాలలో, రిటైల్ షాపుల నందు సమృద్ధిగా ఉన్నాయని రైతులకు ఏపీ ఏ ఐ ఎం ఎస్ యాప్ ఉపయోగాలు మరియు ఉపయోగాలు తెలియచేశారు. ప్రతి ఒక్క రైతు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సాధించాలని చెప్పారు. జీవామృతం,ఘనజీవామృతం వాడడం వలన మొక్కలు నీటి ఎద్దడిని తట్టుకుంటాయని తెలియ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సంపూర్ణ ఆరోగ్యం కోసం ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



**అత్తిలి, జులై 15( ప్రభాత వార్త )**ముంబై ఆసుపత్రిలో ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షు డు పవన్ కళ్యాణ్ కుడి భుజానికి సంబంధించిన శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేసుకుని విశ్రాంతి తీసుకుంటున్న సందర్భంగా, ఆయన త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకుని ప్రజాక్షేత్రంలోకి తిరిగి రావాలని ఆకాంక్షిస్తూ తణుకు శాసనసభ్యుడు ఆరిమిల్లి రాధాకృష్ణ ఆధ్వర్యంలో అత్తిలి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయంలో తెలుగుదేశం--జనసేన--బీజేపీ కూటమి నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సంపూర్ణ ఆరోగ్యంతో త్వరగా కోలుకుని, మరింత నూతన ఉత్సాహంతో తన బాధ్యతలను తిరిగి నిర్వర్తించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏం సి చైర్మన్ దాసం ప్రసాద్, జనసేన నాయకుడు దిరిశాల వెంకట్, మండల టిడిపి అధ్యక్షుడు పోలిశెట్టి చందు, సొసైటీ అధ్యక్షుడు పోలిశెట్టి గోపికృష్ణ, కోరిపల్లి హరి, ఎంపీపీ మక్కా సూర్యరావు, మాజీ ఎంపీపీ కేతా సత్యనారాయణ, ఆనాల ఆదినారాయణ రావు కూటమి పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## కంటి చూపు పట్ల శ్రద్ద అవసరం

### -ఎమ్మెల్యే ఆ రి మి ల్లి - అత్తిలిలో కళ్ళజోళ్ళు పంపిణీ



**అత్తిలి, జులై 15( ప్రభాతవార్త )** కంటి చూపు పట్ల ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తణుకు శాసనసభ్యుడు ఆరిమిల్లి రాధాకృష్ణ కోరారు. అత్తిలి మండలం అత్తిలిలో ఉచిత కళ్ళజోళ్ళు పంపిణీ కార్యక్రమంలో రాధాకృష్ణ పాల్గొన్నారు. పేదవర్గాల వారు కంటి చూపు పట్ల నిర్లక్ష్యం వహించడం వల్ల చాలామంది అందత్వ బారిన పడుతున్నారని అన్నారు. 50 సంవత్సరాలు దాటిన పేద వర్గాలకు ఉచితంగా కంటి పరీక్షలు చేయించినట్లు తెలిపారు. మండలంలో 2,400 మందికి పరీక్షలు చేయగా 80 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారన్నారు. 1750 మందికి కళ్ళజోళ్ళు అవసరమని నిర్ణయించగా ఈరోజు వాటిని అందజేస్తున్నట్లు తెలిపారు. కంటి పరీక్షల సమయంలో 685 మందికి రక్తపోటు, 550 మందికి మధుమేహం, 700 మందికి రక్తపోటు, మధుమేహం రెండు ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. ఆహార నియమాలను పాటించడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కోరారు. చిరుతిళ్ళు తగ్గించాలని, జింక్ ఫుడ్ అసలే తినవద్దని శీతల పానీయాలు తగరాదని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాలలో 1200 మందికి 9. 5 కోట్లు ముఖ్యమంత్రి సహాయనిధిగా అందజేసినట్లు తెలిపారు. ఆగస్టు నుండి సంజీవని పథకాన్ని అమలు చేయడం ద్వారా ప్రతి ఒక్కరికి ఆరోగ్య రికార్డులను నిర్వహిస్తారని తెలిపారు. పేదలకు బీమా సదుపాయం కల్పిస్తారన్నారు . కంటి వైద్య శిబిరాలను ప్రతి సంవత్సరం నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అత్తిలి ఏఎంసీ చైర్మన్ దాసం ప్రసాద్, ఎంపీపీ మక్కా సూర్యరావు, మండల టిడిపి అధ్యక్షుడు పోలిశెట్టి చందు, బిజెపి నాయకుడు నాగబాబు, టిడిపి నాయకులు ఆనాల ఆదినారాయణ రావు, ఏ ఎం సి ఉపాధ్యక్షుడు కే రామాంజనేయులు తదితరులు మాట్లాడారు. ద్వారకా తిరుమల మల ట్రస్ట్ ఆల్తి సత్యనారాయణ, బోడపాటి సూర్యచంద్ర రావు,గొరగాని రాజు, వ ద్రి శ్రీను, కొరిపల్లి హరి, దాసం బాబ్జి, కేతా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## మామిడిలో సస్యరక్షణ తోనే అధిక దిగుబడి

### -శాస్త్రవేత్త డాక్టర్ ఉమామహేశ్వరి



**నూజివీడు, జులై 14 ప్రభాతవార్త:** మామిడిలో సస్యరక్షణ చర్యలు తీసుకుంటేనే దిగుబడి అధికంగా వస్తుందని మామిడి పరిశోధన ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఉమామహేశ్వరి అన్నారు, మామిడి కోత అనంతరం తీసుకోవలసిన జాగ్రత్తలు, కొమ్మ కత్తిరింపులు గురించి అవగాహన కార్యక్రమం బుధవారం నూజివీడు మండలం బోర్వంచ గ్రామంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ఆమె ప్రధాన శాస్త్రవేత్త, హార్టికల్చర్, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్, కే సంతోష్, ఉద్యాన శాఖ అధికారిని, ఆర్ హేమ, రైతు సేవ కేంద్రం సిబ్బంది, రైతులు తరలివచ్చారు. శాస్త్రవేత్త మాట్లాడుతూ మామిడిలో కొమ్మ కత్తిరింపులు అనేవి చాలా ముఖ్యమైన అంశం, ప్రతి సంవత్సరం కాయ కోత అనంతరం, పూతకాడలు అడ్డదిడ్డమైన కొమ్మలు, ఎండు కొమ్మలు, తెగులు వచ్చిన కొమ్మలు , గొడుగు కొమ్మలను కత్తిరించుకోవాలి అని తెలిపారు. కొమ్మలు కత్తిరించిన తర్వాత బ్లైటాక్స్ మిశ్రమం కలిపి పూయాలని తెలిపారు. కొమ్మలను విరవకుండా రంపంతో ఏటవాలుగా కత్తిరించాలని తెలిపారు. 40 సంవత్సరాల పైబడిన మామిడి చెట్లను పునరుద్ధరణ చేసుకుంటే మళ్లీ కొత్త చెట్ల లాగా దిగుబడి ఇస్తాయని తెలిపారు. మామిడి తోటలలో లోదుక్కులు దున్నుకొని పాదులు చేసుకోవాలని తెలిపారు. కొమ్మ కత్తిరింపులు చేయడం వలన గాలి, ఎండ ప్రసరణ బాగా ఉంటుందని, మామిడికాయల క్వాలిటీ బాగా వస్తుందని తెలిపారు. పూత వచ్చినప్పుడు ఆశించే పురుగుల నుండి ఈ కొమ్మ కత్తిరింపులు చేయడం వల్ల కొంతవరకు నివారించవచ్చు అని తెలిపారు. 10 సంవత్సరాలు పైబడిన మామిడి చెట్లకు యూరియా 2.2 కేజీలు సూపర్ 6.3 కేజీలు పొటాష్ 1.7 కేజీలు, రెండు దఫాలుగా వేసుకోవాలని తెలిపారు. ఏ. డి. హెచ్ మాట్లాడుతూ ఉద్యాన పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. రైతులకు ప్యాక్ హౌస్ లు, రేపనింగ్ చాంబర్లు, కోల్డ్ స్టోరేజ్ యూనిట్లు,ప్రాసెసింగ్ యూనిట్లు, తైవాన్ స్ప్రేయర్లు రాయితీలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఉద్యాన అధికారి మాట్లాడుతూ, ఈ సంవత్సరం ఎల్నీనో ప్రభావం ఉంటుందని, రైతులు పాదులలో ఆచ్ఛేదనం చేసుకోవాలని, పీఎండిఎస్ విత్తనాలను చల్లుకోవాలని, మామిడి తోటలలో మడులను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు.

## వరి మినుము పంటలకు ఇన్సూరెన్స్ చేయించుకోండి



**ఆగిరిపల్లి జూలై 15ప్రభాత వార్త** వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఈదర గ్రామంలో మండల వ్యవసాయ అధికారి అధ్యక్షతన పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి జే భవాని మాట్లాడుతూ నారు మడులలో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి రైతులకు వివరించారు. నాట్లు సమయములో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రైతులకు వివరించారు. వరి పండించే రైతులందరూ వరి పంటకు ఇన్సూరెన్స్ చేయించుకోవాలని రైతులకు తెలియజేశారు. వరి పంటకు ఎకరంనకు 840 రూపాయల ప్రీమియంతో 15.08.2026 వ తేదీ లోపుగా, మినుము పండించే రైతులు మినుము పంటకు ఎకరమునకు 300 రూపాయలు ప్రీమియం తో 31.07.2026 వ తేదీ లోపుగా పంటల భీమా చేయించుకోవాలని తెలియచేసారు. వరి పంట గ్రామం యూనిట్ గా, మినుము పంట జిల్లా యూనిట్ గా భీమా విధానం అమలు చేయబడుతుందని తెలియజేశారు. బ్యాంకులలో క్రాప్ లోను తీసుకొనని రైతులు తమ తమ రైతు సేవా కేంద్రంలో కామన్ సర్వీస్ సెంటర్ మీసేవ లను సంప్రదించి బీమా చేయించుకోనవలెనని తెలియజేశారు.క్రాప్ లోను తీసుకున్న రైతులు సంబంధిత బ్యాంకు వారు ప్రీమియం వసూలు చేసి బీమా కంపెనీకి నేరుగా చెల్లిస్తారుఅనిఅన్నారు. ఈ కార్యక్రమంలో రైతు శిక్షణా కేంద్రం, ఏలూరు వ్యవసాయాధికారి యం. ఉషా కుమారి , మండల ఉద్యానశాఖ అధికారికె జ్యోతి ప్రియాంక గ్రామ ఉద్యాన సహాయకులు రక్షిత, విక్టర్ శామ్ పాల్ గ్రామ రైతులు పాల్గొన్నారు.

## లింగపాలెం సింగగుడెం గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం.



**లింగపాలెం 15 (ప్రభాతవార్త )** లింగ పాలెం మండలంలోని లింగపాలెం సింగాగుడెం గ్రామాలలో పొలం పిలు స్తుంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమానికి మండల వ్యవసాయ అధికారి శ్రీ ప్రదీప్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు ఈ కార్యక్రమానికి ఉద్దేశించి పొలం పిలుస్తుంది భాగంగా గ్రామాల్లోని రైతులకు ఎల్ లినో వాతావరణం పరిస్థితులు అనుగుణంగా పంతులు పంటలు సాగు చేయాలని తెలిపారు కౌలు రైతులకు కౌలు కార్డులు పొందాలని తద్వారా ప్రభుత్వ పథకాలు పొందవచ్చు అని తెలిపారు అలాగే వరి సాగు పంట బీమాలో చేసే రైతులు 840 కట్టడం ద్వారా పంట బీమా పొందవచ్చును వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ పశువులకు వేసే టీకాలు అందుబాటులో ఉన్నాయనికావున రైతులు టీకాలు వేయించుకోవాలని అన్నారు ఏరువాక కేంద్రం సమన్వయకర్త డాక్టర్ ఫణికుమార్ మాట్లాడుతూ ఎల్ నీనో ను వాతావరణం వల్ల నారుమడులు వేడు గాలులు మరియు నీటి ఎద్దడికి సేరవుతున్నాయని వాటి నివారణకు తడులు వెంట వెంటనే ఇవ్వాలని తెలిపారు ఈ కార్యక్రమంలో లింగపాలెం సహకార సంఘం అధ్యక్షులు మోరంపూడి మల్లికార్జునరావు ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు నాగేంద్ర ఏ ఈ ఓ సిహెచ్ శ్రీనివాసరావు గణేష్ రైతు సేవ కేంద్రం ఇంచార్జ్ కావేరి పి అజయ్ మరియు స్థానిక రైతులు పాల్గొన్నారు.

## ప్రపంచ జనాభా వారోత్సవాలు



**గణపవరం, జులై 15( ప్రభాతవార్త )**గణపవరంప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో ప్రపంచ జనాభా వారోత్సవాల కార్యక్రమం సందర్భంగా హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్ల లలో డాక్టర్ .పి .కిరణ్మయి, డాక్టర్ కే . ఓంకార్ నాథ్ ,ఆధ్వర్యంలో సెల్ఫ్ హెల్ప్ గ్రూప్, కమ్యూనిటీ బేస్డ్ ఆర్గనైజేషన్, నాన్ గవర్నమెంట్ ఆర్గనైజేషన్లతో ఇంటింటా తిరిగి గ్రూప్ సమావేశాలు నిర్వహించారు.గ్రామసభల ద్వారా జనాభా గురించి , కుటుంబ నియంత్రణ పద్ధతులు,బిడ్డకు బిడ్డకు మధ్య కొంతకాలం గడువు, కుటుంబ సంక్షేమ ప్రణాళిక..దంపతులిద్దరి బాధ్యత , వహించాలని తెలిపారు కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ జె . విల్సన్ బాబు , పద్మజ , దేవి దేవికా,కేజియా ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## కూరగాయల సాగుపై అన్నదాత ఆసక్తి



**ప్రభాతవార్త చాట్రాయి** మెట్ట ప్రాంతమైన చాట్రాయి మండలంలో కూరగాయలు సాగుపై అన్నదాతలు ఆసక్తి చూపిస్తున్నారు. ఈ ప్రాంతంలో ఎక్కువగా మొక్కజొన్న, పొగాకు, పసుపు, పత్తి, వేరుశనగ ఈ పంటలను రైతులకు సాగు చేస్తూ ఉంటారు. కాని ఇటీవల కాలంలో కూరగాయలకు మంచి డిమాండ్ ఉండటంతో కూరగాయలు పండించాలి అనే ఆలోచన రైతుల్లో మొదలైంది. దీంతో కాకర, దొండ, బీర, వంగ, టమోటా మొదలు పంటలపై రైతన్నలు ఆసక్తి చూపిస్తున్నారు. దీనికి తోడు ప్రభుత్వం కూడా కూరగాయ గంటలకు రాయితీలు కల్పిస్తుండడంతో అన్నదాతల్లో మరింత మక్కువ చూపిస్తున్నారు. దీంతో రోజురోజుకీ కూరగాయల సాగు అధికంగా అవుతోంది. ప్రభుత్వ రాయితీలను సద్వినియోగం చేసుకోండి: హేమ కూరగాయలు సాగుకు, పండ్ల తోటల, పూలతోటలు పెంపకానికి ఉద్యానవన శాఖ ద్వారా రాయితీలు ఇస్తున్నట్లు ఉద్యానవన శాఖ అధికారిని ఆర్.హేమ చెప్పారు. మండల పరిషత్ సమావేశం సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూరగాయలు పండించే రైతులకు హైబ్రిడ్ విత్తనముల పథకంలో 3000 మరియు శాశ్వత పందిర్ల పథకంలో లక్ష రూపాయలు రాయితీ ఇస్తున్నట్లుఆమె వివరించారు. పండ్ల తోటలు విస్తీర్ణ పథకంలో భాగంగా మామిడి, జామ, నిమ్మ, జీడిమామిడి పంటలు వేసుకున్న రైతులకు మొక్కలకు మరియు ఎరువులకు మూడు సంవత్సరాలు నిర్వహణ నిమిత్తం 50% రాయితీ ఇస్తున్నామని తెలిపారు. అరటి, బొప్పాయి తోటలకు రెండు సంవత్సరాల నిర్వహణకు నిమిత్తం 50 శాతం రాయితీ ఇస్తున్నట్టు చెప్పారు. అదేవిధంగా పూల తోటలు వేసుకునే రైతులకు పూల తోటల విస్తీర్ణం పథకం కింద ఒక ఎకనారుకు 16 వేల రూపాయలు రాయితీ అందిస్తున్నామని ఈ అవకాశాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. కూరగాయలు పళ్ళ తోటలో విస్తీర్ణం పెరగాల్సిన అవసరం ఉందని మార్కెట్లో వీటికి డిమాండ్ ఎక్కువగా ఉందని ఆమె వివరించారు. ఈ సాగు విషయంలో ఏమైనా సందేహాలు ఉంటే తమని సంప్రదించాలని ఆమె కొరారు.

## గాడ్సన్ సోషల్ సర్వీస్ సొసైటీ కి ఉత్తమ సేవా అవార్డు




**ఆగిరిపల్లి జూలై 15 ప్రభాతవార్త** సుగంధ , ఔషద మొక్కల పెంపకం మార్కెటింగ్ కు సంబంధించి గాడ్సన్ సోషల్ సర్వీస్ సొసైటీ కి ఉత్తమ సేవా అవార్డు లభించిందని ఆ సంస్థ డైరెక్టర్ కోలేటి పాల్ రమేష్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆరోగ్య వైద్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించబడిన సుగంధ మరియు ఔషద మొక్కల సేద్యము మరియు మార్కెటింగ్ అను అంశం పై విజయవాడ తుమ్మలపల్లి వారి కళాక్షేత్రంలో రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమం మరియు వైద్యశాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ అధ్యక్షతన జరిగిన రాష్ట్రస్థాయి సదస్సులో ఆంధ్రప్రదేశ్ సుగంధ మరియు ఔషద మొక్కల బోర్డు ముఖ్య కార్యనిర్వాహణాధికారి ఆవుల చంద్రశేఖర్ చేతులమీదుగా అవార్డు అందుకోవడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ సందర్భముగా కాసా సంస్థ మాజీ రీజినల్ కో ఆర్డినేటర్ పి.ఎస్.వర కుమార్, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్ రమేష్ ను అభినందించారు

## ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను బాధితులకు అందజేసిన రాష్ట్ర మంత్రికొలుసు పార్థసారథి



**ఆగిరిపల్లిజూలై:15 ప్రభాతవార్త** ఆగిరిపల్లి మండలం తోటపల్లి గ్రామ సచివాలయంలో బుధవారంరాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి ఇటీవల వైద్యం చేయించుకున్న సుమారు20మంది బాదిత కుటుంబాలకు సుమారురూ. 11లక్షల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను మంత్రికొలుసు పార్థసారధి అందజేశారు. ఈ సందర్భంగామాట్లాడుతూ పేద ప్రజల ఆరోగ్యానికి ముఖ్యమంత్రి సహాయ నిధి సంజీవని వంటిదని అన్నారు. రాష్ట్రంలో పేద ప్రజల ఆరోగ్య భద్రతకు కూటమి ప్రభుత్వం వేల కోట్లు ఖర్చు చేస్తుందని దీనిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. రాష్ట్రంలో 104 వాహనం మాదిరిగా 109వాహనం గ్రామంలోని ప్రతి ఒక్కరికకీ ఆరోగ్య పరీక్షలు చేసి ప్రజల ఆరోగ్యానికి భద్రత కల్పిస్తుందని అన్నారు. గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి ఒక్క రూపాయి కూడా మంజూరు చేయలేదని,కూటమి ప్రభుత్వంలో నూజివీడు నియోజకవర్గములో ఇప్పటి వరకూ సుమారు.రూ15కోట్లు విలువైన ముఖ్యమంత్రి సహాయనిది చెక్కులు అందించామన్నారు.ప్రభుత్వ ఆసుపత్రిలోని మెరుగైన వైద్యం కోసం మెరుగైన వైద్య పరికరాల ఏర్పాటుకు వేలకోట్ల ఖర్చు చేసిందని తద్వారా ప్రజలకు మెరుగైన వైద్యం అందుతుందన్నారు.కూటమి ప్రభుత్వంలో ప్రజల ఆరోగ్య భద్రతతో సంతోషంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు,ఎన్, వేణు,తహశీల్దార్ పిఎన్వి ప్రసాద్, నాయకులుచిట్నేని శివరామకృష్ణ, ఆరేపల్లి శ్రీనివాసరావు ,ప్రభుత్వ అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఏ ప్రాంతమైన అభివృద్ధి చెందాలంటే పరిశ్రమల అవసరం మంత్రి కొలుసుపార్థసారథి



**అగిరిపల్లి , జూలై , 15 ప్రభాతవార్త** అగిరిపల్లి ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు చేసే ప్రయత్నాలకు ప్రతిపక్షాలు అబద్ధపు ప్రచారాలతో వివాదాస్పదం చేసేందుకు ప్రయత్నిస్తున్నాయని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారధి చెప్పారు. అగిరిపల్లి మండలం తోటపల్లి లో బుధవారం గ్రామసభలో పాల్గొని ప్రజల సమస్యలను మంత్రి తెలుసుకున్నారు. అనంతరం పాత్రికేయులతో మంత్రి పార్థసారధి మాట్లాడుతూ ఏ ప్రాంతమైన అభివృద్ధి కావాలంటే పరిశ్రమల ఏర్పాటుద్వారా ఆ ప్రాంతం అభివృద్ధి చెందడంతోపాటు , ఆ ప్రాంతంలోని ఎంతో మంది యువతకు ఉద్యోగ అవకాశాలు కలుగుతాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వ క్లీన్, గ్రీన్ ఎనర్జీ విధానం ద్వారా అగిరిపల్లి మండలంలో 120 కోట్ల రూపాయలతో నితిన్ కృష్ణ కన్స్ట్రక్షన్స్ కంపెనీ కంప్రెస్డ్ బయో గ్యాస్ ఏర్పాటు చేస్తున్నారన్నారు. 39 కోట్ల రూపాయలు ప్రమోటర్ల పెట్టుబడి, మిగిలిన మొత్తం బ్యాంకుల నుండి రుణంతో ఏర్పాటు చేస్తున్నారన్నారు. నూజివీడు మండలం తుక్కులూరు లో కూడా 200 కోట్ల రూపాయల పెట్టుబడితో ఇటువంటి కర్మాగారం ఏర్పాటు చేస్తున్నారన్నారు. ఈ కర్మాగారాల ఏర్పాటు ప్రధాన ఉద్దేశ్యం నూజివీడు నియోజకవర్గాన్ని అభివృద్ధి పధంలో తీసుకువెళ్లడంతోపాటు ఈ ప్రాంతంలోని యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమన్నారు. రిలయన్స్ కంపెనీ 65 వేల కోట్ల రూపాయలతో దేశవ్యాప్తంగా ఇటువంటి కంప్రెస్డ్ బయో గ్యాస్ యూనిట్లను 500 యూనిట్లను ఏర్పాటుచేస్తున్నదన్నారు. ఎక్కడా వారి సమస్యలను అడిగి తెలుసుకునేందుకు ప్రజలతో గ్రామ సభలు నిర్వహించలేదని, కానీ తన కుమారుడు సామజిక బాధ్యతతో గ్రామ సభ నిర్వహించి ప్రజలకు పరిశ్రమ ఏర్పాటు లాభాలను తెలియజేశాడన్నారు. అంతేకాక పేరు పీ4 కార్యక్రమం కింద పలుగ్రామాలలో పేదల అభివృద్ధికి కుట్టు మిషన్లు, పాడి పశువులను అందించారన్నారు. పరిశ్రమలు వస్తే వాటి సిఎస్ ఆర్ నిధుల ద్వారా ఆయా ప్రాంతాలలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టవచ్చన్నారు. అభివృద్ధిని అడ్డుకునే ప్రతిపక్షం నూజివీడు అభివృద్ధిని అడ్డుకునేందుకు కంప్రెస్డ్ బయో గ్యాస్ యూనిట్ల ఏర్పాటు కారణంగా ప్రజలకు సమస్యలు వస్తాయని, వంటి ఎన్నో అసత్యాలను ప్రచారం చేస్తున్నదన్నారు. ప్రజలను రెచ్చగొట్టి అభివృద్ధిని అడ్డుకుంటున్నారన్నారు. సిబిజి నేపియర్ గ్యాస్, గడ్డి, మొక్కజొన్న వ్యర్థాలు, ఆవు పేడ వంటివి వినియోగిస్తారని, వీటి కారణంగా ప్రజలకు ఎటువంటి ఆరోగ్య సమస్యలు ఉండవన్నారు. అగిరిపల్లి ప్రాంతాల్లోని వారిని పెద్దాపురం, కంచికిచర్లలో సిబిజి ప్లాంట్ నిర్వహణను పరిశీలించేందుకు తీసుకువెళ్లామని, వారు పరిశీలించి ఎటువంటి దుర్వాసన లేదని పరిశీలించారన్నారు. సిబిజి పరిశ్రమ ఏర్పాటుకు అవసరమైన భూమిని మంత్రివర్గ సమావేశంలో మంజూరు చేసారని, అప్పటివరకు తాను ఆ స్థలాన్ని పరిశీలించలేదన్నారు. తనకు కేటాయించిన భూమిని తప్ప ఒక్క ఎకరం కూడా తీసుకోలేదన్నారు. సిబిజి కంపెనీకి కేటాయించిన భూమిలో భూమిని తవ్వి భూమిని చదును చేస్తున్నామన్నారు. ప్రతిపక్షానికి చెందిన కొందరు తమ భూములు ఉన్నాయని తెలియజేస్తున్నారని, గత ప్రభుత్వ సమయంలో మాజీ ఎమ్మెల్యే 27 ఎకరాలకు అనుమతి తీసుకుని వేలాది ఎకరాలలో మట్టిని అక్రమంగా తవ్వి, తరలించారన్నారు. ఇందుకు సంబంధించి సాటిలైట్ చిత్రాలను మంత్రి పాత్రికేయులు చూపుతూ వీటిపై విచారణ చేసి ఆనాటి ప్రకృతి విధ్వంసానికి కారణమైన వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. పరిశ్రమ ఏర్పాటుకు ఒక ప్రదేశంలో చర్చ్ తొలగించాల్సి వచ్చినప్పుడు చర్చ్ పెద్దలతో మాట్లాడి వేరే ప్రదేశంలో పెద్దస్థాయిలో నిర్మిస్తామని కోరామని, కానీ వారు అదే ప్రదేశంలో చర్చ్ ఉండాలని కోరడంతో వారి విన్నపాన్ని మన్నించామన్నారు. సిబిజి పరిశ్రమ ఏర్పాటులో అగిరిపల్లి ప్రాంత ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూస్తానన్నారు. అగిరిపల్లి ప్రాంత ప్రజలు తమకు అభివృద్ధి వద్దు, తమ ప్రాంత యువత ఉద్యోగ అవకాశాలు వద్దు అని తీర్మానం చేస్తే తన కుమారుడు నితిన్ కృష్ణ కనస్ట్రక్షన్స్ కంపెనీ సీబీజి కంపెనీని అక్కడ నుండి వేరే ప్రాంతంలో ఏర్పాటుచేసేందుకు తాము సిద్ధమన్నారు. ఈ సమావేశంలో నక్కన బో యిన వేణు, చిట్టినేని శివరామకృష్ణ, ఆరేపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ జగదాంబ ఆలయ పునర్నిర్మాణంపై గ్రామసభ ఏర్పాటు చేస్తాం,ఏసీఓ శ్రీనివాస్ వెల్లడి



**జీలుగుమిల్లి, జూలై-15 (ప్రభాతవార్త)**మండల కేంద్రం జీలుగుమిల్లిలోని శ్రీ జగదాంబ అమ్మవారి ఆలయ పునర్నిర్మాణంపై గ్రామసభ నిర్వహించి నిర్ణయం తీసుకుంటామని దేవాదాయ శాఖ ఏసీఓ కూచిపూడి శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జంగారెడ్డిగూడెం ఆర్డీవో రమణ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు.జాతీయ రహదారి 365బీబీ విస్తరణ పనుల నేపథ్యంలో ప్రస్తుతం ఉన్న ఆలయాన్ని పునర్నిర్మించాల్సిన అవసరం ఏర్పడింది. ఈ సందర్భంగా ఆర్డీవో రమణ మాట్లాడుతూ, గ్రామంలోని జాతీయ రహదారి పక్కనే ఆలయాన్ని నిర్మించడం అనుకూలంగా ఉంటుందని ప్రతిపాదించారు. అయితే ఆలయాన్ని వేరే ప్రదేశానికి తరలిస్తే భక్తుల మనోభావాలు దెబ్బతింటాయని, అవసరమైతే తక్కువ స్థలంలోనైనా ప్రస్తుతం ఉన్న ప్రాంతంలోనే ఆలయాన్ని నిర్మించాలని, ఇందుకోసం గ్రామసభ ఏర్పాటు చేయాలని గ్రామస్తులు పట్టుబట్టారు. ఇందుకు దేవాదాయ శాఖ అధికారులు అంగీకరించి, రానున్న ఐదు రోజుల్లో గ్రామసభ ఏర్పాటు చేసి ఆలయ పునర్నిర్మాణంపై తుది నిర్ణయం తీసుకుంటామని ఏసీఓ శ్రీనివాస్ వెల్లడించారు.ఈ సమావేశంలో తహసీల్దార్ బి. వెంకటేశ్వరరావు, ఎంపీడీవో కే. వెంకటలక్ష్మి, దేవాదాయ శాఖ కార్యనిర్వహణ అధికారి శ్రీలక్ష్మి, ఆలయ ధర్మకర్త చిర్రి వెంకటేశ్వరరావు, గ్రామస్తులు చాట్రాతి ప్రసాద్, కొండపల్లి ప్రసాద్, కోలా ధర్మరాజు, చంద్రశేఖర్, చిట్టిబొమ్మ సతీష్, పవన్, మురళి పాల్గొన్నారు.

## నేడు పోలవరం ప్రాజెక్టును సందర్శించనున్న కేంద్ర మంత్రి వర్మ బృందం



**పోలవరం జూలై 15 ప్రభాత వార్త** కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, రాష్ట్ర మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఈనెల 16వ తేదీన పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణ పనులను పరిశీలించనున్నారు. ఈ మేరకు ఏలూరు జిల్లా జాయింట్ కలెక్టర్ డా. ఎం.జె. అభిషేక్ గౌడ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ?పర్యటన షెడ్యూల్ ప్రకారం.. 16వ తేదీ ఉదయం 10 గంటలకు ప్రజాప్రతినిధుల బృందం పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకానికి చేరుకుంటుంది. అనంతరం మధ్యాహ్నం 2 గంటల వరకు కె.ఎల్. బండ్, పోలవరం ప్రాజెక్ట్ ఎడమ ప్రధాన కాలువ జీరో పాయింట్, రామదుర్గం గుడి, గండిపోశమ్మ గుడి నావిగేషన్ టన్నెల్, హెడ్ రెగ్యులేటర్, పవర్ హౌస్, ఎగువ కాఫర్ డాం, గ్యాప్-1, గ్యాప్-2, స్పిల్ వే ప్రాంతాలను సందర్శించి పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారు. ?మధ్యాహ్నం 3 గంటల నుండి 4 గంటల వరకు ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులతో ప్రాజెక్టు పనులపై ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. సమావేశం అనంతరం కేంద్ర మంత్రి, ఇతర ప్రజాప్రతినిధులు పోలవరం డ్యామ్ సైట్ నుండి తిరుగుప్రయాణం అవుతారని జాయింట్ కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## విద్యాభివృద్ధికి వెన్నార్ సిరామిక్స్ సేవలు అభినందనీయం



**మండవల్లి జులై 15 (ప్రభాతవార్త)** విద్యార్థుల విద్యాభివృద్ధికి, పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు వెన్నార్ సిరామిక్స్ లిమిటెడ్ అందిస్తున్న సహకారం అభినందనీయమని ఎమ్మీవోలు సురేష్, రత్న సుదానందం పేర్కొన్నారు. మండలంలోని పెరికేగూడెం జడ్పీ హైస్కులులో బుధవారం కంపెనీ హెచ్ ఆర్ ఏజీఎం శ్రీనివాస్ తో కలిసి రూ. 20 వేలు విలువ గల పుస్తకాలను 180 మంది విద్యార్థులకు పంపిణి చేశారు. దాతలు అందిస్తున్న సహకారంతో విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని, పాఠశాలకు, గ్రామానికి పేరు తీసుకురావాలని వారు కోరారు. గత 13 ఏళ్లుగా వెన్నార్ కంపెనీ గ్రామాభివృద్ధికి, పాఠశాల అభివృద్ధి కూడా చేయుతనిస్తున్నారని, విద్యార్థుల అభ్యునతికి కృషి చేస్తున్నారని హెచ్ఎం ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఆర్అండ్ఆర్ భూ కుంభకోణంపై సమగ్ర విచారణ జరపాలి

### -సిపిఎం జిల్లా కార్యదర్శి ఆర్ లింగరాజు



**జీలుగుమిల్లి, జూలై-15 (ప్రభాతవార్త):**గిరిజనుల సాగులో ఉన్న భూములను ఆర్అండ్ఆర్ (పునరావాస) ప్యాకేజీలో చేర్చి అక్రమంగా నగదు పొందిన ఘటనపై సమగ్ర విచారణ చేపట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఆర్. లింగరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.బుధవారం జీలుగుమిల్లిలోని ప్రజా సంఘాల కార్యాలయంలో సిపిఎం మండల స్థాయి సమావేశం సి.హెచ్. కొండలరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆర్. లింగరాజు మాట్లాడుతూ, గత నలభై సంవత్సరాలుగా గిరిజనులు సాగు చేస్తున్న భూములను కొందరు మధ్యవర్తులు, దళారులు పీసా కమిటీ తీర్మానం లేకుండా, గ్రామసభ నిర్వహించకుండా అమాయక గిరిజనుల నుంచి సంతకాలు సేకరించి ఆర్అండ్ఆర్ ప్యాకేజీలో చేర్చి అక్రమంగా విక్రయించారని ఆరోపించారు.తీరా గిరిజనులు తమ సాగు భూములకు వెళ్లగా అవి ఇప్పటికే ఆర్అండ్ఆర్ ప్యాకేజీలోకి వెళ్లాయని తెలియడంతో తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులైన మధ్యవర్తులు, సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు తెల్లం రామకృష్ణ, మండల నాయకులు కారం నాగదుర్గ, సి.హెచ్. కొండలరావు, ఎస్. సీతారామయ్య, శంకురుడు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభంకు ఘన నివాళి

### -మొగల్తూరులో కాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శ్రద్ధాంజలి




**మొగల్తూరు, జూలై 16 (ప్రభాతవార్త):**రాష్ట్ర కాపు సంఘ వ్యవస్థాపకులు, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం మృతి పట్ల మొగల్తూరు మండల కేంద్రంలో కాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ముద్రగడ పద్మనాభం చిత్రపటానికి పూలమాలలు వేసి కాపు సంఘ నాయకులు, అభిమానులు శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన ఆంధ్రప్రదేశ్లో కాపు సామాజిక వర్గ సంక్షేమం కోసం చేసిన సేవలు, ఉద్యమ స్ఫూర్తిని పలువురు నాయకులు గుర్తు చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో మొగల్తూరు మండల వైస్ ఎంపీపీ కైల సుబ్బారావు, కాపు సంక్షేమ సంఘ ప్రతినిధులు ఆదూరి సత్యనారాయణ, లక్కు బాలాజీ, దేశంశెట్టి శ్రీనివాస్, కొత్తపల్లి నాగరాజు, ముక్కు పుల్లయ్య నాయుడు, కొత్తపల్లి బాబి, , బోనం నరసింహారావు కొత్తపల్లి ఆంజనేయులు, ఆకన ఫణి, చల్లా ముత్యాలరావు, మెండే రాజేష్ కుమార్, దూసనపూడి దొరబాబు, మేడిచర్ల రాజు, లక్కు రాంబాబు తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

## గ్రేడ్-3 పదోన్నతితో బి. గంగాభవానికి బదిలీ

### -కాకరపర్రు గ్రామపంచాయతీ అభివృద్ధి అధికారిగా నియామకం

**మొగల్తూరు, జూలై 15 (ప్రభాతవార్త):** మొగల్తూరు మండలం కేపీ పాలెం సౌత్ గ్రామపంచాయతీ అభివృద్ధి అధికారి (కార్యదర్శి) బి. గంగాభవానికి గ్రేడ్-4 నుంచి గ్రేడ్-3కు పదోన్నతి లభించింది. పదోన్నతితో పాటు తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం కాకరపర్రు గ్రామపంచాయతీ అభివృద్ధి అధికారిగా బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.గత ఏడాది కాలంగా కేపీ పాలెం సౌత్ గ్రామపంచాయతీ పూర్తి బాధ్యతలతో పాటు పేరుపాలెం నార్త్ గ్రామపంచాయతీకి ఇన్చార్జిగా విధులు నిర్వహించిన గంగాభవాని ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలులో విశేష కృషి చేశారని అధికారులు, ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు.ఈ సందర్భంగా గంగాభవాని మాట్లాడుతూ, కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, గ్రామపంచాయతీ సిబ్బంది, సచివాలయ ఉద్యోగుల సహకారంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులకు వేగంగా అందించగలిగామని తెలిపారు. ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించిన అందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.పదోన్నతితో కాకరపర్రు గ్రామపంచాయతీకి బదిలీపై వెళ్తున్న సందర్భంగా కేపీ పాలెం సౌత్, పేరుపాలెం నార్త్ గ్రామాల ప్రజలు, ప్రజాప్రతినిధులు, గ్రామపంచాయతీ సిబ్బంది ఆమెకు ఘనంగా శుభాకాంక్షలు తెలిపారు.గంగాభవాని పదోన్నతిపై నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, జిల్లా పంచాయతీ అధికారి కె. అనురాధ, మొగల్తూరు ఎంపీడీవో సీహెచ్ త్రిశూలపాణి, డిప్యూటీ ఎంపీడీవో మేడిది నవీన్ కిరణ్, ఎంఎస్జీఓ ఎన్వీఎస్ సూర్యనారాయణ, ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ ఎన్సీహెచ్ శ్రీనివాస్, అలాగే మొగల్తూరు మండలంలోని వివిధ గ్రామపంచాయతీల అభివృద్ధి అధికారులు, సిబ్బంది ఆమెకు అభినందనలు తెలియజేశారు.

## రామకోటయ్య తిరిగి బిజెపి తీర్థం



**చాట్రాయి, జులై 15 ప్రభాతవార్త** నూజివీడు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ చిన్నం రామకోటయ్య బుధవారం తిరిగి బిజెపిలో చేరారు. భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పి.వి.ఎన్.మాధవ్ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో రామకోటయ్యకు బిజెపి కండువా వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.బిజెపి ఏలూరు జిల్లా అధ్యక్షులు చౌటపల్లి విక్రమ్ కిషోర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొరళ్ల సుధాకర్ కృష్ణ ,కట్నేని కృష్ణ ప్రసాద్,జిల్లా ప్రధాన కార్యదర్శి గాదె రాంబాబు,బిజెపి రాష్ట్ర నాయకులు,ఏలూరు జిల్లా బిజెపి నాయకులు పెద్దసంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

**-విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూత**

**మొగల్తూరు, జులై 15 (ప్రభాతవార్త):** మొగల్తూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారి-216పై ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఓ యువకుడు విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాళ్ల మండలం దొడ్డనపూడి గ్రామానికి చెందిన దండిపోలు సాల్మన్ రాజు (25) భార్య వెంకటేశ్వరమ్మ ప్రస్తుతం గర్భిణి కావడంతో మొగల్తూరు మండలం చింతరేవులోని తన పుట్టింటి వద్ద ఉంటోంది. సాల్మన్ రాజు తరచూ భార్యను చూసేందుకు వచ్చి, ఇక్కడ చెరువు పనులకు వెళ్తూ జీవనం సాగిస్తున్నాడు.ఈ నెల 9వ తేదీ సాయంత్రం నాగిడిపాలెం నుంచి ముత్యాలపల్లి గ్రామానికి స్ప్లెండర్ మోటార్‌సైకిల్‌పై బయలుదేరిన సాల్మన్ రాజు, రాత్రి సుమారు 7 గంటల సమయంలో జాతీయ రహదారి-216పై దారతిప్ప వంతెన సమీపానికి చేరుకోగానే బైక్ అదుపుతప్పి రోడ్డుపక్కన ఉన్న హైవే ఇనుప రైలింగ్‌ను బలంగా ఢీకొట్టాడు. ప్రమాదంలో ఆయన నుదిటికి తీవ్ర గాయాలై స్పృహ కోల్పోయాడు.స్థానికులు వెంటనే స్పందించి సాల్మన్ రాజు మొబైల్ ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అనంతరం బంధువులు 108 అంబులెన్స్ సహాయంతో భీమవరంలోని వర్మ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మధ్యాహ్నం మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.మృతుడి భార్య వెంకటేశ్వరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మొగల్తూరు సబ్ ఇన్‌స్పెక్టర్ కె. నాగేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. యువకుడి మృతితో కుటుంబంలో విషాదం నెలకొంది.

## వాటర్ ట్యాంకర్లను ప్రారంభించిన వైసిపి నేత పోసిన

**కలిదిండి జులై 15 (ప్రభాతవార్త)** వైసిపి సీనియర్ నాయకులు, రాష్ట్ర గౌడ సంఘం అధ్యక్షులు పోసిన చెంచు రామారావు ప్రజల దాహార్తి తీర్చేందుకు ఉచిత మంచినీటి ట్యాంకర్లను తన సొంత నిధులతో ఏర్పాటు చేసి మండల కేంద్రమైన కలిదిండి గ్రామంలో బుధవారం ప్రారంభించారు. ముందుగా దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ప్రజల దాహార్తిని తీర్చే లక్ష్యంతో ఉచిత మంచినీటి వాటర్ ట్యాంకర్లను స్థానిక నాయకులతో కలిసి రామారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా ట్యాంకర్ల ద్వారా ఉచిత మంచినీటి సరఫరా చేస్తున్నామని, వాటితోపాటు కొత్తగా రెండు ట్యాంకర్లను ప్రారంభించి ప్రజలకు అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. అనంతరం చలో భీమవరం అనే కార్యక్రమానికి మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి వస్తున్న సందర్భంగా ఉచిత మంచినీటి ట్యాంకర్లను అక్కడకు పంపినట్లు తెలిపారు. సామాజిక బాధ్యతను కార్య రూపంలో చూపిస్తున్న రామారావు ను పలువురు అభినందించారు.



## మెమో-57 అమలుతో 10,715 కుటుంబాలకు న్యాయంభూపతిరాజు



**పెనుమంట్ర, జులై-16, (ప్రభాతవార్త):**రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన మెమో-57ను అనుసరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల 2004 సెప్టెంబర్ 1కు ముందు విడుదలైన నోటిఫికేషన్ ద్వారా ఎంపికై, వివిధ కారణాలతో సెప్టెంబర్ 1 తర్వాత ఉద్యోగంలో చేరిన ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) వర్తింపజేయడం ద్వారా 10,715 కుటుంబాలకు న్యాయం జరిగిందని ఆంధ్రప్రదేశ్ అమరావతి రెవెన్యూ ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ భూపతిరాజు రవీంద్రరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.అదే సమయంలో, 2004కు ముందు నుంచే వివిధ కేడర్లలో ప్రభుత్వ సేవలో ఉన్న ఉద్యోగులందరికీ పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అలాగే 2004 తర్వాత ప్రభుత్వ ఉద్యోగాల్లో చేరిన సీపీఎస్ ఉద్యోగులందరికీ కూడా ఓపీఎస్ అమలు చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.2024 సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలోని సీపీఎస్ ఉద్యోగులందరికీ పాత పెన్షన్ విధానం అమలు చేయాలని, ఈ విషయంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్‌లతో చర్చించి సానుకూల నిర్ణయం తీసుకునేలా కృషి చేయాలని భూపతిరాజు రవీంద్ర రాజు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులందరికీ ఓపీఎస్ అమలు చేయాలని ఆయన కోరారు.

## అల్లినగరంలో టిడిపి మండల పార్టీ సమావేశం

**మండవల్లి జులై 15(ప్రభాతవార్త)** మండలంలోని అల్లినగరం గ్రామంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నారగాని వీర వెంకట నాగేశ్వరావు (కొండ)అధ్యక్షతన బుధవారం మండల స్థాయి సమావేశం నిర్వహించారు. పార్టీ బలోపేతం, గ్రామ స్థాయిలో చేపట్టాల్సిన కార్యక్రమాలు, కార్యకర్తల సమన్వయం, రానున్న పార్టీ కార్యక్రమాల విజయవంతమైన నిర్వహణపై నాయకులు చర్చించారు.ఈ సమావేశంలో పార్టీ నాయకులు గజ్జల గణేష్,గుడివాడ గణేష్,కోసూరి మాణిక్యాలరావు, వీరవల్లి శివయ్య,పాముల జోసెఫ్ తంబి, తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## బిజెపిలో చేరిన నూజివీడు మాజీ ఎమ్మెల్యే డా. చిన్నం రామకోటయ్య

**నూజివీడు, జులై 14 ప్రభాతవార్త :** నూజివీడు మాజీ ఎమెల్యే డాక్టర్ చిన్నం రామకోటయ్య బుధవారం బిజెపి లో చేరారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పి.వి.ఎన్.మాధవ్ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో రామకోటయ్య కి బిజెపి కండువా వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.బిజెపి ఏలూరు జిల్లా అధ్యక్షులు చౌటపల్లి విక్రమ్ కిషోర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొరళ్ల సుధాకర్ కృష్ణ , కట్నేని కృష్ణ ప్రసాద్ ,జిల్లా ప్రధాన కార్యదర్శి గాదె రాంబాబు ,బిజెపి రాష్ట్ర నాయకులు,ఏలూరు జిల్లా బిజెపి నాయకులు పెద్దసంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.



## మహిళలకు ఆదర్శం దుర్గాబాయి దేశ్ ముఖ్

**భీమవరం జులై 15 ప్రభాతవార్త** స్త్రీల అభ్యున్నతి కోసం ఎనలేని కృషి చేసిన మహనీయురాలు, స్వాతంత్ర్య సమర యోధురాలు, సంఘ సంస్కర్త, దుర్గాబాయి దేశ్ ముఖ్ అని, మహిళలకు ఆమె ఆదర్శమని ఇన్నర్ వీల్ క్లబ్ డిస్ట్రిక్ గవర్నర్ ఆరేటి రాణి అన్నారు.



భీమవరం వీరమ్మ పార్క్ లోని తెలుగు తల్లి విగ్రహం వద్ద శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో బుధవారం దుర్గాబాయి దేశ్ ముఖ్ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇన్నర్ వీల్ క్లబ్ డిస్ట్రిక్ గవర్నర్ రాణి మాట్లాడుతూ దుర్గాబాయి దేశ్ ముఖ్ సంఘ సంస్కర్తగా మహిళ అభ్యున్నతికి ఎంతగానో కృషి చేశారని అన్నారు. పర్వతారోహిణి గొట్టుముక్కల వాణి మాట్లాడుతూ సాంఘిక సంక్షేమ సంస్థలను ప్రారంభించి స్త్రీల అభ్యున్నతికి కృషి చేసారని, కేంద్ర సాంఘిక సంక్షేమ బోర్డు 1998లో ఈవిడ పేరున డా దుర్గాబాయి దేశ్‌ముఖ్ అవార్డును నెలకొల్పారన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఆదర్శ మహిళ సంఘాలు స్థాపించి ప్రభుత్వపరంగా మహిళ సంక్షేమ కార్యక్రమాలకు రూపకల్పన చేసిన మహిళ మూర్తి దేశ్‌ముఖ్ అని అన్నారు. అనంతరం 7 గురు మహిళలకు దుర్గాబాయి దేశ్‌ముఖ్ అవార్డులను అందించి సత్కరించారు.వివిధ పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు ప్రశంసా పత్రాలను అందించారు. కార్యక్రమంలో లక్ష్మి భవానీ, అరసవల్లి సుబ్రహ్మణ్యం, ఎస్ కె చాన్ భాషా, ఎస్ సత్యనారాయణ రాజు, పి రాజబాబు, ఎం సుసాన్, జి సునీతా రాణి, పి వెంకట లక్ష్మి, బి స్నేహ కుమారి తదితరులు పాల్గొన్నారు.

## కాళ్ళకూరు శ్రీ వెంకటేశ్వర స్వామికి రూ.1,11,116/- లు



**కాళ్ల, జులై 15( ప్రభాతవార్త)** కాళ్ళకూరు స్వయంభూః శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం మాడవీధులు విస్తరణకు అన్నదాన భవనము అభివృద్ధికిదాతల సహకారం అభినందనీయమని దేవాలయ పాలకవర్గ అధ్యక్షులు అడ్డాల శివరామరాజు అన్నారు. శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా మాడవీధులు విస్తరణకు స్థలం కొనుగోలు నిమిత్తం దొడ్డనపూడికి చెందిన కీ.శే. వెలివెల సత్యనారాయణ జ్ఞాపకార్థము భార్య నాగమణి కుమారుడు వెలివెల రామకృష్ణ-కనకదుర్గ దంపతులు. రూ. 1,11,116/- లువిరాళాన్ని ఆలయ కార్యనిర్వహణాధికారి మోకా అరుణ కుమార్, ఆలయ ధర్మకర్తల మండలిఅధ్యక్షులు అడ్డాల శివరామరాజులకు అందజేశారు. ఈ సందర్భంగా శివరామరాజు మాట్లాడుతూ ఆలయాన్ని అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో విరాళం అందించిన దాతలకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో, ఆలయ ధర్మకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.దాతలను అభినందించి వారికి స్వామి వారి శేష వస్త్రం ప్రసాదములు, వేద ఆశీర్వచనం అందజేశారు.

## వేగంగా చింతలపూడి ఎత్తిపోతల పనులు ముసునూరు టిడిపి మండల పార్టీ అధ్యక్షులు గద్దె రఘుబాబు

**ముసునూరు జులై 14 ప్రభాతవార్త:**చింతలపూడి ఎత్తిపోతల పనులను త్వరగా పూర్తి చేస్తామని, మండలంలో రహదారులు, ఇతర అభివృద్ధి పనులు వేగవంతంగా చేస్తామని మండల టిడిపి అధ్యక్షులు గద్దె రఘుబాబు అన్నారు. బుధవారం ముసునూరులో మండల పార్టీ సమావేశం నిర్వహించబడింది. ఇందులో ముఖ్యంగా 2 తీర్మానాలను బలపరచడం జరిగినది. మొదటిగా చింతలపూడి ఎత్తిపోతల ఎత్తిపోతల పథకాన్ని పూర్తిచేసి రైతులకు త్వరగా సాగునీరు ఇవ్వాలని తీర్మానించారు. రెండవది నూజివీడు నుండి ఏలూరు వెళ్ళే ప్రయాణికుల నుండి వచ్చిన వినతులను దృష్టిలో పెట్టుకుని రోడ్డును వెంటనే వేయించవలసిందిగా తీర్మానించడం జరిగింది. ముఖ్యంగా మరో మూడు నెలల్లో జరగబోయే పంచాయతీ ఎన్నికల్లో ప్రతి పంచాయతీలో తెలుగుదేశం పార్టీ విజయకేతనం ఎగరవేయాల్సిందిగా ఆదేశించారు. గ్రామంలో ఎలాంటి సమస్యలున్న తన దృష్టికి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. అందరూ కలిసికట్టుగా పనిచేసే ఏకతాటి మీదకు రావాల్సిందిగా కోరారు. కొంతమంది రైతులు ట్రాన్స్ఫార్మర్ల కొరత ఉందని తెలియజేయగా వారికి వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి వారి సమస్యను పరిష్కారం చేయడం జరిగినది. ఈ కార్యక్రమానికి 16 గ్రామాల పార్టీ అధ్యక్షులు ముఖ్య నాయకులు జిల్లా అనుబంధ కమిటీలు నాయకులు, మండల టిడిపి మాజీ అధ్యక్షులు దేవినేని దేలారామ్, మాజీ జడ్పిటిసి లు కందుల పిచ్చయ్య, చిలుకూరి వెంకటేశ్వరరావు, నూజివీడు నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షులు కొండేటి బాబి, నూజివీడు నియోజకవర్గ బీసీ సెల్ ఉపాధ్యక్షులు తోట శ్రీనివాసరావు, ముసునూరు గ్రామ టిడిపి అధ్యక్షులు గారపాటి నరసింహరావు, మార్కెట్ యార్డ్ కమిటీ డైరెక్టర్లు మాజీ సర్పంచులు ఇతర నాయకులు పాల్గొన్నారు.



## రైతుల అంగీకారంతోనే ధరల నిర్ణయం ఉండాలి : మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్



**భీమవరం టౌన్ జులై 15 : ప్రభాతవార్త** రాష్ట్రంలో యావత్ రైతాంగం పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక సమస్యల సుడిగుండంలో కూరుకుపోయిన పరిస్థితులు కనిపిస్తున్నాయని మాజీ ముఖ్యమంత్రి, వైయస్సార్సీపి అధినేత జగన్మోహన్ రెడ్డి అన్నారు. విపరీతంగా పెరిగిన రొయ్యల సీడ్, ఫీడ్ ధరలు తెలుసుకొని, ఆక్వా రైతుల ఇబ్బందులను ముఖాముఖిగా తెలుసుకొని మాట్లాడటం ద్వారా ఆక్వా సమస్యల పరిష్కార నిమిత్తం పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రైతాంగం పండించిన ప్రతి పంటకు గిట్టుబాటు ధర లేదని ఆక్వా రంగం కూడా అత్యంత దయనీయ పరిస్థితుల్లో ఉందని అన్నారు ఒక ధర పెరగాలంటే దానికి హేతుబద్ధత ఉండాలని ఇష్టానుసారంగా సీడ్ ఫీడ్ ధరలను పెంచుకుంటూ పోతున్నారని దీనిపై అదుపు లేదని విమర్శించారు.15 లక్షల మందికి పైగా ఉపాధి కల్పిస్తున్న రంగం ఆక్వా రంగమైన అన్నారు కానీ రైతుల ముఖాన కన్నీళ్లు వచ్చే పరిస్థితులు నేడు ఉన్నాయ న్నారు రైతుల అంగీకారంతోనే ధరల నిర్ణయం ఉండాలని ధరలు పెంచాలంటే అక్టోబర్ నవంబర్ మాసాల్లో పంటలు సమృద్ధిగా అందుబాటులో ఉన్న తరుణంలో రివ్యూ చేయాలని అన్నారు. ఆక్వా రైతాంగం అంతా తమ గోడును వెళ్ళబోసుకున్నారని, చంద్రబాబు చర్మం కొంచెం మందమని అందరికీ తెలిసిన విషయమే అని అన్నారు దున్నపోతుపై వర్షం పడితే ఎలాచలించదో ప్రస్తుత ప్రభుత్వం కూడా అదే మాదిరిగా తయారైంది అని అన్నారు. ఆక్వా రంగంలో రైతులకు అవసరమైన మెటీరియల్ సప్లై చేసే కంపెనీలు అన్నీ చంద్రబాబు సానుభూతి పరులకే ఉండటం రైతాంగం చేసుకున్న కర్మ అని అన్నారు సీడ్ ఫీడ్ వారే నిర్ణయిస్తారని రైతులు ఎంతో పెట్టుబడి పెట్టి సాగు చేస్తే పంట చేతికి వచ్చేసరికి వారంతా సిండికేట్లుగా ఏర్పడి రేట్లు ధమాలున పడేస్తున్నారని అన్నారు చంద్రబాబు సానుభూతిపరుల సిండికేట్ ఈ రాష్ట్రాన్ని నడిపిస్తుందని జగన్ విమర్శించారు. చంద్రబాబు వచ్చారంటే చాలు సిండికేట్లకు పండగే పండగ అని, రైతాంగానికి కన్నీళ్లే కన్నీళ్లు అని ఈ పరిస్థితి ఇప్పుడు రాష్ట్రంలో ఉందన్నారు. ఆక్వారంగా సమస్యల కోసం గత తమ ప్రభుత్వం లో అప్పడా ఉందని దానికి ముఖ్యమంత్రి చైర్మన్గా ఉండేవారని ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరించడం జరిగేదని, మూడు దఫాలుగా కంపెనీలు ధరలు పెంచితే తిరిగి వెనక్కి తీసుకొచ్చిన ఘనత తమదేనన్నారు. సీడ్ ఫీడ్ రేట్లు, మందులు, ప్రాసెసింగ్, కొనుగోలు ధరలు మార్కెటింగ్ ఎక్కడ ఏ సమస్య వచ్చినా చైర్మన్ తోడుగా ఉంటాడని చట్టంలో ఉందన్నారు. కంపెనీలు ఇస్తానుసారంగా ధరలూ పెంచుతూ పోతే ముఖ్యమంత్రి ఎందుకు అదుపు చేయలేకపోతున్నారని ప్రశ్నించారు కిలో ధర 14 నుండి 16 వరకు ఎడాపెడా పెంచి, ఆందోళన వెలిబుచ్చితే కంటితడుపు చర్యగా రెండు రూపాయల తగ్గించారు అన్నారు చంద్రబాబు భాషలో చెప్పాలంటే వంద కొరడా దెబ్బలు కాదు 98 మాత్రమే అని చెప్పినట్టు ఉందన్నారు రైతాంగం ఎలా బ్రతుకుతుందని జగన్ ప్రశ్నించారు ఫీడ్ ఖర్చే 60 శాతం అవుతుందన్నారు. ధరలు పెంచినప్పుడు ఉత్పత్తులు ధరలు కూడా పెంచాల్సిందే అన్నారు. ధరలు తగ్గినప్పటికీ ఉత్పత్తుల ధరలు పెంచకపోవడం దారుణమని అన్నారు. తమ ప్రభుత్వంలో విద్యుత్తు యూనిట్ రూపాయిన్నరకే, 57 నెలలపాటు 3,306 కోట్లు సబ్సిడీ భరించి విద్యుత్ ఇచ్చిన ఘనత వైఎస్ఆర్సిపి ప్రభుత్వానిదేనన్నారు.2014 నుండి 19 వరకు విద్యుత్ యూనిట్ 3. 85 పైసలు చొప్పున ఉండేదన్నారు. జగన్ పాదయాత్ర మొదలైనాక ఎన్నికలకు నాలుగు నెలల ముందు రెండు రూపాయలు ఇస్తామని చంద్రబాబు నాయుడు ప్రభుత్వం జీవో మాత్రమే ఇచ్చారని, తమ అధికారంలోకి వచ్చి ఆ సబ్సిడీ 451కోట్లు చెల్లించామన్నారు. సూపర్ సిక్స్ సెవెన్ హామీలు, మోసాలతో అడుగు ముందుకేసి ప్రజలను మోసం చేశారన్నారు 2021- 22, 2023-24 వరుసగా బెస్ట్ మెరైన్ అవార్డు అందుకున్న ప్రభుత్వం తమదేనన్నారు గత ప్రభుత్వంలో యాంటీబ యోటిక్ అవశేషాలు 86% ఉంటే తమ హయాంలో కేవలం 20 శాతం మాత్రమే అన్నారు.2018-19లో ఆక్వా ఎగుమతుల విలువ 13855 కోట్లు ఉంటే వైఎస్ఆర్సిపి ప్రభుత్వ హయాంలో 20వేల కోట్లు ఉంద న్నారు నరసాపురంలో ఫిషరీస్ యూనివర్సిటీ నిలిచిపోయిందన్నారు మెడికల్ కాలేజీ కూడా ఆగిపోయిన పరిస్థితి ఉందన్నారు మీ అందరి కష్టాలు నాకు తెలుసు అని, అందరికీ ఒకటే హామీఇస్తున్నానని అది "నేను ఉన్నాను" అని మాత్రం చెబుతున్నాను అన్నారు పొగాకు రైతులకు గిట్టుబాటు ధర లేదని ఆర్ బి కే లు నిర్వీర్య మయ్యాయని, సబ్సిడీలు లేవని, వైఎస్ఆర్సిపి అందరికీ తోడుగా ఉంటుందని చెబుతున్నాను అన్నారు. అప్పటివరకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చే ప్రయత్నాలు కొనసాగుతాయని రైతాంగాన్ని చేయి పట్టి నడిపిస్తూ తోడుగా ఉంటామని. చెబుతున్నా మన్నారు..

## చెక్ బౌన్స్ కేసులకు ఈనెల 18న ప్రత్యేక లోక్ అదాలత్



**నరసాపురం జులై 15 ప్రభాతవార్త** ఈ నెల 18వ తారీఖున నరసాపురం కోర్టు సముదాయంలో చెక్ బౌన్స్ కేసుల పరిష్కారం కోసం ప్రత్యేక లోక్ అదాలత్ ను నిర్వహిస్తున్నట్లు 10వ అధనపు జిల్లా న్యాయ మూర్తి ఎ. వాసంతి పత్రికలకు తెలిపారు. ఈ లోక్ అదాలత్ లో చెక్ బౌన్స్ (నెగోషియబుల్ ఇన్స్ట్రుమెంట్ యాక్ట్ 1881) క్రింద నమోదైన కేసులు మాత్రమే రాజీ చేయబడతాయని, కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని , క్రిమినల్ అప్పీల్స్ కూడా రాజీ చేసుకోవచ్చునని న్యాయమూర్తి ఎ. వాసంతి తెలిపారు.

## ఆక్వా రైతుల సదస్సు సక్సెస్

**నరసాపురం జులై 15 ప్రభాతవార్త** భీమవరంలో వైసిపి రాష్ట్ర అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఆక్వా రైతు సదస్సు జయప్రదం అయిందని ప్రభుత్వం ఇప్పటికైనా కళ్ళు తెరిచి తీవ్రంగా నష్టపోయిన ఆక్వా రైతులను ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ముదునూరి ప్రసాద్ రాజు అన్నారు. భీమవరంలో జరిగిన సభకు ఆక్వా రైతులు భారీగా హాజరు కావడమే వారు పడుతున్న ఇబ్బందులకు నిదర్శనం అన్నారు. కార్యక్రమాన్ని జయప్రదం చేయడానికి కార్యకర్తలు రైతులు అందించిన సహకారానికి జిల్లా అధ్యక్షులుగా ప్రసాదరాజు కృతజ్ఞతలు తెలిపారు.



## కొయ్యలగూడెం పీహెచ్‌సీ హోమియో వైద్యాధికారిగా లీలా సౌజన్య



**కొయ్యలగూడెం జులై 15 ప్రభాత వార్త** కొయ్యలగూడెం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) ఆయుష్ హోమియోపతి వైద్యాధికారిగా డాక్టర్ లీలా సౌజన్య బాధ్యతలు స్వీకరించారు. మూడు రోజుల క్రితం ఆమె విధుల్లో చేరినట్లు బుధవారం విలేకరులకు తెలిపారు. ఏలూరు ఆర్డీడీ కార్యాలయం నుంచి వచ్చిన ఉత్తర్వుల ప్రకారం.. ఏడాది కాలానికి కాంట్రాక్ట్ ప్రాతిపదికన బాధ్యతలు చేపట్టినట్లు వెల్లడించారు. 2025 సెప్టెంబర్ 20న విడుదలైన మెరిట్ జాబితా ఆధారంగా ఈ నియామకం జరిగినట్లు పేర్కొన్నారు.గతంలో తణుకు, ఇరగవరం పరిధిలో రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమం (ఆర్బీఎస్కే) వైద్యాధికారిగా సేవలందించడమే కాకుండా, కోవిడ్ సమయంలోనూ కీలక బాధ్యతలు నిర్వహించినట్లు తెలిపారు. ఆదివారం తప్ప మిగిలిన అన్ని రోజుల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు స్థానిక పీహెచ్‌సీలో రోగులకు అందుబాటులో ఉంటానని స్పష్టం చేశారు. కొయ్యలగూడెం పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఉచిత ఆయుష్ హోమియోపతి మందులను, వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని లీలా సౌజన్య కోరారు

## దగాపడ్డ జాతి కోసం తిరగబడ్డ ముద్రగడ

**- నిస్వార్థ ఉద్యమానికి ముద్రగడ ఓ మార్క్ -ముదునూరి ప్రసాద్ రాజు**

**నరసాపురం జులై 15 ప్రభాతవార్త** కాపు కులస్తుల అభ్యున్నతి కోసం వారిని రాజకీయంగా ఆర్థికంగా గుర్తించాలని సామాజిక న్యాయం చేయాలని ఎటువంటి స్వార్థానికి లొంగకుండా దశాబ్దాలుగా తన ఎదుగుదలను కాపు కులం కోసం అర్పణం చేసిన స్ఫూర్తి ప్రదాత ముద్రగడ పద్మనాభం అని అటువంటి నేతలు అరుదుగా ఉంటారని పశ్చిమ వైసీపీ జిల్లా అధ్యక్షులు మాజీ శాసనసభ్యులు ముదునూరి ప్రసాదరాజు అన్నారు. నరసాపురం పార్టీ కార్యాలయం వద్ద జరిగిన ముద్రగడ సంతాప సభలో ఆయన మాట్లాడారు. వైసీపీ కార్యకర్తలు పాల్గొని నివాళులర్పించారు. తన ఉనికి కోసము తన పదవి కోసం ముద్రగడ ఏనాడు కుల రాజకీయాలు నడపలేదన్నారు. ఎటువంటి ఆశలు చూపిన అటువంటి వాటికి లొంగకుండా తన జాతిని పైకి తీసుకురండి అని కోరుతూ తిరుగులేని పోరాటం చేసిన యోధుడు ముద్రగడని చాటి చెప్పారు. గోదావరి జిల్లాలో కాపుల నుంచి ఒక ఉద్యమాన్ని కెరటంలా లేవనెత్తి ఈనాడు ఆ గుర్తింపును సాధించడం కోసం ఆయన చేసిన త్యాగం ఎనలేనిది అన్నారు. మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ బి వెంకటరమణ పిడి రాజు కామన బాల సత్యనారాయణ చాగంటి సత్యనారాయణ పప్పుల రామారావు కావలి నాని షేక్ బులి మస్తాన్ పతివాడ మార్కండేయులు సూర్యకాంతం తదితరులు పాల్గొని సంతాపం తెలిపారు.



## ముద్రగడ పద్మనాభం పార్థివ దేహానికి నివాళు లర్పించిన ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

**తాడేపల్లిగూడెం జులై 15 (ప్రభాతవార్త)**మాజీ మంత్రి, కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం పార్థివ దేహాన్ని ప్రత్తిపాడు నియోజకవర్గంలోని కిర్లంపూడి గ్రామంలో తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ బుధవారం సందర్శించి వారి భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ముద్రగడ పద్మనాభం కుటుంబ సభ్యులను పరామర్శించి, వారి మృతిపట్ల ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజా జీవితంలో ముద్రగడ పద్మనాభం చేసిన సేవలను స్మరించుకున్నారు. కాపు సామాజిక వర్గ హక్కుల సాధన కోసం ముద్రగడ పద్మనాభం చేసిన పోరాటాలు చిరస్మరణీయమని, ఆయన సేవలు ఎప్పటికీ మరువలేనివని కొనియాడారు. ముద్రగడ పద్మనాభం ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యాన్ని కుటుంబ సభ్యులకు ప్రసాదించాలని భగవంతుడిని కోరారు.



## ఆక్వా రైతులకు అండగా భీమవరం భారీగా తరలివెళ్లిన వైఎస్ఆర్సీపీ శ్రేణులు

**-ఆక్వా రైతుల పక్షాన వైఎస్సార్‌సీపీ నిరంతరం పోరాటం చేస్తుంది- వైయస్సార్ సిపి నియోజకవర్గ సమన్వయకర్త వడ్డీ రఘురాం నాయుడు**

**తాడేపల్లిగూడెం జులై15 (ప్రభాతవార్త)** ఆక్వా రైతుల సమస్యలకు పరిష్కారం కోరుతూ మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి భీమవరంలో నిర్వహించిన "ఆక్వా రైతులకు బాసట" కార్యక్రమానికి తాడేపల్లిగూడెం నియోజకవర్గం నుంచి వైఎస్సార్‌సీపీ శ్రేణులు బుధవారం భారీగా తరలివెళ్లారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త వడ్డి రఘురామ్ నాయుడు నేతృత్వంలో వేలాది మంది నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు భారీ ర్యాలీగా భీమవరం వెళ్లారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాలు, వార్డుల నుంచి నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు పట్టణానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చి పార్టీ జెండాలతో అలంకరించిన 800 మోటార్ సైకిళ్లు, 100 ఆటోలు, 125 కార్లలో బయలుదేరి వెళ్లారు. వైఎస్ఆర్సిపి నాయకుల ర్యాలీగా వెళ్లటంతో పట్టణంలో పండుగ వాతావరణం నెలకొంది. పార్టీ జెండాలు రెపరెపలాడుతుండగా, కార్యకర్తలు జగన్మోహన్ రెడ్డికి, వడ్డీ రఘురాం నాయుడుకి మద్దతుగా నినాదాలు చేస్తూ ఉత్సాహంగా ముందుకు సాగారు. ఈ సందర్భంగా వడ్డి రఘురామ్ నాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో ఆక్వా రంగం తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని, రైతుల సమస్యలను ప్రజల ముందుకుతీసుకురావడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఆక్వా రైతుల పక్షాన వైఎస్సార్‌సీపీ నిరంతరం పోరాటం చేస్తుందని, వారి న్యాయపరమైన హక్కుల సాధన కోసం పార్టీ ఎప్పుడూ అండగా నిలుస్తుందని తెలియజేశారు. పట్టణంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన ఈ ర్యాలీకి మార్గమధ్యంలో పలుచోట్ల ప్రజలు స్వాగతం పలికారు. భారీ సంఖ్యలో వాహనాలతో శ్రేణులు ఒకేసారి తరలివెళ్లడం వైఎస్సార్‌సీపీలో నెలకొన్న నూతన ఉత్సాహానికి నిదర్శనంగా కనిపించింది. వడ్డీ రఘురాం పిలుపునకు నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణుల నుంచి విశేష స్పందన లభించటం నాయకుల్లో మరింత ఉత్సాహాన్ని నింపింది. ఈ కార్యక్రమంలో గొర్రెల శ్రీనివాసరావు మాకరాజు సతీష్, సబ్బితి బ్రహ్మయ్య, చిట్టూరి బాపన్న, దారపురెడ్డి శ్రీనివాసరావు, తానేటి అజయ్ తాతారావు, శ్రీనివాసరావు, అనిల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## ఎస్ టి యూ అభినందనలు



**పాలకొల్లు జులై 15 ప్రభాతవార్త** పి.ఎం. శ్రీ.బి. ఆర్. ఎం. వి. ఎం ఉన్నత పాఠశాల,పాలకొల్లు కు నూతనంగా ఎఫ్ఏసి ప్రధానోపాధ్యాయురాలిగా నియమితులైన ఎం. శివలీల కి పాలకొల్లు ఎస్ టి యు పట్టణ శాఖ తరపున శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ టి యు పట్టణ శాఖ ప్రధాన కార్యదర్శి డి. రాజకుమార్ మాట్లాడితూ పాఠశాలను అభివృద్ధి పదం లో నడపాలని , పదవ తరగతి ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేయాలని తెలిపారు.కార్యక్రమంలో ఎస్టి యు పట్టణ శాఖ అధ్యక్షులు ఆర్.భవానీ ప్రసాద్ మహిళా అధ్యక్షురాలు రాలు ఈ. రమాదేవి గారు ఎస్ టి యూ కార్యకర్తలు పాల్గొన్నారు.

## పబ్లిసిటీ కోసమే జగన్ భీమవరం పర్యటన

**-జగన్ రెడ్డి హయాంలో ఆక్వా రంగం సర్వనాశనం- మాజీ ఎంపీ సీతారామలక్ష్మి**



**భీమవరం జులై 15 ప్రభాతవార్త** కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని రాజ్యసభ మాజీ సభ్యురాలు, టీడీపీ భీమవరం నియోజకవర్గ ఇన్ ఛార్జ్ తోట సీతారామలక్ష్మి అన్నారు. భీమవరం టిడిపి కార్యాలయంలో పట్టణ అధ్యక్షులు మద్దుల రాము అధ్యక్షతన బుధవారం పార్టీ నియోజవర్గ స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. మాజీ ఎంపీ సీతారామలక్ష్మి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సాధించిన విజయాలు, ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. పెన్షన్లు, తల్లికి వందనం, ఉచిత గ్యాస్ సిలిండర్లు, అన్నదాత సుఖీభవ తదితర పథకాలు కూటమి ప్రభుత్వం అందిస్తుందని, గొడ్డలి పార్టీ చేస్తున్న ఆరోపణలను తిప్పికొట్టాలని సూచించారు. నియోజక వర్గ పరిశీలకులు సాయిరామ్, టిడిపి రాష్ట్ర మాజీ కోశాధికారి మెంటే పార్థసారథి, రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు, రాష్ట్ర కృష్ణ బలిజ పూసల కార్పొరేషన్ చైర్మన్ గంటా త్రిమూర్తులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ రెండేళ్ల విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియకు టిడిపి కార్యకర్తలందరూ పాల్గొనాలని, ఏ ఒక్క ఓటు కూడా పోకుండా చూడాలన్నారు. జగన్‌రెడ్డి పాలనలో వ్యవస్థలు నిర్వీర్యం అయ్యాయని అన్నారు. టిడిపి పట్టణ అధ్యక్ష , కార్యదర్శులు మద్దుల రాము, చెల్లబోయిన గోవింద్ మాట్లాడుతూ జగన్ రెడ్డి హయాంలో ఆక్వా రంగం సర్వనాశనం అయిందని, పబ్లిసిటీ కోసమే జగన్ భీమవరం పర్యటన చేస్తున్నారని విమర్శించారు. గత ఎన్నికల ముందు ఆక్వా రైతులకు రూ. 1.50 కే విద్యుత్ ఇస్తామని చెప్పిన జగన్ రెడ్డి, అధికారంలోకి వచ్చాక మాట తప్పారన్నారు. రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ షబీనా బేగం, గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ పామర్తి వెంకట్రామయ్య, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ చెరుకుపల్లి సంతోష్ మాట్లాడుతూ ఎన్నికల ముందు ఆక్వా రైతులకు ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుందని, జగన్ మాత్రం ఆక్వా రైతులను మోసం చేసారని విమర్శించారు. కార్యక్రమంలో ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ ఎద్దు ఏసుపాదం, మాజీ కౌన్సిలర్లు మైలబత్తుల ఐజాక్ బాబు, విజ్జురోతి రాఘవులు, గంధం రాధా, కొండ్రు శ్రీనివాస్, యలమంచిలి శ్రీనివాస్, నసీమ బేగం, ఫిరోజ్, ఎండి షాబు, కోళ్ల నాగబాబు, చెరుకు తిరుపతిరావు, గంగాధర్ తిలక్ తదితరులు పాల్గొన్నారు.

## దళిత కుటుంబాలకు ఇళ్ల పట్టాలిచ్చి, రక్షణ కల్పించాలి

**-కె వి పి ఎస్ డిమాండ్**

**జంగారెడ్డిగూడెం రూరల్ జులై 15 ప్రభాత వార్త** జంగారెడ్డిగూడెం మండలం తిరుమలపురం గ్రామంలోని సర్వే నెంబర్ 98/1లో 25 ఏళ్లుగా నివసిస్తున్న దళిత కుటుంబాలకు ఇళ్ల పట్టాలు ఇచ్చి, రక్షణ కల్పించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం ( కె వి పి ఎస్) డిమాండ్ చేసింది. బుధవారం జంగారెడ్డిగూడెం తహసిల్దార్ కు సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా. కె వి పి ఎస్ జిల్లా కార్యదర్శి ఎ. ఫ్రాన్సిస్ మాట్లాడుతూ, దళితులు నివాసం ఉంటున్న ఇళ్లు తమ పొలంలోకి వెళ్లే దారిని అడ్డుకుంటున్నాయనే నెపంతో మారగాని దిలీప్ అనే వ్యక్తి చాలా కాలంగా వారిని వేధిస్తున్నాడని ఆరోపించారు. అధికారులతో ఒత్తిడి తెప్పిస్తూ దళితులను ఇబ్బందులకు గురిచేస్తున్నాడని పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి బాధితులకు రక్షణ కల్పించాలని, నివాస స్థలాలకు పట్టాలు ఇచ్చి పక్కా ఇళ్లు నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాధితులు ఎస్. మరియమ్మ, దుర్గమ్మ, కుమారి, ఏసు తదితరులు పాల్గొన్నారు.




## అధికారులు ప్రజల సమస్యలపై దృష్టి పెట్టాలి:

**-కలెక్టర్ నాగరాణి**



**భీమవరం జులై 15 ప్రభాతవార్త** జిల్లాలో ప్రజాసమ స్యలపరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజలనుండి వచ్చిన అర్జీలను పరిష్క రించడానికి దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్లోని పి.జి.ఆర్.ఎస్ హాల్ నుండి జిల్లా స్థాయి, మండల స్థాయి అధికారులతో పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారంపైజిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాల ద్వారా ప్రజల నుండి వచ్చిన అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పూర్తి స్థాయిలో పరిష్క రించాలని అధికారు లకు చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన అర్జీలను ప్రజల సంతృప్తి మేరకు పరిష్కరించా లన్నారు. పరిష్కరించడానికి వీలు కానీ సమస్య లను అర్జీదారులకు ఎండార్స్మెంట్ ద్వారా తెలియజే యాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన అర్జీలను సంబంధిత శాఖల అధికారులు ప్రి ఆడిట్ మరియు ఆడిట్ తప్పనిసరిగా చేయాలని కలెక్టర్ చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కార వేద కార్యక్రమంలో వచ్చిన అర్జీలు తిరిగి రీఓపెన్ కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆమె చెప్పారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పీజీ ఆర్ఎస్ నోడల్ అధికారి దోశిరెడ్డి, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ కే సిహెచ్ అప్పారావు డిఆర్డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ వేణుగోపాల్ గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ పిచ్చయ్య జిల్లా పంచాయతీ అధికారి అనురాధ జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్ వెంకటేశ్వరరావు,తదితరులు పాల్గొన్నారు.

## మహిళల స్వయం ఉపాధికి నీటి నాణ్యత పరీక్షలు!



**భీమవరం జులై 15 ప్రభాతవార్త** మహిళల స్వయం ఉపాధి పథకానికి నీటి నాణ్యత పరీక్షలు ఎంతగానో దోహదపడతాయని భీమవరం ఎస్ ఆర్ కె ఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఎస్ టి ఐ (సైన్స్ టెక్నాలజీ ఇన్నోవేషన్) హబ్ హెడ్ డాక్టర్ జి హరీష్ కుమార్ వర్మ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం సైన్స్ అండ్ టెక్నాలజీ సహకారంతో కళాశాలలో ఏర్పాటుచేసిన ఎస్ టి ఐ హబ్ ఆధ్వర్యంలో మహిళలకు ఆక్వా చెరువుల్లో నీటి నాణ్యత ఐఓటి పరికరాల ద్వారా ఎలా తెలుసుకోవాలి అనే అంశంపై ఒకరోజు శిక్షణ అందించారు. ప్రధానంగా ఆక్సిజన్ లివిల్స్ ఈసీ, పీహెచ్, టెంపరేచర్ సెన్సార్స్ వీటి లెవెల్స్ ఏ విధంగా చూడాలి అని శిక్షణ అందించారు. ద్వారా మోనిటరింగ్ వంటి అంశాలు శిక్షణలో అందించారు. కార్యక్రమానికి గ్రామీణ మహిళలు హాజరయ్యారు. ఈ సందర్భంగా హరీష్ కుమార్ వర్మ మాట్లాడుతూ ఆక్వా చెరువుల్లో తరచు నీటి నాణ్యతలో లోపాలు తలెత్తుతుంటాయని వాటి పరీక్షను రైతులు పట్టణాలకు తీసుకొచ్చి పరీక్షించి వెళ్లవలసి వస్తుందని అదే మహిళల శిక్షణ పొందినట్లయితే తామే చెరువుల దగ్గరికి వెళ్లి వాటర్ టెస్టింగ్ చేసి యూనిట్ అక్కడ ఏర్పాటు చేసి రిమోట్ ద్వారా ఫలితాలు అందించి కొంత ఉపాధి పొందచ్చని చెప్పారు ఎందుకు కేంద్ర ప్రభుత్వం డిఎస్టి ద్వారా ఉచిత శిక్షణ అందించడం కూడా జరుగుతుందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ టి ఐ హబ్ సాంకేతిక సిబ్బంది కూడా పాల్గొన్నారు.